
CP 10966
C
01817







## ఉత్తరాంధ్రలోని

# బ్రాహ్మణాగ్రహారములు

పరిశోధనా వివరాల గ్రంథము

## సయ్యద్ మీర్ మహమ్మద్

894.827A
S98





Blank page

cp 10966

3

ఉత్తరాంధ్రలోని

# బ్రాహ్మణాగ్రహారములు

స్థల, చారిత్రక పరిశోధనా వివరాల గ్రంథము

రచయిత

## సయ్యద్ మీర్ మహమ్మద్

రిటైర్డ్ (అడిషనల్) పోలీసు సూపరింటెండెంటు

# BRAHMANA AGRAHAARAMULU

A brief account of Brahmin Inam Villages in the districts of
SRIKAKULAM, VIZIANAGARAM and VISAKHAPATNAM
(ERSTwhile Visakhapatnam District)

First Edition : April, 2006

Conceived and written by

(C) **Syed Mir Mohammad,** B.A.,
(Retd.) Additional Superintendent of Police
Bondilipuram Srikakulam - 532 001
Tel : 08942 - 278933, Cell : 939 0611 828

Under the guidance of

Bhamidipati Rama Gopalam **(BHARAGO)**
Arjun Apartments, Visakhaptnam - 530 022
Tel : 0891-2535550

Composed & Pagination by

Net Vihara
Flat No.1, Lakshmi Gayatri Apartments,
Rama Talkies Veg. Market Lane,
Visakhapatnam - 530 016
Ph : 0891-5515791

For Copies :
1. Author, at the above address

**Price : Rs. 60/-**

# నేపథ్యం

**అగ్రహారం** అనగా అత్యున్నత సత్కారం. బ్రాహ్మణులలో పండితులకు పాలకులిచ్చిన భూవసతి. అగ్రహారం అనేది భూమిరూపంలో ఇచ్చినప్పుడు బ్రాహ్మణులకే కాక, సేవలు, వృత్తులు నిర్వహించే కుమ్మరి, వడ్రంగి మున్నగు వారికి కూడా భూములను వేర్పాటు చేసి ఫలసాయంపై ఆధారపడి జీవించమని పాలకులు నిర్దేశించారు.

ఇతర జిల్లాలతో పోలిస్తే ఉత్తరాంధ్రలో గల మూడు జిల్లాల్లో ఈ అగ్రహారాలు హెచ్చు. దీనికి కారణం ఆ జిల్లాల్లో విజయనగరం, బొబ్బిలి, కురుపాం, చినమేరంగి, మందస, మాడుగుల మరియు పర్లాకిమిడి సంస్థానాల ప్రభావం ఉండడమే. అందరిలో విజయనగరం పాలకులు చాలా దానధర్మాలు చేసేరు. చివరకు ఒకానొక విజయనగరం పాలకుడు వేటకు వెళ్ళి, దారి తప్పి ఆకలివేయగా అక్కడున్న ఒక బ్రాహ్మణ స్త్రీని అన్నం పెట్టమని కోరగా వేళ మించిపోవడం చేత ఏ కూరా చేయలేక గరికతో పచ్చడి చేసి భోజనం పెట్టిందట. ఎంతో ఆకలితో ఉన్న ఆ పాలకుడు మహదానందం పొందాడు. ఆయనకు అన్నం పెట్టినావిడ గొర్తివారి ఆడపడుచు. ఆ పాలకుడు ఆవిడకు ఆ గ్రామాన్ని దానం చేశాడు. అందువలన ఆ ప్రాంతానికి గరికవలస అని పేరొచ్చింది.

అగ్రహారాల రద్దుకు పూర్వం బ్రాహ్మణులు ఉచ్ఛస్థితిలో ఉండేవారు. విద్యలాగానే సంగీతంలోను మరియు వైద్యంలోను అగ్రగాములుగా ఉండేవారు. కాని కళా వెంకటరావుగారు అవిభక్త మద్రాసు ప్రభుత్వంలో రెవెన్యూ మంత్రిగా ఉన్నప్పుడు అగ్రహారాలు రద్దచేశారు. అప్పటి నుండి అగ్రహారాలకు హీనదశ ప్రారంభమైంది. నిజానికి మన సమాజానికి వికాసం, చైతన్యం తీసుకొని వచ్చిన సంస్కరణ వాదులు బ్రాహ్మణులు. అంతేకాక స్వాతంత్ర్య సమరంలో ముందు నడిచిన వారు బ్రాహ్మణులే.

స్వాతంత్ర్యం గురించి త్యాగాలు చేసిన బ్రాహ్మణ మహనుభావులు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, గరిమెళ్ళ సత్యనారాయణ, పింగళి వెంకయ్య, దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు, మహర్షి బులుసు సాంబమూర్తి, బూర్గుల రామకృష్ణారావు, చెరుకువాడ వెంకట నరసింహం వంటివారు; సంఘసేవలో కందుకూరి వీరేశలింగం, ఉన్నవ లక్ష్మీనారాయణ, గురజాడ అప్పారావు, ముట్నూరి కృష్ణారావు వంటి వారు

మహోన్నతులు.

ఉత్తరాంధ్రలో బ్రాహ్మణ కళాకారులు, రచయితలలో హరికథా పితామహులు ఆదిభట్ల నారాయణదాసు, వైణిక సార్వభౌములు తుమరాడ సంగమేశ్వర శాస్త్రి, జె.వి. సోమయాజులు, చట్టి చిన్నపూర్ణయ్య పంతులు, మల్లాది విశ్వనాధకవిరాజు, శ్రీశ్రీ, చాసో, ఆరుద్ర, పీసపాటి నర్సింహమూర్తి - వీరందరు స్మరణీయులే.

నేను **1937** సంవత్సరంలో కాకినాడ గాంధీనగరంలో జన్మించాను. మా యింటి చుట్టూ రెండొందల బ్రాహ్మణ కుటుంబాలుండేవి. వాటి మధ్య మాదొక్కటే ముస్లిం కుటుంబం ఉండేది. చిన్నతనం నుండి నాకు బ్రాహ్మణ సాంగత్యం మెండు. నాకు 8 సంవత్సరాల వయసులో మా నాన్నగారి బాల్యమిత్రుడు శ్రీ చావలి నర్సింహమూర్తి గారి ఇంటిలో చదువు ప్రారంభం. వీరి కట్టుబాట్లు, దైనందిన జీవితం నన్నెంతగానో ఆకర్షించినవి.

నేను విద్యార్థిగా ఉండే రోజుల్లో అంటే స్కూల్ ఫైనల్ చదువుతున్న రోజుల్లో నేను, నా సహాధ్యాయి సినీనటుడు కీ॥శే॥ రావుగోపాలరావు భారత సోషలిస్టు పార్టీలో కార్యకర్తలుగా ఉండేవాళ్ళం. 1952లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మా అభ్యర్థి పారుపూడి రామమోహనరావు, ఎన్నికల ప్రచారంలో సోషలిస్టు పార్టీ నాయకులు మద్దూరి అన్నపూర్ణయ్య, కేతా జనార్దనరావు వంటి హేమాహేమీల వెంట తిరిగే భాగ్యం కలిగింది. నేను పోలీసు డిపార్టుమెంటులో చేరిన తరువాత శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో చాలాకాలం పనిచేశాను. ఆ ప్రాంతంలో ఉండే చల్లపేట, కలువరాయి, వెంగాపురం, కారివలస, కృష్ణరాయపురం, ప్రియాగ్రహారం, హరిశ్చంద్ర పురం, దేవాడ మరియు శ్రీరాంపురం వంటి అగ్రహారాలు దర్శించేను. జీర్ణావస్థలో ఉన్న ఇళ్ళు వారి దుర్భర పరిస్థితికి దర్పణం పట్టినవి. ఆ పరిస్థితులు నన్నెంతగానో చలింపచేశాయి. కలం తీసేలా చేశాయి. గతంలో ఈ మేధావుల గురించి ఏదో రాయాలన్న తపనను మరింత బలీయం చేశాయి.

ఎన్నో అగ్రహారాలు తిరిగి, ప్రస్తుతం ఉన్నవారితో సంభాషించి సమాచారాన్ని సేకరించాను. బొత్తిగా జనాభాలేని అగ్రహారాల గురించి ప్రస్తావించదలచుకోలేదు. నేను సంకల్పించిన పనికి న్యాయం చేకూర్చాననే భావిస్తున్నాను.

- సయ్యద్ మీర్ మహమ్మద్

# పరిచయం

**భారతీయ** సంప్రదాయంలో దానగుణం, జ్ఞానగుణం ఒకదానిని మించి మరొకటిగా ఉన్నాయి అంటే ఎవరూ ఆశ్చరపడనవసరం లేదు. ఒకనాటి కాలంలో జ్ఞానసంపద దానగుణాన్ని ప్రసాదించింది. జ్ఞానం పంచిపెట్టడమనేది గురుకులాల ద్వారా పౌరాణిక ఐతిహాసిక కాలాల నుండి అమలులో ఉన్నది. క్రమంగా జ్ఞానదానం చేయడానికి తగిన జ్ఞాననిధులు లేనివారు కూడా దానగుణం ఆధారంగా చరిత్రలో శాశ్వతులై నిలిచారు. భారతదేశపు జీవసూత్రం జ్ఞానంలోను దానంలోను దాగి ఉంది. పడమటి దేశాల నుండి దండయాత్రలు చేసి ఆక్రమణలకు పాల్పడిన పారశీకులను, హూణులను యథేచ్ఛగా రానిచ్చినది భారతదేశమే. ఆక్రమణ వలన ఆస్తులు పోయినా తనకు ఉన్నదానిలో కొంతభాగాన్ని దానం చేయగలగడం భారతీయ సంస్కృతిలో నిబిడీకృతమై ఉంది. పూర్వరచనలలో చెప్పిన ఛప్పన్న (56) రాజ్యాలు క్రమంగా అనేకత్వం నుండి ఏకత్వానికి పరిక్రమించినా రాజ్యాలు జమీందారీలయ్యాయి తప్ప దానమనే ప్రాణాధార గుణం సంస్కృతి నుండి వైదొలగలేదు. ఆవిధంగా పరిణామం చెందిన పాలనావ్యవస్థ దానం అనే గుణాన్ని కాపాడుకుంటూ పరంపరను నిలుపుకుంటూ రావడం భారతదేశానికే ప్రత్యేకం. ఈ వ్యవస్థ ఈ గుణం క్రమంగా కవిత్వంతో పాటు లలితకళలను, జ్యోతిషాది శాస్త్రాలను ప్రోత్సహించే ప్రక్రియకు పరిణామం చెందింది. అందులోంచి వచ్చినవే "అగ్రహారాలు".

"అగ్ర-హారం" అనగా అత్యున్నత సత్కారం అని చెప్పుకోవడానికి వీలు ఉన్నది. జమీందారులు అనగా భూస్వాములు. భూమిలేని, భుక్తిలేని కళాకారులకు శ్రమజీవులకు దానమిచ్చిన భూవసతులే "అగ్రహారాలు". కవిత్వం, సంగీతం, నాట్యం, శిల్పం మొదలైన ప్రదర్శనల కళాకారులతో పాటు కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, చాకలి, మంగలి, మాల, మాదిగ మొదలైన వృత్తి కళాకారులకు కూడా వారి వారి జీవన భృతులకు గాను భూవసతులను దానమిచ్చారు. ఇప్పుడు చెప్పుకుంటే ఆశ్చర్యం కలుగవచ్చు గాని, ఒకనాడు వృత్తికళాకారులకు భూవసతులను (ఇనాములు) ఇచ్చి ఆ భూముల ద్వారా వచ్చే గ్రాసాన్నే పారితోషికంగా భావించుకొని ఆ వృత్తులను నిర్వహించుకోమని నిబంధించేవారు. ప్రకృతి వైపరీత్యాల వలన, వాతావరణాల ఆటుపోటుల వలన భూముల నుండి ఆశించినంత ఫలం చేకూరక ఆయా వృత్తి కళాకారులు అర్థాకలితో జీవించవలసి వచ్చేది. అందువల్ల వెట్టిచాకిరీ అనే లక్షణం నెలకొని సాంఘిక అసాకర్యానికి దారితీసింది. ఇవన్నీ కారణాలుగా స్వాతంత్ర్య సిద్ధి అనంతరం జమీందారుల రద్దు చట్టం, అగ్రహారాలతో సహా ఇనాముల రద్దు చట్టం వచ్చాయి.

శాస్త్రాలను, పురాణాలను, ఇతిహాసాలను అవలోడనం చేసుకొని పరిణతి పొందిన బ్రాహ్మణులతో పాటు "శరీరాలకూ, గృహాలకూ" సేవలు చేసి పాత్రులైన నిమ్నకులాల వారి వరకు

వారు వీరనక ఎల్లరికి సంసార భారాలు పెరిగి గ్రామాలలో తగినంత భుక్తి దొరకని కాలం ఒకటి సంభవించింది. ఇది ఇంచుమించు 1914-47 అని చెప్పుకోవచ్చును. ఆర్థిక మాంద్యం ఒక వంక, తిండిగింజలు యుద్ధభూములకు తరలివెళ్ళడం మరొకవంక, జనాభా పెరుగుదల ఇంకొకవంక, వ్యక్తి స్వాతంత్ర్య కాంక్ష అవసరం వేరొకవంక - ఇలా పల్లెప్రజలను నాలుగు దిక్కుల నుండి నిస్సహాయులను చేసెయ్యడం వలన చదువుల కొరకు, వృత్తుల కొరకు, ఉద్యోగాల కొరకు పల్లెప్రజలు వారు వీరనకుండా అన్ని కులాల వారు పట్టణాలను చేరుకున్నారు. బ్రిటిష్ ప్రభుత్వం ఆంగ్ల విద్య చదువుకున్నవారికి విరివిగా ఉద్యోగావకాశాలను కల్పించింది. జమీందారులు అజమాయిషీ కోసమని కొందరికి ఉద్యోగాలిచ్చారు. విద్యావ్యాప్తి కోసం ఎలిమెంటరీ, హయ్యర్ ఎలిమెంటరీ బడులేకాక తాలూకా ముఖ్య స్థానరాలలో హైస్కూళ్ళు, జిల్లా కేంద్రాలలో కాలేజీలు వచ్చాయి. విశాఖపట్నంలో 1932లో విశ్వవిద్యాలయం నెలకొన్నది. ఉద్యోగాలకు, ఉద్యోగస్తుల సంతానాలకు చదువులకు అవకాశాలు ఏర్పడ్డాయి. ఎవరైనా ఇద్దరు కుటుంబ యాజమానులు ఒకరికొకరు తారసపడితే "మీ వాడికి ఏదైనా నౌకరీ దొరికిందా?" అనేది పలకరింపులలో మొదటిదిగా వచ్చేది.

విద్యాభ్యాసానికీ తద్వారా ఉద్యోగప్రాప్తికీ బ్రాహ్మణ యువకులకు మిగిలిన వారికంటే ఎక్కువ అవకాశాలు కలిగాయి. బ్రాహ్మణులు జిరాయితీ గ్రామాలలో అక్కడొకరు అక్కడొకరుగా ఉన్నా అగ్రహారాలలో వారి సంఖ్య ఎక్కువ. మొత్తం మీద బ్రాహ్మణులు మిగిలిన కులాలలో వారికంటే తమ పిల్లలను పట్టణాలకు చదువులకు గాను ఎక్కువమందిని పంపగలిగిన పరిస్థితి. శతాబ్దాల సంస్కృతిలో బ్రాహ్మణులు పేదరికాన్ని ఒక తప్పుగా కాక ఒక జీవనావస్థగా స్వీకరించగలిగారు. కనుక బ్రాహ్మణులు తమ పిల్లలను చదువుల నిమిత్తం పట్టణాలకు పంపించుకుంటూ ఉన్నప్పుడు అలనాటి గ్రామస్థులు తమ పిల్లలను గురుముఖ విద్యాప్రాప్తి కోసం అరణ్యాలకు పంపిన చందంగా ఎడబాటునుగాని, భిక్షాటనను గాని జీవనావస్థలుగానే స్వీకరించగలిగారు. "దూరమైతే అయ్యాడు గాని నాలుగక్షరాలు వంటపడతాయి. వారాలు చేసుకొని దినం వెళ్ళబుచ్చుకుంటాడు. వారాలు కుదరని నాడు భవతి భిక్షాందేహి అని యాచించుకోవడానికి హీనపడడు" అనే ధోరణి ఉండెను. దీనిని ఎవరో కవిత్వీకరించి "ఉపనయనము నాటి మాట ఉన్నది తండ్రీ" అన్నారు. ఇది దీనావస్థ అయినప్పటికీ ఇందులోంచి అవకాశాన్ని మాత్రమే స్వీకరించుకోగలిగిన పల్లెసీమ బ్రాహ్మణ కుమారులు ఎట్టి సంకోచాలకు లోనుకాకుండా చదువులు సాగించుకున్నారు. ఎంతోమంది గొప్పవారు 'మేము చిన్ననాడు వీధిదీపాల క్రింద కూర్చుని చదువుకు న్నాము" అని చెప్పడం ఇప్పటికీ ఉంది.

పైన చెప్పిన అవస్థలలో పేదరికం అనేది అన్ని కులాలలోను ఉండినప్పటికీ ఒక రాచబిడ్డగాని, ఒక వైశ్యబాలుడు గాని, ఒక శూద్రకుమారుడు గాని తెగువచేసి భిక్షాటనకు రాలేకపోయిన స్థితి. కనుక చదువుల పట్ల ఆసక్తి, ఆశ ఉన్నప్పటికీ వారు వెనక వరుసలోనే ఉండిపోయారు. ఈ నేపథ్యంలో

అగ్రహారీకులలో బ్రాహ్మణుల బిడ్డలు ఒకరికి పదిమందిగా విద్యాభ్యాసం నిమిత్తం పట్టణాలకు వెళ్ళగలిగారు.

సుమారు 1920 ప్రాంతంలో విజయనగరం మహారాజా వారు సింహాచలం దేవస్థానం నుండి తమ సంస్థానానికి చేరే దేవాదాయ రాబడిలో కొంతభాగాన్ని అన్నదానానికి గాను వినియోగించాలను తీర్మానించుకున్నారు. అమలులోకి వచ్చే ముందు నగరంలోని కొన్ని చోట్ల కులాల వారి సామూహిక అన్నదానం జరిగింది. బ్రాహ్మణులకు ఒకచోట, శూద్రులకు ఇంకొక చోట, పంచములకు మరొకచోట. ఈ పద్ధతి సత్రాల నిర్మాణానికి దారితీసింది. కస్పా దాటి కొత్తపేట వెళ్ళే త్రోవలో ఘోషా ఆసుపత్రి వెనుకవైపున "కైరాతి సత్రవు" అని చెప్పుకున్న అంబటి సత్రం వచ్చింది. ఇక్కడ శూద్రులకు, పంచములకు ఆకలివేళలప్పుడు అంబలి వడ్డించేవారు. క్రమంగా బిచ్చగాళ్ళు, కుష్ఠ మొదలైన రోగపీడితులు దీనిని నివాసస్థావరంగా చేసేసుకొని ప్రభువుల ఆలోచనను కొంతగా అపమార్గం పట్టించారు. కాని "విద్యార్థి భోజనాలయం" అని చెప్పుకోగల స్టూడెంట్సు బోర్డింగు హౌస్, లింగధారిపేట వద్ద నెలకొన్న అనంతరం మహారాజావారు తలపెట్టిన అన్నదానపు ఆలోచన ఒక పద్ధతికి, క్రమశిక్షణకు వచ్చింది. సుమారు 500 మంది విద్యార్థులకు రెండుపూటలా ఉచిత భోజనం అమర్చిపెట్టాలని నిర్ణయమైంది. దాదాపు 1200 చదరపు గజాల స్థలంలో ఒకరాతి కట్టడం నిర్మించారు. బ్రాహ్మణులు 200-300, శూద్రులు 100-150, హరిజనులు 40-50. వీరందరు పేదవారై ఉండాలని, కేవలం విద్యాభ్యాసం కోసమే విజయనగరం వచ్చి ఉండాలనీ, తల్లిదండ్రులతో బాటు ఉండే స్థానిక పేద విద్యార్థులకు ప్రవేశం లేదని కొన్ని నియమాలు పెట్టుకున్నారు. కులాలవారీ పంక్తులలో నిర్ణీత సమయాలలో భోజనాలు వడ్డించేవారు. క్షత్రియులలో కొందరు, వైశ్యులలో కొందరు ఇక్కడ భోజనాశ్రయం పొందే అర్హత, అవసరం - ఉన్నప్పటికీ వారిని శూద్రులతో బాటు కూర్చోబెట్టడం వల్ల అట్టి విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. హరిజనులకు వేరే ఒక భోజనశాల ఉండేది.

అప్పట్లో విశాఖపట్నం జిల్లా పాయకరావుపేట నుండి ఇచ్ఛాపురం వరకు విస్తరించి ఉండేది. ఇది వెనుకబడిన జిల్లాగా పరిగణనలోనికి వచ్చింది. కనుక మహారాజా వారి అన్నదానపు ఆలోచన ఈ "విద్యార్థి భోజనాలయం" ద్వారా ఒకానొక అపురూపమైన సిద్ధి పొందింది. తూర్పుగోదావరి జిల్లా నుండి విద్యాభ్యాసానికి గాను విజయనగరం చేరే అబ్బాయిలకు కూడా ఇందులో ప్రవేశం లభించింది. ఈ సత్రం ఏర్పడి ఉండడం వల్ల అగ్రహారాల నుండి వచ్చే బ్రాహ్మణ బాలురకు విద్యాభ్యాసం సుకరమైంది.

ఆనాటి విశాఖపట్నం జిల్లా ఇప్పుడు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం అనే మూడు జిల్లాలుగా ఉంది. ఇక్కడ ఉన్న చిన్న పెద్ద సంస్థానాల సంఖ్య మిగిలిన ప్రాంతాలలో ఉన్ననాటి కంటే ఎక్కువ. విజయనగరం, బొబ్బిలి, కురుపాం, మాడుగుల, పర్లాకిమిడి, చిన్నమేరంగి, మందస మొదలైన "ఎస్టేట్"ల పాలకులు బ్రాహ్మణులకు పెద్దపీటలు వేసినా మిగిలిన కులాల వారికి కూడా అగ్రహారాలను

ఇచ్చి వారిని పేదరికం నుండి కొంతమేరకైనా కాపాడగలిగారు. ఈనాడు భారతదేశంలోని కొన్ని పెద్ద పెద్ద పరిశ్రమలు కార్మిక వర్గాలకు భాగస్వామ్యాలు ఇస్తున్నట్లే ఆనాడు పాలకులు అగ్రహారాలను ఇచ్చారని సరిపోల్చుకోవచ్చును. అయితే "ఉచితంగా వచ్చే ఏ సంపదకూ గౌరవం కలగదు" అనే సూత్రం అమలులోనికి వచ్చిన చందంగా అగ్రహారీకులలో పేదవారు ఎంతో ఒదిగి ఉండేవారు అనుకున్నా అగ్రహారాలలో కూడా భూఖామందులు ఏర్పడి జమీందారులు చలాయించిన దానికి సరితూగే దర్జాలు వెలిగించారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారిని బలిష్టులు అణగద్రొక్కడం విశ్వమంతటా ఉన్నదే. భౌగోళిక శీతోష్ణ పరిస్థితులను బట్టి కూడా ఈ ఘట్టన బలం నిర్ణయమవు తుంది. "చీనాలో రిక్షావాలా, చెక్ దేశపు గని పనిమనిషి, ఐర్లాండున ఓడ కళాసీ, అణగారిన ఆర్తులందరూ" - అని శ్రీశ్రీగారు వచించారు. తాను ఎదుగుతూ తన ప్రక్కనున్న వాడు ఎదగకుండా చూసుకోవడం అభ్యుదయంలో ఒక భాగమే. బ్రాహ్మణ జమీందారులు, క్షత్రియ జమీందారులకు తీసిపోని విధంగా పెత్తనాలు, దర్జాలు చలాయించేవారు. ఈ పద్ధతి వివేకవంతులకు, హేతువాదులకు జీర్ణం కానందు వలననే జమీందారీల రద్దు చట్టం (1948), ఇనాముల రద్దు చట్టం (1956) వచ్చాయి. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బ్రాహ్మణ జమీందారు (అగ్రహారికులు) కళా వెంకటరావుగారు, ఉమ్మడి మద్రాసు రాష్ట్రాలలో రెవెన్యూ మంత్రిగా పనిచేసేరు. అప్పటి మంత్రుల ఆలోచనలు, ఆచరణలు ఇప్పటికంటే పారదర్శకంగా ఉండేవి. "కూర్చుని తినే హక్కు ఏ మానవుడికి ఉండదు. భోజనం చేసేవాడు పని కూడా చేయాలి" అనే రకం ఆలోచనలతో ఆయన అగ్రహారాల ఉద్వాసన చట్టానికి నాంది పలికాడు. తాను స్వయానా అగ్రహారీకుడే అయినప్పటికీ తన యాజమాన్యం క్రింద సుమారు 300 ఎకరాల సుక్షేత్రమైన మాగాణి ఉన్నప్పటికీ ఇదంతా తన అర్హతలోది కాదని నమ్మి ఇలాంటి అనర్హులు ఇంకా చాలామంది రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉండి ఉండవచ్చునని కూడా నమ్మి అగ్రహారాల చట్టానికి నాంది పలికాడు. ఒక మేలు ప్రక్కనే ఒక కీడు కూడా ఉండవచ్చునన్నట్లుగా ఈ చట్టం వల్ల దారిద్ర్యరేఖకు కొంచెం అటుఇటుగా ఉన్న సర్వీసు ఇనాముల హక్కుదారులే కాక బ్రాహ్మణులలో కూడా ఇందరో కొందరో తిండికి దూరమయ్యారు. కాని Whole Inam Villages (పరిపూర్ణ అగ్రహార గ్రామాలు) అనే చోట్ల పెత్తందారీ వ్యవస్థ కొంతవరకైనా నిర్మూలన అయింది.

జమీందారీల రద్దు చట్టానికి పొడిగింపులుగా వచ్చిన "ఇనామ్ ఎబాలిషన్ యాక్ట్"తో బాటు "అండర్ టెన్యూర్ఎస్టేట్స్ ఎబాలిషన్" కూడా అమలులోకి వచ్చి పెద్ద జమీందారుల బంధువర్గాలలో భూములను పొందిన కొందరు పెత్తందారులు కూడా "పనిచేయనివాడు తినడానికి అనర్హుడు" అనే సిద్ధాంతపు వేటు తిన్నారు. మాటవరసకు విజయనగరం జమీందారీలో చేరి అతి తక్కువ శిస్తుతోను అసలు శిస్తే లేని పద్ధతితోను నెలకొని అక్షరాలా "రాజభోగాలు" అనుభవించిన అలమండ, భీమాళి, రాకోడు, పినవేమలి, పెదవేమలి, మొయిద మొదలైన పిల్ల జమీందారీల పెత్తందార్లకు కూడా రాజభోగాలు

తీరిపోయాయి. ఇందులో మంచి ఎంతో ఉన్నా మథన కూడా కొంత ఉండి ఉండవచ్చు. ఈ వైభోగ శైథిల్యాల పరిణామం చరిత్రగా రికార్డు చేయవలసి ఉంది.

బ్రాహ్మణులకు గాని, సేవలచే రాజాదరణ పొందిన నిమ్నకులాల వారికి గాని, అగ్రహారాలు లభించడం కూడా సామాజిక సాంస్కృతిక రంగాలకు సంబంధించిన ఒక మేలుగా భావించవలసి ఉంది. మహారాజులకు ఆ బుద్ధి కలగడంలో కీర్తిదాహంతో బాటు సమాజ శ్రేయోవాంఛ కూడా ఉండడం వలననే దేవాలయాలు, సత్రాలు, బాటలు, మంచినీళ్ళ బావులు మొదలైనవి వచ్చేవి. ఇవి అలనాటి విశాఖ జిల్లాకి ప్రత్యేకం - అని చెప్పుకోవచ్చు. సింహాచలంలో దేవాలయం ఏర్పడడానికి కారకులు రాయల వంశీయులే కావచ్చు గాని శ్రీకూర్మం, శ్రీముఖలింగం, అరసవిల్లి, వడ్డాది, కశింకోట, ధర్మవరం, పుణ్యగిరి మొదలైన క్షేత్రాలలో శైవ వైష్ణవ ఆలయాలకే కాక నూకాలమ్మ, పైడితల్లమ్మ, యల్లమ్మ మొదలైన గ్రామదేవతల ఆలయాల నిర్మాణాలకు కూడా రాజవంశీయుల ప్రమేయమో, ప్రోత్సాహమో ఉండింది.

సయ్యద్ మీర్ మహమ్మద్ 'నాతోబాటు' కాకపోయినా 'నేను చదివిన' (విజయనగరం) ఎం.ఆర్. కాలేజీలోనే చదివాడు. ఐ.పి.ఎస్. 'కేడరు ఆఫీసర్' కాకపోయినా పోలీసు శాఖలో సూపరింటెండెంటు హోదాకి ఎదిగిన వాడు. అయితే, అతనికీ నాకూ ఉన్న సామాన్య విషయాలు ఎక్కువే. మంచి సాహిత్యాన్ని, మంచి సంగీతాన్నీ ఆస్వాదించగలం. సుమారు నలభై ఏళ్ళుగా అతనూ నేనూ ఎక్కడ కలిసినా విజయనగం కాలేజీలో మాకు పాఠాలు చెప్పిన రోణంకి అప్పలస్వామిగారు, కొత్తపల్లి వీరభద్రరావుగారు, పువ్వాడ శేషగిరిరావుగారు, ఎస్.ఎ. యాజులు గారు మొదలైన గురుబ్రహ్మలను స్మరించుకుంటూ కాలం గడపడం ఒకటి. పాతతరం హిందీ సినిమాలలోని పాటలను ట్యూనులు భావాలు జ్ఞాపకం ఉన్నంత వరకు ఒకరికొకరు పాడి వినిపించుకోవడం మరొకటి. మా మిత్రబృందంలో వారిని, మా కాలేజీ సహాధ్యాయులలో కొందరిని స్మృతిపథం నుండి సంభాషణా వేదికకి దింపుకొని ఆనందించడం ఇంకొకటి. ఇలా స్మృతి తరంగాలలో మునిగి తేలుతూ ఉండిన ఒక సందర్భంలో అతను "అగ్రహారాల చరిత్ర" అనే పేర ఒక పుస్తకం వ్రాయాలన్న ఆలోచనను బయటపెట్టాడు. జన్మరీత్యా అతను మహమ్మదీయుడు. కాని, చిన్ననాడు, నయోప్రాదుర్భావం నాడు, పరిణత వయసులోనూ అతనికి మిత్రులుగా తటస్థపడిన వారిలో బ్రాహ్మణులే ఎక్కువమంది. బ్రాహ్మణుల చరిత్రలో కలిగిన పరిణామాలు, ఉత్థాన పతనాలు అతను ఎంతో ప్రేమతో తెలుసుకొని గుర్తుంచుకున్నాడు. బ్రాహ్మణ ద్వేషం, బ్రాహ్మణులను అణగద్రొక్కితే తప్ప సమాజం బాగుపడదని వచించడం గొప్పతనాలుగా భావిస్తున్న కాలాన్నీ వ్యక్తులనూ పట్టించుకోకుండా మీర్ మహమ్మద్ ఈ పుస్తక రచనకు ఉపక్రమించాడు.

మీర్ మహమ్మద్ తన ఉద్యోగకాలంలో ఎక్కువభాగం విశాఖపట్నం, విజయనగరం,

Blank Page

# ఈ హారాలలోని పుష్పాలు

## శ్రీకాకుళం జిల్లా


| | | పేజీ నెం. |
|---|---|---|
| 1. | అనంతగిరి అగ్రహారం | 15 |
| 2. | అచ్యుతాపురం | 16 |
| 3. | చొర్లంగి అగ్రహారం | 18 |
| 4, | దేవుపురం | 19 |
| 5. | దూసి అగ్రహారం | 20 |
| 6. | గొట్ట అగ్రహారం | 22 |
| 7. | గురివిందాడ అగ్రహారం | 23 |
| 8. | హరిశ్చంద్రపురం | 24 |
| 9. | కవిటి అగ్రహారం | 25 |
| 10. | కిన్నెరవాడి అగ్రహారం | 26 |
| 11. | కొత్త అగ్రహారం | 27 |
| 12. | లుకులాం | 28 |
| 14. | మద్దివలస | 30 |
| 14. | ప్రియాగ్రహారం | 31 |
| 15. | రాణిగాం | 34 |
| 16. | శాసనం | 35 |
| 17. | సంగం, బిటివాడ | 36 |
| 18. | సత్యవరం అగ్రహారం | 38 |
| 19. | తుంగతంపర | 39 |


## విజయనగరం జిల్లా


| | | |
|---|---|---|
| 1. | అజ్జాడ | 40 |
| 2. | బాడంగి | 41 |
| 3. | చల్లపేట అగ్రహారం | 42 |
| 4. | చిట్టాయవలస | 44 |
| 5. | దేవాడ అగ్రహారం | 45 |
| 6. | గరికవలస | 46 |
| 7. | ఇంగిలాపల్లి | 47 |
| 8. | జిన్నాం | 49 |
| 9. | కలువరాయి | 50 |
| 10. | కిండాం అగ్రహారం | 52 |
| 11. | కుసుమూరు | 53 |

| | | |
|---|---|---|
| 12. | కృష్ణరాయపురం అగ్రహారం | 55 |
| 13. | లింగాలవలస | 56 |
| 14. | లోగిశ | 57 |
| 15. | మధుపాడ | 59 |
| 16. | నందబలగ | 61 |
| 17. | నిడిఘట్టు | 64 |
| 18. | పేరాపురం | 68 |
| 19. | పురిటి పెంట | 69 |
| 20. | పుష్పగిరి | 70 |
| 21. | రాముడువలస | 72 |
| 22. | రంగరాయపురం | 74 |
| 23. | సీతారామపురం అగ్రహారం | 77 |
| 24. | శివరామపురం | 78 |
| 25. | సోంపురం | 80 |
| 26. | శ్రీరాంపురం అగ్రహారం | 82 |
| 27. | వెంగాపురం | 83 |


**విశాఖపట్నం జిల్లా**


| | | |
|---|---|---|
| 1. | చిన్న భైరవి భూపతి అగ్రహారం | 84 |
| 2. | చిననంది పల్లి అగ్రహారం | 85 |
| 3. | చుక్కపల్లి | 86 |
| 4. | దిబ్బిడి | 87 |
| 5. | జగన్నాథ భూపాలపురం అగ్రహారం | 89 |
| 6. | కృష్ణరాయపుర అగ్రహారం (మేడపాడు) | 90 |
| 7. | మామిడిపల్లి అగ్రహారం | 91 |
| 8. | పెదనందిపల్లి అగ్రహారం | 92 |
| 9. | పోచినపెద్ది అగ్రహారం | 94 |
| 10. | పైడివాడ అగ్రహారం | 95 |
| 11. | రామయోగి అగ్రహారం | 97 |
| 12. | సంగివలస | 98 |
| 13. | సౌభాగ్యరాయపుర అగ్రహారం | 100 |
| 14. | తారువ అగ్రహారం | 101 |
| 15. | తునివలస అగ్రహారం | 102 |
| 16. | వీరవిల్లి | 103 |
| 17. | వెదురుపర్తి అగ్రహారం | 104 |

# శ్రీకాకుళం జిల్లా

## అనంతగిరి

**ఈ అగ్రహారం** శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలో ఉన్నది. 5వ నెంబరు జాతీయ రహదారిపై టెక్కలి - పలాస మార్గంలో ఉన్న బెండిగేటుకు పశ్చిమదిశగా 1 కి.మీ. దూరంలో ఉన్నది. ఈ అగ్రహారం పర్లాకిమిడి మహారాజులచే బహూకరింపబడినది. ఏ కుటుంబీకుల వారికి బహూకరించారో అనేది ఇప్పటి కుటుంబీకుల వారు చెప్పలేకపోయారు.

ఒకనాడు 30 బ్రాహ్మణ కుటుంబాలు ఉన్న ఈ అగ్రహారంలో ప్రస్తుతం 10 కుటుంబాలు మాత్రమే ఉన్నవి. ఇచ్చట ఒకనాడు మల్లాదివారు, మండలీకవారు, గరిమెళ్ళవారు, శివలవారు, అబ్బూరువారు, రంగాభట్లవారు, గొర్తివారు ప్రముఖ కుటుంబాలుగా ఉండేవారు. ప్రస్తుతం మండలీకవారు, మల్లాదివారు ప్రముఖ కుటుంబాలుగా ఉన్నారు. పలుమార్లు జైలుశిక్షను అనుభవించి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులుగా ప్రసిద్ధి చెందిన జయంతి సూరమ్మగారిది ఈ ప్రాంతమే.

ఇచ్చట శివపార్వతుల దేవాలయం, జగన్నాథస్వామి వారి దేవాలయాలు ప్రసిద్ధి చెందిన పురాతన ఆలయాలు. ఇచ్చట కొలువైన గ్రామదేవతను కూడా కొలుస్తారు. ఈ ప్రాంతంలోనే కొత్త చెరువు, రంగపుగుండం, మాన్ చెరువు, తాటిగుండం, పాపయ్య చెరువులు ఉన్నవి.

★

## అచ్యుతాపురం

**ఈ అగ్రహారం** జలుమూరు మండంలో ఉన్నది. ఇది జలుమూరుకి దక్షిణ దిశగా 8 కి.మీ.ల దూరంలో ఉన్నది. దాతలు ఇచ్చిన భూమి విస్తీర్ణం సుమారు 1200 ఎకరాలు. వంశధార నదికి అతి చేరువలో ఉన్న ఈ అగ్రహారం టెక్కలి రాజావారిచే బ్రాహ్మణ పండితులకు కవిత్వ ప్రతిభ నిమిత్తం బహూకరింపబడినది. ఇచ్చట వెలనాట్లు, వేగినాట్లు మరియు నియోగులు ఉండేవారు. అగ్రహారాలు రద్దు అయిన తరువాత ఇక్కడి ప్రజలు శ్రీకాకుళం, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు తరలి వెళ్ళడంతో ఈ 60 ఇళ్ళ అగ్రహారం, అరడజను బ్రాహ్మణ కుటుంబాలకే పరిమితమైనది. వీరి కుటుంబ సభ్యులకు సరియైన ఉద్యోగాలు లేవనే చెప్పాలి.

మహాభక్తులు, పండితులుగా ప్రసిద్ధి చెందిన కీ.శే. బగ్గు అప్పారావుగారి స్వస్థలం ఇదే. వీరి కుమారుడే మాజీ ఎమ్మెల్యే బగ్గు లక్ష్మణరావుగారు.

గొర్తివారు, యల్లాపంతులవారు, బూర్లెవారు ప్రస్తుతం నివసిస్తున్నారు. ప్రభుత్వాల నుండి ఎటువంటి నష్టపరిహారం అందలేదు. మాజీ సంస్థానాధిపతులకు కోట్ల కొలది భరణాలుగా ఇచ్చిన ప్రభుత్వం ఈ పండితులకు మాత్రం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. ఈ అగ్రహారానికి దగ్గరలో ఉన్న పర్వతాలపేటలోనే జయపురం మహారాజా విక్రమదేవ వర్మ జన్మించడం విశేషం.

'భగవత్కవి'గా పేరుగాంచిన శ్రీ ముడుంబ నరసింహ ఆచార్యస్వామి ఈ ప్రాంతానికి చెందిన వారే. సంస్కృతాంధ్ర పండితుడైన ఈయన ఆనందగజపతి ఆస్థానంలో అగ్రపీఠాన్ని అధిరోహించారు. సాహిత్య సరాలను తన పద పరాగాలుగా మార్చి ప్రజామోదాన్ని పొందిన ప్రముఖ పండితుడు శ్రీ ముడుంబ.

ప్రముఖ పండితులు, గ్రంథకర్త, విజయనగరం మహారాజా కళాశాలలో కెమిస్ట్రీ విభాగాధిపతిగా పనిచేసిన కవిరాయుని వెంకటరమణ మూర్తిగారు, ప్రధానోపాధ్యాయులుగా పదవీ విరమణ చేసి ప్రస్తుతం శ్రీకాకుళం, పుణ్యపువీధిలో నివసిస్తున్న కవిరాయుని కామేశ్వరరావుగారు ఈ అగ్రహారానికి చెందినవారే. వీరిద్దరూ కవిరాయుని పెదరామమూర్తిగారి సంతానం. రామమూర్తిగారి కుమార్తెలు కూడా బాగా స్థిరపడ్డారు.

కీ.శే. వెంకట రమణమూర్తి గారి సంతానంలో అందరూ విద్యలో బాగా

రాణించి, ఉన్నత వృత్తులలో స్థిరపడ్డారు. కామేశ్వరరావుగారు పదవీ విరమణ చేసిన తరువాత కూడా బాలభాను విద్యాలయం (శ్రీకాకుళం)లో సుమారు దశాబ్దకాలం తన సేవలందించారు. వీరి సంతానం కూడా విద్యలో చక్కగా రాణించి ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిలో కె. సూర్యనారాయణ మూర్తిగారు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విశాఖపట్నంలో సీనియర్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. వీరి సంతానం కూడా విద్యలో రాణిస్తున్నారు.

'కవిరాయుని'వారుగా ప్రస్తుతం పరిగణింపబడుతున్న వీరి ఇంటిపేరు వాస్తవానికి మేలిసోమయాజులు. వీరి పూర్వీకులకు అప్పటి రాజులు కవిరాయునివలస అనే ప్రాంతం బహూకరించడం వలన వీరు ఈ ప్రాంతంలో నివసించారు. తదుపరి వివాదాల కారణంగా గొట్ట ప్రాంతం మీదుగా అచ్యుతాపురానికి చేరుకున్నారు. ఈ ప్రాంతం నుండి ఈ అగ్రహారానికి చేరుకోవడం వలన ఈ మేలిసోమయాజుల వారు, కవిరాయునివారిగా పిలువబడుతున్నారని శ్రీమతి కవిరాయుని బాలాత్రిపుర సుందరి తెలిపారు.

★

## చొర్లంగి

**ఈ అగ్రహారం** లక్ష్మీనరసపేట మండలపరిధిలో ఉన్నది. హిరమండలం - పాతపట్నం రోడ్డులో గొట్ట దాటాక ఒక కిలోమీటరు దూరంలో ఉంది. తూర్పుదిశలో 5 కి.మీ.ల దూరంలో ఉన్నది. ఈ అగ్రహారం భూముల విస్తీర్ణం సుమారు 1560 ఎకరాలు. ఈ అగ్రహారం పర్లాకిమిడి మహారాజులచే పాండిత్య ప్రతిభ చూపిన బ్రాహ్మణులకు దానంగా ఇచ్చారు.

ఒకనాడు పాతిక బ్రాహ్మణ కుటుంబాలు ఉన్న ఈ అగ్రహారంలో ప్రస్తుతం అరడజను కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. ఇక్కడ చీమలపాటి, తాతా వార్ల కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. ఎస్టేట్లు రద్దు అయిన తరువాత దుర్భర జీవితాలు గడపలేకపోవడంతో గడప దాటవలసి వచ్చిందని, అందుకే ఈ అగ్రహారంలో ఉన్న బ్రాహ్మణులు పట్టణాలకు వలస వెళ్ళారని, వంశధార ఒడ్డునే ఉన్న అగ్రహారీకుడైన చీమలపాటి సత్యనారాయణ ఆవేదన వెలిబుచ్చారు.

★

## దేవుపురం

**నందిగామ** జమీందారులచే బహూకరింపబడిన ఈ గ్రామం ఒకప్పటి టెక్కలి తాలూకా (శ్రీకాకుళం జిల్లా)లోనిది. ప్రస్తుతం నందిగాం మండలంలో చేరి ఉంది. 5వ నెంబరు జాతీయ రహదారిలో టెక్కలి దాటి నందిగాం వెళ్ళేటప్పుడు టెక్కలికి 20 కి.మీ.ల దూరంలో రోడ్డుకు తూర్పువైపుగా ఒక కిలోమీటరు దూరంలో ఉన్నది. ఈ గ్రామం భూములు ఆది నుండి నేటి వరకు వెలనాటి వైదిక బ్రాహ్మణుల ఆధీనంలోనే ఉన్నాయి. వీరు శ్రీపాదవారు, ఉప్పులూరువారు, నిష్ఠలవారు, ఎర్రగుంట్ల వారు, కడియాలవారు, తనికెళ్ళవారు, ఘండికోటవారు, వేదులవారు ఉండేవారు. కాలక్రమేణా ఇక్కడి బ్రాహ్మణులు సేద్యం పట్ల కంటే ఆంగ్ల విద్యాభ్యాసం పట్ల మక్కువ ఎక్కువ చూపించుకొని ఆంగ్లేయుల పాలనాకాలంనాటి నుండి పట్టణాలకు వలసలు పోయారు. ఇప్పుడు ఈ ఊరిలో పట్టుమని పది ఇళ్ళు కూడా బ్రాహ్మణులవి లేవు.

రాష్ట్రమంతటా ఎక్కడెక్కడో పౌరాణిక నాటకాలలో వేషాలు వేసి దిగ్విజయ యాత్రలు చేసిన సుప్రసిద్ధ నటుడు శ్రీపాద సుబ్బారావుగారు ప్రస్తుతం ఈ ఊరిలోనే తాతలనాటి గృహంలో మనుగడ సాగిస్తున్నారు. సుబ్బారావుగారు పీసపాటి నరసింహ మూర్తిగారికి సమ ఉజ్జీ కాకపోయినా, సమకాలికుడు అన్నది మాత్రం నిజం. ఈయన శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, హరిశ్చంద్రుడు, నక్షత్రకుడు మొదలైన పాత్రలను సమర్థవంతంగా నిర్వహించుకున్నారు. తన నట జీవితం (సుమారు 4 దశాబ్దాలు)లో రాష్ట్రం నలుమూలల స్థలాల నుంచి డజనుల కొలదీ సన్మానాలు, సత్కారాలు అందుకున్నారు. తన సమకాలికులైన పీసపాటి నరసింహమూర్తిగారితో, అమరాపు సత్యనారాయణగారితో, షణ్ముఖి ఆంజనేయ రాజుగారితో గాఢమైన పరిచయం ఉన్నందు వలన ఆనాటి జ్ఞాపకాలను ఆప్యాయంగా వివరించగలుగుతున్నారు.

★

# దూసి అగ్రహారం

**ఈ అగ్రహారం** ఆముదాలవలస మండలంలో ఉన్నది. నాగావళి (లాంగుళ్య) నదీతీరాన ఉన్న ఈ అగ్రహారం సంగీత, సాహిత్యాలకు ప్రాధాన్యత వహించింది. 'తూర్పు భామాకలాపం' రచించిన ప్రముఖ రచయిత దూసి జగన్నాధశాస్త్రిగారు దూసి ప్రాంతానికి చెందినవారే. అయితే 'దూసి' అన్న ఇంటిపేరు ఒకనాడు దూసి కాదని కొందరికి మాత్రమే తెలిసిన వాస్తవం.

అనేక సంవత్సరాల క్రితం గోదావరి ప్రాంతంలో ఉన్న ముంగండ అగ్రహారం నుండి 'ఉపద్రష్ట' అనే ఇంటిపేరు గల ఓ పేద బ్రాహ్మణుడు ఈ ప్రాంతానికి వచ్చి ఉపాధి కల్పించమని అప్పటికి పలుకుబడి ఉన్న హరిజనులను అర్ధించాడు. నాటికి హరిజనుల ఇంటిపేరు 'దూసి' అని ఉండేది. వీరి వద్ద ఈ బ్రాహ్మణుడు కొన్ని పద్యాలు, కవిత్వం వినిపించాడు. ఈ విషయాన్ని విజయనగరం రాజులవారికి తెలియ జేశారు. అంతట రాజుగారు ఒక తెల్లకాగితాన్నిచ్చి "దానిపై పద్యం ఉంది. అది చదువుకొని రా!" అని ఆజ్ఞాపించడంతో తీసుకొని వెళ్ళాడు. ఆ రాత్రి దీపం క్రీనీడలో కాగితంపై అస్పష్టంగా ఉన్న ఆ పద్యాన్ని గుర్తించాడు. మరునాడు ఆ పద్యాన్ని రాజుగారికి వినిపించడంతో సంతోషించిన రాజుగారు భూములను దానం ఇచ్చారు.

అచ్చట హరిజనుల్లో ఎక్కువమంది ఇంటిపేరు 'దూసి' అని ఉండేది. ఆ ఇంటిపేరునే ఆ బ్రాహ్మణుని ఇంటిపేరుగా మార్చుకోమని ఒత్తిడి తెచ్చారు. ఆవిధంగా తన ఇంటిపేరుని మార్చుకుంటేనే తనని ఆమోదిస్తామని, లేనియెడల వ్యతిరేకిస్తామని ఆ బ్రాహ్మణుని అచ్చట ఉన్న హరిజనులు అన్నారు. అందులకు ఆ 'ఉపద్రష్ట' బ్రాహ్మణుడు తన ఇంటిపేరుని 'దూసి' అని మార్చుకోవలసి వచ్చింది. ఆ తరువాత గ్రామకరణం, మునసబు కూడా ఆ ఇంటిపేరు వారే.


దూసి సోమయాజుల భుక్తి, బైరాగి భుక్త లచ్చన్న భుక్త అనే సోదరుల కాలంలోనే రైలు మార్గం పడింది. రైలు మార్గం వేసే ఉద్దేశంతో సర్వే నిమిత్తం ఓ దొరగారు ఆ ప్రాంతానికి ఏనుగుపై సందర్శించారు. ప్రస్తుతం రైలుమార్గం ఉన్న ప్రాంతంలో బైరాగి భుక్తగారికి భూములు ఉండేవి. రైలుమార్గం వేస్తే తనకి నష్టం వాటిల్లుతుందని భావించిన భుక్తగారు దొరగారు వచ్చిన ఆ ఏనుగు ముందు పడుకొని, ఆత్మహత్యకు సిద్ధపడ్డాడు.

అంతట ఆ రాజుగారు భుక్తగారిని ఓదార్చి, నష్టపరిహారం ఇవ్వడానికి అంగీకరించడంతో రైలు మార్గం వేసే ప్రక్రియ ప్రారంభం అయింది.

కాలక్రమేణా విద్యావంతులు, పండితులు, సంగీత కళాకారులు ఉద్భవించారు. ప్రతిభగల పేదవారిని ఆదరించి, అన్నంపెట్టి, విద్య నేర్పి ఎందరో కళాకారులను తయారు చేసేవారు. చదువుకున్న వారు, పట్టభద్రులు అతి తక్కువమంది ఉన్న ఆ రోజుల్లో రైల్వే, రెవెన్యూ ఉద్యోగస్తులు మాత్రం దూసివారే ఎక్కువ కావడం విశేషం.

ప్రముఖ హరికథా భాగవతార్, రచయిత, ఉపన్యాసకుడు, హాస్యప్రాసంగికుడు, శ్రీకాకుళం నివాసి అయిన "దూసి బెనర్జీ" ఈ ప్రాంతానికి చెందిన వారే. వారి పేరు తెలియని వారుండరేమో! దూసి అలివేలు, దూసి రామమూర్తి భాగవతార్, దూసి గోపాలం భాగవతార్, సాహిత్య రంగంలో ప్రసిద్ధి చెంది సభానిర్వాహకుడుగా వ్యాఖ్యాతగా పేరు పొందిన శ్రీకాకుళం నివాసి దూసి ధర్మారావు వీరందరూ ఈ ప్రాంతం వారే.

★



"దూసి" అని పేరుతో విశాఖపట్నం-హౌరా రైలుమార్గంలో ఒక రైల్వేస్టేషను ఉంది. ఈ స్టేషనుకు దక్షిణంగా రైల్వేశాఖ వారు చాలా నాణ్యమైన బ్రిడ్జిని నిర్మించారు.

## గొట్ట

**ఈ అగ్రహారం** హిరమండలం మండలంలో ఉంది. ఇది హిరమండలానికి తూర్పుదిశలో 4 కి.మీ.ల దూరంలో ఉంది. వంశధార నదిపై నిర్మించిన గొట్టా బ్యారేజీకి ప్రక్కనే ఉన్నది. ఈ బ్రాహ్మణుల పాండిత్య ప్రతిభకు ఈ అగ్రహారాన్ని పర్లాకిమిడి మహారాజులిచ్చారు. సుమారు 100 విర్తులకు లోపు ఉండే ఈ అగ్రహారంలో ఒకనాడు పాతిక బ్రాహ్మణ కుటుంబాలు ఉండేవి. ప్రస్తుతం ఉంటున్న కుటుంబాలు అరడజనుకి మించి ఉండవు.

గంగవంశం రాజులు, చాలా ఉదార స్వభావులని, తెలుగు బ్రాహ్మణులకు, పండితులకు, కళాకారులకు అగ్రపీఠం వేసేవారని ఈ ప్రాంతానికి చెందిన యల్లాపంతుల శ్రీనివాసరావుగారు తెలిపారు. ఎంతో భూమి మహారాజులచే బహూకరింపబడినా 1956 నాటి చట్టం వలన సర్వం రైతుల పరం అయిందని కూడా తెలిపారు. బ్రాహ్మణులు బ్రతుకు తెరువు కోసం పట్టణాలకు వెళ్ళక తప్పలేదన్నప్పుడు ఆయన వదనంలో విచారం స్పష్టమైంది.

★

# గురివిందాడ అగ్రహారం

**ఒకప్పటి** శ్రీకాకుళం జిల్లాలో ఉన్న ఈ అగ్రహారం విజయనగరం జిల్లా ఏర్పడిన తరువాత చీపురుపల్లి మండలంలో చేరినది. ఈ అగ్రహారం చీపురుపల్లి రైల్వేస్టేషనుకు ఎదురుగా ఉండి, ప్రస్తుతం నటరాజ్ థియేటర్ ఉన్న ప్రాంతం వరకు విస్తరించి ఉండేది. కాలక్రమాన చీపురుపల్లి పట్టణంలో అంతర్భాగం అయింది.

ఇది చరిత్రలో రామచంద్రపుర అగ్రహారంగా ఉన్నది. 18వ శతాబ్దం నాటి విజయనగరం రాజులు; ఈ అగ్రహారంలో ఇప్పటికీ నివాసం ఉంటున్న ఉలిమిరివారు, తెలికిచర్లవారు, మండావారు, ఆడిదంవారు మరియు ముట్నూరి వారి కుటుంబాలకు ఇనాముగా ఇచ్చినట్లు తెలుస్తున్నది.

ఆడిదం సూరకవి ఇక్కడి వారే. ఈ అగ్రహారం భూమి వైశాల్యం 1000 ఎకరాలు. ఇచ్చట శ్రీ ఆంజనేయస్వామి వారి ఆలయం ఉన్నది. ఇది ఈ అగ్రహారం యొక్క ప్రవేశద్వారము.

ఆడిదము అనగా ఖడ్గం. ఖడ్గమును బహుమతిగా అందుకున్నారని ఇంటిపేరు అలా వచ్చింది.

"ఊరెయ్యది?" "చీపురుపలి!"

"పేరో?" "సూరకవి" "ఇంటిపే" "రడిదమువార్"

"మీ రాజు?" "విజయరామమ

హారా" "జతడేమి సరసుడా?" "భోజుడయా!" అని ఒక చక్కని "చాటు పద్యం" ఉంది.

మంచాళ జగన్నాథరావు అనే ప్రఖ్యాత వైణికుడు ఈ ఊరివారే. ఆయన ప్రస్తుతం హైదరాబాదులో స్థిరపడినవారు. పంచముఖి తాళప్రస్తావనకు ప్రపంచ ఖ్యాతి నొందిన ముట్నూరి సూర్యనారాయణగారు, లయ ప్రస్తావనలో సాంబయ్యగారు, ప్రఖ్యాత పౌరాణిక నటుడు పీసపాటి నరసింహమూర్తిగారు ఒకే బంధువర్గీయులు.

సూర్యనారాయణగారి శిష్యుడు గుర్జల సీతారాం శూద్రుడైనా లయ, తాళ గతుల విద్వాంసుడైనాడు. నేత్రావధానం, తాళావధానం, సాహిత్యావధానం ఇచ్చటి వారికి వరాలు.

తూర్పు భాగవతానికి మృదంగంతో ఎనిమిది గంటలు అద్భుతంగా సహకరించిన దేవగుప్తాపు జగన్నాథరావు ఈ అగ్రహారంలోనే ఉన్నారు. రాష్ట్ర రాజధానిలో అనేక సన్మానాలు అందుకున్నారు. సుమారు నలభై కుటుంబాల బ్రాహ్మణులు ఉన్నారు.

★

## హరిశ్చంద్రపురం

**ఈ అగ్రహారం** కలకత్తా, మద్రాసు మధ్య ఉన్న జి.ఎన్.టి. రోడ్డు (ఎన్.హెచ్.5) వాల్తేరు, కలకత్తా మధ్య ఉన్న రైల్వేలైనును క్రాస్ చేసే చోట ఉంది. ఈ అగ్రహారాన్ని పర్లాకిమిడి మహారాజుగారైన శ్రీ జగన్నాధదేవ్ గారు బ్రాహ్మణులకు పండిత ప్రతిభకు మెచ్చి ఇచ్చారు. ఇచ్చట 60 బ్రాహ్మణ కుటుంబాలు ఉండేవి. ప్రస్తుతం 12 ఇళ్ళవారే ఉన్నారు. వాడుకలో ఉన్న పూర్వగాథ ప్రకారం పర్లాకిమిడి రాజావారికి హరి, ప్రియ అనే ఇద్దరు కుమార్తెలు ఉండేవారని, ఈ అగ్రహారాన్నీ ప్రియ అగ్రహారాన్నీ, లక్కుందెడ్డులో ఉన్న కన్నేపల్లివారికి సుమారు 1200 ఎకరాలు దానంగా ఇచ్చారని తెలిసింది. ప్రస్తుతం ఈ అగ్రహారం పోలాకి మండలంలో ఉన్నది. 5వ నెంబరు జాతీయ రహదారికి తూర్పుదిశలో సుమారు 12 కి.మీ.ల దూరంలో ఉన్నది. ఈ అగ్రహారంలో వేదులవారు, శ్రీపాదవారు, గొర్తివారు, గరిమెళ్ళవారు ఎక్కువగా ఉండేవారు. ఇచ్చట ప్రత్యేక ఆకర్షణ శ్రీ రాజరాజేశ్వరీ సహిత వేంకటేశ్వర స్వామి ఆలయం. ఈ దేవాలయాల సముదాయంలో జగన్నాధస్వామి, పార్వతీదేవి మరియు లక్ష్మీగణపతుల ఆలయాలు ఉన్నవి. నవగ్రహాలు కూడా ఉన్నవి. ఈ ఆలయాలు కూడా పర్లాకిమిడి మహారాజుగారే నిర్మించారు. అప్పట్లో కన్నేపల్లి వారు ఈ ఆలయ బాగోగులు చూసేవారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న పట్నాల రాధిక అనే వైశ్యకుటుంబానికి చెందిన మహిళ దేవాలయాన్ని అభివృద్ధి చేశారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు చెముడుపాటి వెంకట రమణమూర్తి గారు, కన్నేపల్లి సాంబమూర్తిగారు కూడా ఈ అగ్రహారానికి చెందినవారే.

★

## కవిటి

**ఈ అగ్రహారం** శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలంలో ఉన్నది. నందిగాం మండల కేంద్రానికి ఉత్తర దిశగా 6 కి.మీ.ల దూరంలో ఉన్నది. 5వ నెంబర్ జాతీయ రహదారి మీద ఉన్న 'బెండి' గేటుకు దక్షిణదిశగా నౌపడా వెళ్ళే దారిలో 1 కి.మీ. దూరంలో ఉన్నది. ఈ అగ్రహారం టెక్కలి రాజావారు కందికుప్ప వారికి బహూకరించారు.

ఒకనాడు ఇది 60 ఇళ్ళ అగ్రహారం. ప్రస్తుతం 2 కుటుంబాలు మాత్రమే ఉన్నవి. కందికుప్పవారు, చామర్తివారు, అన్నవరపు వారు, కొండూరు వారు, దుర్గావఝల వారు, ప్రముఖులుగా ఉండేవారు. ప్రస్తుతం కందికుప్పవారి కుటుంబాలు రెండు మాత్రమే ఉన్నవి.

ఇక్కడ పురాతనమైన శివాలయం ఒకటి ఉంది. అప్పట్లో సత్యరాజు పాణిగ్రాహి, అతని కుటుంబ సభ్యులు అర్చకులుగా ఉండేవారు. ప్రస్తుతం పండా కుటుంబం వారు అర్చకులుగా ఉన్నారు. కొంతకాలం చంద్రశేఖర్ పండా గారు అర్చకునిగా ఉన్నారు. ఇప్పుడు ఆయన మూడవ కుమారుడు అర్చకునిగా ఉన్నారు.

ఈ అగ్రహారంలోనే శ్రీ రామాలయం కూడా ఉంది. ఈ ఊరికి తూర్పుదిశలో ఉన్న బెండికొండపై ఉన్న ఈ రామాలయం చాలా ప్రసిద్ధిగాంచినది. దీనికి ట్రస్టీలుగా పెంట గున్నయ్యగారి కుటుంబ సభ్యులు ఉన్నారు. వీటి రాగభోగాలు ఈ కుటుంబ సభ్యులే చూసుకుంటున్నారు.

ఇచ్చట హనుమ చెరువు అనేది అతి పురాతనమైనది. బహుశా ఈ చెరువుని అగ్రహారాన్ని దానంగా స్వీకరించిన అనంతరం కందికుప్ప వారు త్రవ్వించి ఉంటారని చెప్పుకుంటారు.

ప్రస్తుతం ఈ అగ్రహారంలో నివసిస్తున్నవారిలో కందికుప్ప వెంకట కామేశ్వర శర్మగారు, వి.ఎ.ఓ.గా రిటైర్ అయ్యారు. వారి భార్య శారదాంబగారు పోస్ట్‌మాస్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మరొకరు కందికుప్ప వెంకటరావుగారు ఓ.ఎన్.జి.సి.లో డైరెక్టర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. వీరి భార్య రమణమ్మగారు సర్పంచ్‌గా పనిచేశారు. ఈమె గొప్ప వితరణశీలిగా పేరుగాంచారు. వీరి పెద్దకుమారుడు శ్రీనివాసరావు విద్యాధికుడైనప్పటికీ కొంతకాలం నిరుద్యోగిగా ఉండి ఇటీవలే ఉద్యోగస్తుడయ్యారు. వీరి రెండో అబ్బాయి సాంబశివరావు ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్‌గా పనిచేస్తున్నారు. మిగతా కుటుంబాల వారు ఉద్యోగరీత్యా పొట్ట చేతపట్టుకుని విశాఖ, శ్రీకాకుళం వంటి ప్రాంతాలకు వలస వెళ్ళారు.

★

## కిన్నెరవాడ అగ్రహారం

**శ్రీకాకుళం జిల్లాలో** సారవకోట మండలంలో తొగిరి అని పిలువబడే అగ్రహారం గ్రామం కిన్నెరవాడ. ఇది పర్లాకిమిడి రాజా వారిచ్చిన ఆఖరి అగ్రహారం.

పర్లాకిమిడి రాజావారు సుమారు మూడువందల సంవత్సరాల క్రితం కుమార వంశస్తులకు ఈ అగ్రహారాన్ని ప్రదానం చెయ్యడం జరిగింది. కుమార రామమూర్తి గారి తాతల నాటి ఈ అగ్రహారం, రామమూర్తిగారు, అతని కుమారుడు కుమార సత్యనారాయణగారు అతని సుతుడు కామేశ్వరరావుగారు ఇటీవల అందజేసిన చరిత్ర ఇది.

243 ఎకరాల భూమి ఆ గ్రామంలో ఎనిమిది బ్రాహ్మణ కుటుంబాల వారికి ప్రదానం చేయగా అందులో పల్లం భూమి 150 ఎకరాలు. ప్రస్తుతం ఆ గ్రామంలో జీవిస్తున్న కామేశ్వరరావు గారి తండ్రి సత్యనారాయణగారు గ్రామ మునసబుగా చేసేవారు. వీరు కాక మరో బ్రాహ్మణ కుటుంబం పట్టిశం వారు. ఆ గ్రామంలో మిగిలిన కుమారవారి కుటుంబం సన్నగిల్లుతున్నది. పొట్ట చేత పట్టి జీవనం కోసం గ్రామం విడిచి వెళ్ళారు. రామమూర్తి గారి తమ్ముడు కొడుకు కె.యస్. మృత్యుంజయం అమెరికా (న్యూయార్క్)లో డాక్టరుగా ఉన్నారు. మరొకాయన కె.వి.కె. ప్రకాష్ కుమావో రెజిమెంట్‌లో కల్నల్‌గా ఉన్నారు.

ప్రస్తుతం కిన్నెరవాడలో ఉన్న కుమార వారి పూర్వులు కట్టిన భవనం శిధిలావస్థలో ఉంది. బాగు చేయించుకోవడం కాని, తిరిగి క్రొత్తగా నిర్మించుకొనే ఉద్దేశం గాని లేదట.

ఇక్కడి వారు బ్రాహ్మణ సంప్రదాయం విడిచిపెట్టలేదు. ఉన్నంతలో అతిథి మర్యాదలు చేస్తున్నారు. ఆదరిస్తున్నారు. తమ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉంటే ఎంతోమంది పేదసాదలను ప్రాజ్ఞులను చేసేవారం అన్నారు.

★

## కొత్త అగ్రహారం

ఇది జాతీయ రహదారి నెం. 5 పై కాశీబుగ్గ - టెక్కలి మధ్య ఉన్నది. రెండున్నర శతాబ్దాల క్రిందట ఈ గ్రామాన్ని టెక్కలిరాజా వారు అప్పటి బ్రాహ్మణ పండితులకు బహూకరించారు. ఆనాడు 30 వరకూ బ్రాహ్మణ కుటుంబాలు ఉండేవి. కాని రైతులు భూములు స్వాధీనం చేసుకున్న తరువాత వారికి జరుగుబాటు అవక, శ్రీకాకుళం, విజయనగరం, భువనేశ్వర్ వంటి పట్టణాలకు వలస వెళ్ళిపోయారు. ఎన్నో రాజప్రాసాదాల వంటి గృహాలు ఈనాటికీ తాళం కప్పులు వేసి ఉంచి, ఆలనా పాలనా లేక పడి ఉన్నాయి.

ఈ గ్రామంలో బుర్రావారు, శివలవారు, అప్పికట్లవారు సుమారు 30 కుటుంబాల వారు ఉండేవారు. ఇచ్చట పురాతనంగా ఉన్న దేవాలయాలు శ్రీ రామలింగేశ్వర ఆలయం, అన్నపూర్ణ ఆలయం, రామాలయం, శ్రీ నీలకంఠేశ్వరస్వామి మరియు కామేశ్వరి దేవాలయం. నిత్యపూజానుష్ఠానాల నిమిత్తం ఈ దేవాలయాలకు ఇప్పటికీ కొంత మాన్యం ఉంది.

ప్రస్తుతం ఈ గ్రామంలో 5 ఒరియా బ్రాహ్మణ కుటుంబాలు మాత్రమే ఉంటున్నాయి. ఈ దేవాలయాల బాగోగులు రైల్వే, టి.టి.ఈ అప్పికట్ల శ్రీరామమూర్తి గారు చూస్తున్నారు. ఇక్కడ ఖాళీగా ఉన్న పెద్ద భవంతులు కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దానిక్కారణం బ్రాహ్మణుల ఇళ్ళు కొన్న ఎడల తమకు ఏదో చెడు జరుగుతుందన్న అపోహ ఉండటమే! ప్రముఖ వ్యక్తిగా ఈ అగ్రహారానికి చెందిన నిష్ఠల సుబ్బారావుగారి పేరు చెప్పుకోవచ్చు. ఈయన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనడమే గాకుండా కారాగార శిక్షలు కూడా అనుభవించిన ఉన్నత వ్యక్తి.

★

## లుకులాం

**అందుబాటులో** ఉన్న సమాచారం ద్వారా లుకులాం అనే అగ్రహారం ఉర్లాం జమీందారీలో భాగం. ఈ గ్రామం కూడా శ్రీకాకుళం జిల్లాలోని అనేక అగ్రహారాల వలెనే 17వ శతాబ్దం చివరిలో టెక్కలి జమీందార్ల నుండి బ్రాహ్మణులకు ధారాదత్తం అయింది. "ఉర్లాం పండితులు" అని ఒక నుడికారం ఉండేది. నిజానికి ఆ పండితులలో లుకులాం గ్రామానికి చెందిన వారే ఎక్కువమంది. కన్నేపల్లివారు, జొన్నలగడ్డవారు, బూరెలవారు, వేదులవారు, పిలకావారు, బంకుపల్లి వారు. వీరిలో బంకుపల్లి వారు తప్ప మిగిలిన వారందరూ వెలనాటి వైదికులు. బంకుపల్లి వారిలో సూర్యనారాయణశాస్త్రిగారు స్వాతంత్ర్య సమరయోధుడు. మల్లయ్య శాస్త్రిగారు మొదట్లో వేదపండితుడే గాని, కాలక్రమాన వ్యాకరణం, తర్కం, మీమాంస మొదలైన శాస్త్రాలలో నైపుణ్యం సాధించుకొని, భూములు సేద్యం చేసుకోవడం కాలహరణమని భావించి శ్రీకాకుళానికి వలసపోయారు. అక్కడ వారి విద్వత్తు ఎందరో విద్యార్థులకు ఉపయుక్తమై జీవనాధారం కూడా అయినది. వారి శిష్యులు రాష్ట్రంలోని పలు సంస్కృత కళాశాలలో అధ్యాపకులుగా జీవించారు.

జొన్నలగడ్డ వారిలో ఇప్పటి వారికి బాగా తెలిసిన వారు జె.వి. సోమయాజులు గారు, జె.వి. రమణమూర్తిగారు. వీరు మొత్తం ఐదుగురు సహోదరులు. అందరూ



జె.వి. సోమయాజులుగారి పూర్వుల ఇంటి ఫోటో

స్టేజి, సినిమా, టీవీ నటులు. సోమయాజులు గారు "ఒక చేత్తో" రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేసుకుంటూనే "రెండు చేతులతో" నటజీవితాన్ని పరిపుష్టం చేసుకున్నారు. రమణమూర్తిగారు నటననే జీవికగా చేసుకున్నారు.

కన్నేపల్లివారిలో పదిమందికీ తెలిసిన వారు సుబ్రహ్మణ్య శాస్త్రిగారు. ఈయన రంగస్థల నటుడు. "భక్త రామదాసు" నాటకంలో రామదాసు పాత్రకు ఈయన జీవం పోశారు. ఈయన సంగతి అలా ఉండగా, అసలు కన్నేపల్లివారి కుటుంబం నిరతాన్న ప్రదాతలుగా వాసికెక్కినది. సుమారు 1975 వరకు కన్నేపల్లి వారు "బ్రాహ్మణ జమీందార్లు"గా కొనసాగారు. 1930-35 నాటికే వారి ఇండ్లు నల్లసిమెంట్ అరుగులతో, మద్రాస్ శ్లాబ్‌లతో నిర్మించుకున్న పద్ధతి. కన్నేపల్లివారిలో చాలామంది గృహస్థులు మధ్యాహ్న భోజనమప్పుడు పంక్తిలో అన్యులో, అభ్యాగతులో ఉండేటట్లుగా ఆహ్వానాలు, ఆవాహనలు చేస్తూ ఉండేవారు.

గుండుగోల జగ్గప్పశాస్త్రి అనే ఆశుకవి ఈ గ్రామానికి చెందినవారే. ఈయన ఆశుకవిత్వం చెప్పినవారే గాక, పోతనగారి మహాభాగవతంలోని వెయ్యి పద్యాల వరకు కంఠస్థం చేసి అర్థ, తాత్పర్యాలతో సహా వప్పగించగలిగేవారు.

ఇంకా ఈ గ్రామంలో పేరేపు సత్యనారాయణగారు అనే పండితుడు, గరిమెళ్ళ శివజోగి రామయ్యగారనే వ్యవహర్త ఉండేవారు. కన్నేపల్లి వారిలో కృష్ణమూర్తి గారి ప్రాపంచిక ప్రతిభ గణనీయంగా ఉండేది.

లుకులాం గ్రామంలో ప్రస్తుతం ఉన్న బ్రాహ్మణ కుటుంబాలు వేళ్ల మీద లెక్కించగలం. కాని చాప చిరిగినా చదరంత. ఇదంతా ఉర్లాం జమీందారీ ప్రభావమే.

లుకులాం అనే గ్రామం ఒకప్పటి నరసన్నపేట తాలుకాలోది. ఇప్పుడు నరసన్నపేట మండలంలో ఉంది. 5వ నెం. జాతీయ రహదారిలో నరసన్నపేటకు ఉత్తరంగా కొంతదూరం వెళ్ళాక, పడమటి దిక్కుగా పోయే బ్రాంచిరోడ్డు ద్వారా వెళ్ళాలి. సుమారు 10 కి.మీ.ల దూరం.

★

# మద్దివలస

**ఈ అగ్రహారం** శ్రీకాకుళం జిల్లా వంగర మండలంలో ఉన్నది. ఈ అగ్రహారం వంగర - పార్వతీపురం వెళ్ళే రహదారిపై వంగరకి 2 కి.మీ.ల దూరంలో ఉన్నది. ఈ అగ్రహారం పాలకొండ జమీందారులచే బహూకరించబడినది.

ఈ అగ్రహారంలో కొల్లూరువారు, ధవళవారు, అయ్యల సోమయాజులవారు, చొప్పల్లివారు, పేరివారు ప్రముఖ కుటుంబాలు. ప్రస్తుతం ఇక్కడ ఉన్నవారిలో ధవళ నాగభూషణ శర్మ, సత్యనారాయణ శర్మ ప్రముఖులు. కొల్లూరు అప్పన్న భుక్తగారు గ్రామ మునసబుగా ఉండేవారు. అయ్యల సోమయాజుల సూర్యనారాయణగారు కరణంగా ఉండేవారు. ఇచ్చట కొల్లూరు సోమశేఖర శాస్త్రి తర్కశాస్త్రంలో గొప్ప పండితులుగాను, వేదశాస్త్రాలలో దిట్టగా ఉండేవారు.


ఒకనాడు అది 45 ఇళ్ళ అగ్రహారం. ఇచ్చట ఎక్కువగా ద్రావిడ శాఖ బ్రాహ్మణులే ఉండేవారు. ఇచ్చటి వాళ్ళంతా వ్యవసాయం మీద ఆధారపడినవారే. కొన్నాళ్ల క్రితం వరకు అయ్యల సోమయాజుల వారి కుటుంబానికి 300 ఎకరాల భూమి ఉండేదట!

ఈ ఊరికి చెందిన కొల్లూరు రామకృష్ణ శర్మ అనే ఆయన ప్రస్తుతం అమెరికాలో (అలెగ్జాండ్రియా రాష్ట్రంలో, వీనా నగరంలో) ఉన్నారు. బెనారస్ యూనివర్శిటీలో కెమికల్ ఇంజినీరింగ్ చదివి 1957లోనే అమెరికా వెళ్ళిపోయారు. అక్కడ ఎన్నో సుప్రసిద్ధ సంస్థల్లో పనిచేసి ప్రఖ్యాతి, ఐశ్వర్యం సంపాదించుకున్నారు. వృత్తిరీత్యా యూరప్‌లో, ముఖ్యంగా స్పెయిన్, పశ్చిమ జర్మనీ దేశాల్లో విస్తృతంగా పర్యటించి ఏసుక్రీస్తు పుట్టుక, శాంతి స్పృహ, శిలువ శిక్ష, పునరుజ్జీవనం మొదలైన విషయాలను గురించి పరిశోధనలు చేసేరు. ఏసుక్రీస్తు చిన్నతనంలో కాశ్మీర్‌కి వచ్చి బుద్ధభగవానుని శిష్య ప్రశిష్యుల ప్రభావం పొంది శాంతి అహింసల విలువ తెలుసుకొని వెళ్ళాడనీ, అక్కడివారికి అతని బోధలు నచ్చక శిలువ శిక్ష విధించినా కొన్ని పరిస్థితుల కారణంగా ఆ శిక్ష అమలు అవలేదనీ అతడు రాత్రికి రాత్రే బయలుదేరి తూర్పుదిశగా ప్రయాణం చేసి కాశ్మీర్ చేరుకొని ఇక్కడే కాలం చేశాడనీ తన మృత్యువు అనంతరం తన శరీరాన్ని దహనపరచకుండా ఖననం చేయమని చెప్పుకున్నందువల్ల ఆ సమాధి ఇప్పటికీ కాశ్మీర్‌లో శ్రీనగర్‌లో ఉందనీ సాధికారికమైన వివరణలతో "Jesus in India" అనే సంచలనాత్మకమైన గ్రంథం వ్రాశారు.

★

## ప్రియాగ్రహారం

**ప్రియాగ్రహారం,** హరిశ్చంద్రపురం అగ్రహారాల భూమిని పాండిత్య ప్రతిభకు గాను బ్రాహ్మణ పండితులకు పర్లాకిమిడి మహారాజుగారు భూమి దానంగా ఇచ్చారు. ప్రియాగ్రహారం ఇనాం భూమి. హరిశ్చంద్రపురం మాత్రం ఎస్టేట్ భూమి రెండూ కలిపి సుమారు 1200 ఎకరాలు. ఇందులో లక్కందొడ్డిలో ఉన్న కన్నేపల్లివారి భూమి కూడా ఉంది. ప్రియాగ్రహారంలో ఉన్న దేవాలయం, నాలుగువంతుల భూమి కన్నేపల్లివారిదే.



డా॥ పినాకపాణిగారు నివసించిన ఇల్లు

పర్లాకిమిడి మహారాజావారికి హరి, ప్రియ అనే ఇద్దరు కుమార్తెలు ఉండేవారని, వారి పేర ఈ అగ్రహారాలు వెలిశాయని చెప్పుకుంటారు. ఈ రెండు గ్రామాలు పోలాకి మండలంలో 5వ నెంబరు జాతీయ రహదారికి పడమట దిశలో 10 కి.మీ.ల దూరంలో ఉన్నవి.

ప్రియాగ్రహారంలో పుట్టిన మహానుభావులు గరిమెళ్ళ సత్యనారాయణ గారు, శ్రీపాద పినాకపాణిగారు, కరుణాకరం సుబ్బారావుగారు, శ్రీపాద వెంకట జగన్నాధరావుగారు. వీరిలో పినాకపాణిగారు ప్రముఖ విద్వాంసులు కాగా, మిగతా వారు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు.

ప్రియాగ్రహారం ఒకప్పుడు 60 ఇళ్ళ అగ్రహారం. కాలక్రమాన చాలామంది ఈ అగ్రహారం వదిలి పట్టణాలకు వలస వెళ్ళారు. పెద్ద పెద్ద భవంతులు ప్రస్తుతం శిధిలావస్థకు చేరుకున్నవి. మాజీ శాసనసభ్యులు కన్నేపల్లి అప్పల నరసింహం భుక్తగారి ఇల్లు మాత్రమే కాస్త మెరుగ్గా ఉంది. కన్నేపల్లి వారి ఇంట సుమారు 1968-70 వరకు "అభ్యాగతి నియమం" ఉండేదని తెలుస్తున్నది. మధ్యాహ్న భోజనం వేళకు ఇంటి వద్ద ఒక అభ్యాగతి ఉంటేనే గృహస్థు భోజనం చేయాలి తప్ప, అలా ఎవరూ చేరి ఉండకపోతే గృహస్థు రాత్రిపూట మాత్రమే భోజనం చేయాలని ఆ నియమం. ప్రస్తుతం 12 బ్రాహ్మణ కుటుంబాలు మాత్రమే ఉన్నవి. గరిమెళ్ళ సత్యనారాయణగారు నివసించిన 'గరిమెళ్ళ విహార్'లో ప్రస్తుతం రావి కాళిదాసుగారి కుటుంబం ఉంటున్నది. పినాకపాణిగారు నివసించిన ఇంటిలో రామసన్యాసి సిద్ధాంతి గారి కుటుంబం ఉంటున్నది.

గరిమెళ్ళ సత్యనారాయణగారు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. ఈయన ఉన్నత విద్యాభ్యాసం విజయనగరం, మచిలీపట్నం కళాశాలలలో జరిగింది. 1920లో గాంధీగారి సహాయ నిరాకరణ ఉద్యమానికి స్పందించి, గరిమెళ్ళవారు చదువుకి స్వస్తి చెప్పారు. 1921లో ఈయన రాసిన 'స్వరాజ్య గీతాలు' వెలువడినాయి. 'మాకొద్దీ తెల్లదొరతనము' అంటూ తెల్లదొరలను అదరగొట్టిన గేయం రాసారు. రాజద్రోహ నేరారోపణపై ఈయన గొంతు నొక్కడానికి బ్రిటీష్ ప్రభుత్వం ప్రయత్నించినా ఈయన



గత వైభవాన్ని చాటుతున్న కన్నేపల్లి వారి భవంతులు



గరిమెళ్ళవారు నివసించిన ఇల్లు

లొంగలేదు. మద్రాస్ వెళ్ళి పాత్రికేయునిగా, సంపాదకునిగా చేసిన ఉద్యోగాలు ఈయనకు అచ్చిరాలేదు. అవసానదశలో భోజనం లేని పరిస్థితి కూడా దాపురించింది. చివరికి ఏ విషయలోనూ ఎవరి సహాయ సహకారాలూ లభించక ఈ మహానుభావుడు 1952లో కన్నుమూయడం దురదృష్టకరం.

ఈ అగ్రహారంలోనే పెరిగిన మరొక మహోన్నత వ్యక్తి శ్రీపాద పినాకపాణిగారు. వృత్తిరీత్యా వైద్యుడైనా ప్రవృత్తిరీత్యా సంగీత విద్వాంసుడు. ఈయన లక్ష్మణరావు మాస్టారుగారి వద్ద సంగీతం నేర్చుకున్నారు. తరువాత ద్వారం వెంకట స్వామి నాయుడు గారితో పరిచయం ఏర్పడింది. పినాకపాణిగారు విశాఖపట్నం వైద్యకళాశాలలో చదివినా, సంగీత సాధన విడువలేదు. ఈయనకి ఎన్నో బహుమతులు వచ్చాయి. బంగారు బహుమతులన్నీ కరిగించి భద్రాద్రి సీతమ్మవారికి వడ్డాణం చేయించిన కర్మయోగి. భారత ప్రభుత్వం ఈయనకి 'పద్మభూషణ్' బిరుదు ఇచ్చి సన్మానించింది. పినాకపాణి గారి కంఠమే కాకుండా కలం కూడా ఘనమైనదే. ఫలితంగా ఎన్నో గ్రంథాలు ఈయన కలం నుండి జాలువారాయి. త్యాగరాయ కృతుల అన్నిటి సాహిత్యాన్నీ సేకరించి ప్రతి రచనకు వారు నిర్దేశించిన స్వరాలు (Notation) వివరిస్తూ రూపొందించిన బృహద్గ్రంథం తెలుగు సంగీత విద్యార్థులు, సాధకులు, పండితులు యావన్మందికి వేదం వలె పూజనీయంగా, గీతవలె ఆచరణీయంగా భాసించగల ప్రామాణిక గ్రంథం.

★

## రాణిగాం

**ఈ అగ్రహారం** మందస మండలంలో మందసకు తూర్పుగా, అనంతపురం రోడ్డుకు దక్షిణం వైపున, బైరిసారంగపురానికి ఆగ్నేయంగా 2 కి.మీ.ల దూరంలో ఉంది. వాల్తేరు - హౌరా రైల్వే లైన్లలో, మందస రోడ్డు అనే రైల్వేస్టేషన్‌కు వాయవ్యంగా 2 కి.మీ.ల దూరంలో ఉంది. ఈ అగ్రహారాన్ని మందస మహారాజావారు బహూకరించారు. ఒకనాడు 30 కుటుంబాలు ఉండేవి. కాలక్రమేణా ఇక్కడి వారు జరుగుబాటు కోసం పట్టణాలకు వలస వెళ్ళారు. ఇక్కడ తురుమెళ్ళవారు, నిష్ఠలవారు ఆర్థికంగా బాగా ఉండేవారు. ప్రస్తుతం 2 కుటుంబాలు మాత్రమే ఉన్న ఈ అగ్రహారికులకు మిగతా అగ్రహారాలలో చాలా వాటికి మాదిరిగానే నష్టపరిహారం ఏ మాత్రం అందలేదనే చెప్పాలి.

★

# శాసనం

**ఈ అగ్రహారం** టెక్కలి - పలాసకు వెళ్ళే 5వ నెంబరు జాతీయ రహదారిలో టెక్కలికి 6 కి.మీ.ల దూరంలో ఈశాన్యంగా ఉంది. టెక్కలి రాజావారిచే ఈ అగ్రహారం నిష్టలవారికి బహూకరింపబడినది. ఈ అగ్రహారానికి దానంగా ఇచ్చిన భూమి విస్తీర్ణం 150 ఎకరాలు. మొదట ఈ అగ్రహారంలో 60 బ్రాహ్మణ కుటుంబాలు ఉండేవి. వారిలో ముఖ్యులు నిష్టలవారు, రావివారు, హోతావారు.

ఈ అగ్రహారానికి చెందిన రావి జగన్నాధరావు గారు జిల్లా ఎస్యూరెన్స్‌ల రిజిస్ట్రార్‌గా పనిచేశారు. ఈయన ప్రముఖ జ్యోతిష్కుడిగా, హస్త సాముద్రికుడిగా పేరు గాంచారు. ఇదే అగ్రహారానికి చెందిన నిష్ఠల రామకృష్ణమూర్తిగారు రెవెన్యూ డిపార్టుమెంట్‌లో పనిచేసి, పదవీ విరమణ అనంతరం శ్రీకాకుళం (పురుషోత్తమనగర్)లో స్థిరపడ్డారు. వీరి పెద్దకుమారుడు నిష్ఠల వెంకట రమణమూర్తి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా అమెరికాలో ఉన్నారు. రామకృష్ణమూర్తి గారి సోదరుడు నిష్ఠల మోహనరావుగారు గిరిజన సహకార సంస్థ (జి.సి.సి.) పాతపట్నంలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. రామకృష్ణ మూర్తిగారి పెద్ద సోదరిని ప్రముఖ రంగస్థల నటుడు, సినిమా నటుడు జె.వి. సోమయాజులుగారు వివాహం చేసుకున్నారు. సుప్రసిద్ధ కథారచయిత భమిడిపాటి రామగోపాలంగారి పితామహుల శ్వశ్రు గృహం ఈ గ్రామంలోనే ఉండేది.

ప్రస్తుతం ఈ గ్రామంలో రెండు మూడు కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. వీరి వృత్తి పౌరోహిత్యం కాగా మరొక కుటుంబం టీ దుకాణం నడుపుతూ సామాన్య జీవనాన్ని గడుపుతున్నారు. చాలా కుటుంబాలు ఉద్యోగరీత్యా పట్టణాలకు తరలి వెళ్ళాయి.

ఈ గ్రామంలో రెండు పురాతన దేవాలయాలున్నాయి. శ్రీ జగన్నాధ స్వామి దేవాలయం ఒకటి, శ్రీ చంద్రశేఖర స్వామివారి దేవాలయం మరొకటి.

శ్రీ జగన్నాథస్వామి వారి దేవాలయంలో గల జగన్నాథ్, సుభద్ర, బలభద్రుని విగ్రహాలు, పూరి జగన్నాథుని ఆలయంలో ఉన్న విగ్రహాల కంటే పెద్దవిగా ఉండడం విశేషం. కొంతకాలం వరకు రథయాత్ర కూడా జరిగేది. ప్రస్తుతం ఈ ఆలయ సంరక్షణ నామమాత్రంగానే ఉంది. నేడు ఆలయానికి సంబంధించిన "దేవుడి మాన్యం" ఏమీ లేదు. అయినా గ్రామస్థులే సొంత ఖర్చులతో ఈ ఆలయ సంరక్షణ, నిత్యపూజలు కొనసాగించడం హర్షణీయం.

★

## సంగం - బిటివాడ

**బిటివాడ** గ్రామాన్ని పేర్కొనేటప్పుడు 'సంగం బిటివాడ' అనే అంటారు. నాగావళి నదికి, సంగం దక్షిణంగాను, బిటివాడ ఉత్తరంగాను ఇంచుమించు నదీతీరాలనే ఉన్నాయి. సంగం అంటే సంగమం. ఉత్తరాదిన గంగ, యమున, సరస్వతి నదులు మూడూ కలిసిన చోటుని 'త్రివేణీ సంగమము' అనే పేరుతో వ్యవహరిస్తున్నాము. అక్కడ సరస్వతి నది అంతర్వాహిని. నిజంగా కలిసేవి గంగా, యమునలే. "నా మనసు గంగ, నీ మనసు యమున, మన మనసులు కలిసి సంగం అవుతుందా" అనే గొప్ప హిందీ పాట ఉంది. ఆ స్థలంలో అలహాబాదు అనే నగరం వెలిసింది. అక్కడ నుండి నెహ్రూ కుటుంబం వచ్చారు. ప్రతియేటా గంగా, యమునల సంగమం వద్ద లక్షలాది యాత్రికులు పవిత్రస్నానాలు చేస్తారు. మన సంగం బిటివాడ వద్ద నిజంగా మూడు నదులు కలుస్తున్నాయి. ఇవి నాగావళి, జంఝావతి, సువర్ణముఖి నదులు. ఇక్కడ కూడా మన తెలుగువారిలో ఆ ప్రాంతపు వారు ఎక్కువమంది, ఒరిస్సాకు చెందిన వారు కొద్దిమంది ప్రతియేటా మహాశివరాత్రి నాడు పవిత్ర స్నానాలు చేసే ఆచారం ఉంది.

సంగం, బిటివాడ 1951లో ఏర్పడిన శ్రీకాకుళం జిల్లాలోని పాలకొండ తాలూకాలో చేరి ఉన్నాయి. ప్రస్తుతం వంగర మండంలో ఉన్నవి. శ్రీకాకుళం నుండి పార్వతీపురానికి ఉన్న రోడ్డులో పాలకొండ, అట్టలి దాటాక తెట్టంగికి నైఋతి దిశలో 5 కిలోమీటర్ల దూరంలో ఉంది.

గుమ్మడ నుండి సీతారామపురం ద్వారా సంగం అనే ఊరికి ఒక రోడ్డు కూడా ఉంది. సంగం, బిటివాడ, అనే రెండు అగ్రహారాలు ప్రాథమికంగా వైదిక బ్రాహ్మణులకు చెందినవి. ఇవి పాలకొండ తాలుకాలో ఉన్నప్పటికీ, ఈ గ్రామాలకు సంబంధించిన భూములను బొబ్బిలి సంస్థానం వారే ఈ బ్రాహ్మణులకు ధారాదత్తం చేశారు. సంగంలోని కొన్ని భూములు మాత్రం పాలకొండ జమీందారు వారు ఇచ్చారని చెప్పుకుంటారు. శ్రీకాకుళం, పార్వతీపురం, రాయగడ ప్రాంతాలలో చారిత్రాత్మకంగా ప్రసిద్ధి చెందిన గుంప, కన్నేపల్లి, సంగం, పాయకపాడు శ్రీకాకుళంలలో గల వాటిని పంచలింగాలు అంటారు. దానిని అనుసరించి సంగం గ్రామంలో సంగమేశ్వర శాస్త్రి ఆలయాన్ని నిర్మించారు. బహుశా తుమరాడ సంగమేశ్వర శాస్త్రిగారికి ఆ నామకరణం

ఆవిధంగా వచ్చిందేమో! సంగం గ్రామంలో నిష్ఠలవారు (వెలనాటి వైదికులు) సుప్రసిద్ధులు. నిష్ఠల ఇంటిపేరు గల కుటుంబాల వారు యావన్మంది ఒకరితో ఒకరు పోటీపడి నిరతాన్న ప్రదాతలుగా పేరుపొందారు. అగ్రహారాల చట్టం ద్వారా భూములన్నీ పోగొట్టుకొన్నా సరే, స్వశక్తి చేత అన్నపానాలకు లోటులేకుండానే ఉన్నారు.

సంగం బిటివాడలలో బిటివాడ ప్రాపంచిక విజయాలకు ఆటపట్టు. ఇక్కడ ఎర్రగుంట్ల వారు, పమిడిముక్కల వారు, మేడూరి వారు విద్యావంతులుగా అప్పటి విశాఖపట్నం జిల్లా పౌరులను, అధికారులను మెప్పించి ఉపాధ్యాయ వృత్తినుండి రెవెన్యూ పాలనా వృత్తి వరకు, ఎన్నెన్నో స్థానాలలో పేరుపొందారు. ఎర్రగుంట్ల సూర్యనారాయణ మూర్తిగారు హెడ్మాష్టరుగా రిటైర్ అయి, ప్రస్తుతం అక్కడే ఉన్నారు. జోగి భుక్త గారు కూడా రిటైర్డ్ హెడ్మాష్టరే. మేడూరి వారిలో పండితుల సంఖ్య హెచ్చు. వీరందరూ ఒక ఎత్తు, భారతదేశంలో ఉద్భవించిన మహా సంగీత విద్వాంసుల కోవలోకి చేరిన తుమరాడ సంగమేశ్వర శాస్త్రిగారు ఒక ఎత్తు. ఈయన వీణా విద్వాంసుడు. తొలిసారిగా వీరి విద్వత్తును ఆదరించిన వారు గోడేవారు అయినా తరువాత కళింకోట జమీందారులు తమ ఆస్థాన విద్వాంసునిగా నియమించుకొని వారి వ్యాప్తికి సోపానాలు వేశారు. సంగమేశ్వర శాస్త్రిగారికి ఎన్నెన్నో సువర్ణ ఆభరణాలు, హారాలు, కంకణాలు మొదలైనవి లభ్యమైనా వారు జీవిత చరమదశలో కూడా ఆ కానుకలను అమ్ముకోలేదు. "అవన్నీ నా సరస్వతికి వచ్చిన ఆభరణాలు. అమ్మే హక్కు నాకు లేదు" అనేవారు. చివరికి విశ్వకవి రవీంద్రనాథ టాగూర్ శాస్త్రిగారిని శాంతినికేతన్‌కి తీసుకొని వెళ్ళి "వీణాచార్య" అనే అక్షరాలను చెక్కించిన 35 గ్రాముల బంగారు ఫలకం సంగతి కూడా అంతే. అవన్నీ కాలగర్భంలో వారసుల అవసరాలకు ఖర్చయిపోయినా ఆయన వీణ ద్వారా అందించిన సంగీత సరస్వతి మాత్రం శాశ్వతమై ఉంది.

ఇక్కడ లక్ష్మీసరస్వతులు ఇంత వ్యాప్తికి వచ్చినా ఇక్కడి వారే అయిన మరొక ఇంటిపేరు వారు ఎంతో ధనం, బలం సంపాదించినా పిల్లికి బిచ్చం పెట్టని వారు కూడా ఇప్పటికీ ఉన్నారు.

★

# సత్యవరం అగ్రహారం

**శ్రీకాకుళం జిల్లాలో** నరసన్నపేట మండలంలో, నరసన్నపేట గ్రామానికి దగ్గరలో, ఐదవ నెంబరు జాతీయ రహదారికి పక్కగా కోమర్తికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామం, విజయనగరం రాజులిచ్చిన అగ్రహారం ఇది. దానం చేసిన భూమి 1500 ఎకరాలు.

అగ్రహారం అందుకున్న వంశం ఆకెళ్ళవారు వెలనాటి బ్రాహ్మణ కుటుంబీకులు. సత్యవరం గ్రామంలో ప్రవేశిస్తూనే ఎడమప్రక్కగా చూస్తే తొలి ఇల్లు వారిదే. ఇతర కుటుంబాలతో కలిసి 50 గృహాల బ్రాహ్మణులున్నారు.

ఈ అగ్రహారం విజయనగరం రాజులు, ఆకెళ్లవారు, వేపావారు అనే ఇంటి పేరు గల బ్రాహ్మణ వంశస్తులకు, యగళ్ళ వారనే ఇంటిపేరు గల కాళింగ కులస్తులకు ప్రదానం చేశారు. సుమారు 300 సంవత్సరాలకు పూర్వం నాటిదీ అగ్రహారం. ఇది ఇనాందారీ మాన్యం.

ఈ అగ్రహారీకులైన బ్రాహ్మణులలో ప్రస్తుతం 78 సంవత్సరాల వయసు గల ఆకెళ్ళ అనంతరామయ్యగారు, కుటుంబం ఉంటున్నారు. అనంతరామయ్య ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్‌గా ఉద్యోగం చేసి 1987లో పదవీ విరమణ చేసి విశ్రాంత జీవితం గడుపుతున్నారు.

అనంతరామయ్యగారు ప్రభుత్వం నుండి 'జ్యోతిషరత్న' బిరుదు పొందినవారు. భూవసతి లేదు. ఉద్యోగ పెన్షను అందుకుంటున్నారు. పిల్లలకు ఉద్యోగాల్లేవు. చిన్న ఇల్లు ఉన్నది. అనంతరామయ్య గారికి ఒక్కడే కొడుకు సుబ్రహ్మణ్యం. అతని కొడుకులు శ్రీరామదత్తు, కళ్యాణదత్తు.

ఆకెళ్లవారి వంశంలోని ఆదినారాయణగారు ఇనాందారుల సంఘానికి ప్రెసిడెంటు. మరొక బ్రాహ్మణ కుటుంబం వేపావారు. గ్రామం విడిచి వెళ్ళి, హైదరాబాదు, చెన్నైలలో పెద్ద పెద్ద ఉద్యోగాలలో స్థిరపడినారు. న్యాయమూర్తిగా ఉద్యోగం చేసిన వేపా రామేశం వేపా పట్టాభి రామారావు తదితర ఐ.ఎ.ఎస్. ఆఫీసర్లున్నారు.

ఆర్థికంగా ఉన్నతంగా నిలద్రొక్కుకోలేకపోయినా, ఆదరణకు అతిథి మర్యాదలకు అణువంత లోపం రాకుండా చిక్కని కాఫీలిచ్చి, చక్కగా భోజనాలు వడ్డిస్తూ ఆనందంగా ఆదరిస్తున్నారు. అయితే ఆనాటి బ్రాహ్మణ మంత్రివర్యులు కళా వెంకటరావు గారి చేతి మీదుగా అగ్రహారాలు రద్దు చేస్తూ కొన్నివేలమంది బ్రాహ్మణుల కుటుంబాలు నిరుపేదలు కావడం జరిగిందని విచారించారు.

★

## తుంగతంపర

**ఈ అగ్రహారం** హిరమండలం మండలంలో గొట్ట బ్యారేజికి ఉత్తరంగా రెండు కిలోమీటర్లలో వంశధార నదికి, మహేంద్రతనయ నదికి మధ్యలో ఉన్నది. ఇది 'హిరమండలం' మండలంలో గొట్ట బ్యారేజీకి దగ్గరలో ఉన్నది. ఈ అగ్రహార భూముల విస్తీర్ణం సుమారు 1800 ఎకరాలు.

కవి పండితుల పాండిత్య ప్రతిభకు మెచ్చి ఈ అగ్రహారాన్ని పర్లాకిమిడి మహారాజా వారు బహూకరించారని ఈ అగ్రహారానికి చెందిన ప్రవా శ్రీరామమూర్తి గారు తెలిపారు. ఒకనాడు చాలా ఇళ్ళు, భూములు ఈ అగ్రహారం వారికి ఉండేవి. భూములన్నీ పోయిన తరువాత భుక్తికోసం పట్టణాలకు వలస వెళ్ళారు.

20వ శతాబ్దం తొలి భాగంలోనే ప్రవా యజ్ఞేశ్వర శాస్త్రిగారు చుట్టుపక్కల గ్రామాలన్నింటికి నాయకునిగా ఉండేవారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకునేవారు. రాజుల హయాంలో ఈ అగ్రహారంతో బాటు చుట్టుపక్కల గ్రామాలు అన్ని సుభిక్షంగా ఉండేవి. యజ్ఞేశ్వర శాస్త్రిగారు గుంటూరు జిల్లా నరసరావుపేట ప్రాంతానికి చెందినవారు. ఈయన బాల్యంలో తల్లితండ్రులతో కాశీ వెళ్ళి, తిరిగి వస్తుండగా తుంగతంపర బ్రాహ్మణ దంపతులకు సంతానం లేని కారణంగా శాస్త్రిగారిని దత్తత చేసుకున్నారట. ఆ బాలుడే తరువాత కాలంలో ప్రజాసేవకుడిగా మారాడు.

శాస్త్రిగారు కాంగ్రెస్ పార్టీలో ఉంటూ చుట్టుపక్కల ఉన్న ప్రజలకు సేవ చేసేవారు. 1937లో ఒరిస్సా రాష్ట్రం ఏర్పడినప్పుడు ఈ గ్రామంతో బాటు చాలా సరిహద్దు గ్రామాలు ఒరిస్సా రాష్ట్రానికి వెళ్ళి ఉండేవి. కాని గిడుగు రామమూర్తిగారు పర్లాకిమిడి రాజుల ధాటికి ఎదురుతిరిగి, బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాడి, ఈ గ్రామాలన్నీ అవిభక్త మద్రాస్ రాష్ట్రంలోనే ఉండేటట్లు చేశారు.

ఈ గ్రామంలో గుండుగోల వారు, దేవరకొండవారు మరియు రాచకొండ వారి కుటుంబాలు ప్రముఖంగా ఉండేవి. ఈ గ్రామంలో పుట్టిన స్వాతంత్ర్య సమర యోధుడు గరిమెళ్ళ కృష్ణమూర్తి పేరుని ప్రముఖంగా చెప్పుకోవచ్చు. 1929లో స్థాపించిన 'ప్రజావాణి' అనే పత్రికకు తొలిసంపాదకులుగా కృష్ణమూర్తిగారు కావడం గర్వించదగ్గ విషయం. ఈ గ్రామానికి చెందిన నాగులకొండ వారు అటు అగ్రహారుకులు కాక, ఇటు వ్యవహర్తలు కాక పట్టణాలకు వలస పోయారు. వారిలో నాగులకొండ పెద్ద సన్యాసిరావు గారు మూడు దశాబ్దాల పాటు టైపు స్కూలు నిర్వహించారు.

★

# విజయనగరం జిల్లా

## అజ్జాడ

**అజ్జాడ అగ్రహారం** ఒకప్పటి బొబ్బిలి తాలుకాలోది. ప్రస్తుతం సీతానగరం మండలంలో చేరి ఉంది. తూర్పుకనుమలలోని ఆంధ్ర కొండలలో ఉత్తరభాగంలోని ఒక వాగు వేగవతి నదిగా రూపొందింది. ఈ నది ఒడ్డున ఉన్న సారవంతమైన గ్రామాలలో అజ్జాడ ఒకటి.



అజ్జాడ అనగానే మనకందరికి ఆదిభట్ల నారాయణదాసుగారు జ్ఞాపకం వస్తారు. చాలామంది పెద్దలు, విద్వాంసులు తమరు ప్రఖ్యాతులు కాగానే తమ జన్మస్థలాల పేర్లను వట్టించుకోరు. నారాయణదాసుగారు దీనికి భిన్నంగా తన పేరును అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసుగా ఆమరణాంతం చెప్పుకుంటూ వచ్చారు.

ఈ అగ్రహారంలో ఆదిభట్లవారితో బాటు గంటి మహాపాత్రుని వారు ముఖ్యులు.

"హరికథా పితామహుడగు ఆదిభట్లదాసు
సంగీతం, సాహిత్యం సరితూచిన త్రాసు" - అని శ్రీశ్రీగారన్నారు.

ఆదిభట్ల వారు ద్రావిడ వైదిక బ్రాహ్మణులు. అలాగని చాదస్తులు కారు. వారిలో చాలామంది క్రాంతదర్శులు. అజ్జాడకు సమీపంలోనే ఉన్న కార్యవలస అగ్రహారం కూడా బొబ్బిలి తాలుకాలోనిదే. ఈ ఊరివారు కూడా ఆదిభట్ల ఇంటిపేరు వారే. ఆదిభట్ల చయనులు గారు నిరతాన్న ప్రదాత. వారి వంశం నుంచి వచ్చిన విప్లవ పుష్పం ఆదిభట్ల కైలాసం. కృతకములైన రాజకీయ సిద్ధాంతాల వలన ఏర్పడిన విభేదాల చీకటిలో కైలాసంగారి ప్రజాక్షేమ కాంక్ష కానరాక పోలీసువారు ఆయనను అన్యాయంగా కాల్చిచంపారు.

ఆదిభట్ల వారిలో వెంకటరమణగారి వంటి జర్నలిస్టులు కూడా ఉన్నారు. ఒకనాటి వేద శాస్త్ర సంగీత పఠనం ఇప్పుడు కాలానుగుణంగా పత్రికా రచనకు పరిక్రమించడం అది ఒక పరిణామ విశేషం.

★

# బాడంగి

**ఈ అగ్రహారం** రాజాం - రామభద్రపురం రోడ్డులో ఉంది. రామభద్రపురానికి 10 కి.మీ.ల దూరంలో ఉంది. విజయనగరం మహారాజా వారు పూర్వం కాశీకి వెళ్తూ దారిలో మకాం చేసిన గ్రామాలకు, అగ్రహారాలుగా హోదా కల్పించి ఇచ్చిన వాటిలో ఒకటి.. వడుకూరు మృత్యుంజయం అను వారికి మొట్టమొదట ఈ గ్రామాన్ని ఇచ్చేరు. కాలక్రమేణా మిగతా బ్రాహ్మణులు ఇచ్చట చేరి ఒక గ్రామముగా ఏర్పడినారు.

భైరి సూర్యనారాయణగారు, లాలూ సాంబమూర్తిగార్లకు చాలా భూములు ఉండేవి. ఇదివరకు గరిమెళ్ళ సీతా రామ్మూర్తి గారికి మర్రివలస అగ్రహారం ఉండేది. ఇప్పుడది బేబిరామ్ గ్రామంగా మారింది.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో బ్రిటీష్ ప్రభుత్వం ఈ గ్రామ భూములు కొన్నిటిని సమతలంగా చేసి ఒక చిన్నపాటి విమానాశ్రయాన్ని ఏర్పాటు చేసింది. ఆ కారణంగా తమ భూములను పోగొట్టుకున్న వారికి ఎలాంటి నష్టపరిహారాన్ని చెల్లించలేదు.

"జీవనభృతి కోరేవారు సైన్యంలో చేరండి'' అన్నారు. భూములు నష్టపోయిన వారు అందరూ (యుద్ధం చేయడానికి ఇష్టపడని) బ్రాహ్మణ కులస్తులే. ఊరు విడిచి వెళ్ళే సాహసం గాని, తల్లినేలను వీడిపోయే కృతఘ్నతగాని లేని భూమిపుత్రులే. యుద్ధం ముగిసేక ఏరోడ్రోం భూములు తిరిగి సేద్యకారులకు వచ్చాయి. కాని 1956 చట్టం ప్రకారం మళ్ళీ బ్రాహ్మణుల మీద వేటుపడింది.

ప్రస్తుతం బాడంగిలో సుమారు డజను కుటుంబాలున్నవి. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన ఈ గ్రామం ఇప్పుడు దయనీయ పరిస్థితులలో ఉన్నది. చాలా ఇళ్ళకు పెంకులు కూడా ఊడిపోయాయి. ప్రస్తుతం నివసిస్తున్న వారిలో కొడుకులవారు, తాతావారు, గరిమెళ్ళవారు, మండావారు, ఆరవెల్లివారు, భైరివారు కాస్త మెరుగ్గా ఉన్నారు. మొత్తానికి ఈ అగ్రహారాల వారి ఆర్థిక పరిస్థితి కూడా దైన్యంగా ఉంది. జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సంఘం వీరిని పట్టించుకొని ప్రాథమిక వసరులనైనా సమకూర్చే ప్రయత్నం చేస్తారని పలువురు ఆశిస్తున్నారు.

★

# చల్లపేట

**ఈ అగ్రహారం** విజయనగరం జిల్లాలో మెంటాడ మండలంలో ఉంది. ఇది గజపతినగరానికి పడమటగా15 కి.మీ.ల దూరంలో ఉన్నది. ఉర్లాం జమీందారీ వ్యవస్థ ఉన్నప్పుడు ఉర్లాం జమీందారిణి మహాలక్ష్మమ్మగారు జరిపిన వేదపరీక్షలో నెగ్గిన గంటి, తాతా, పుల్లాభొట్ల మరియు అయ్యలసోమయాజుల ఇంటిపేర్ల వారిని విజేతలుగా ప్రకటించారు. ఆ వేద పరీక్షలలో నెగ్గినవారిని ఉర్లాం పద్దులు అనేవారు. వారు చల్లపేటలో ఎక్కువగా ఉండేవారు. అంతేకాక శాస్త్ర, జ్యోతిష పండితులు ఎక్కువగా ఉండేవారు. వారి నైపుణ్యాన్ని మెచ్చి ఈ అగ్రహారాన్ని విజయనగరం మహారాజావారు బహూకరించారు. 276 ఎకరాలు.

ఒకనాడు 60 ఇళ్ళు ఉన్న ఈ అగ్రహారంలో నేడు 3 ఇళ్ళు మాత్రమే ఉన్నవి. ఆ మూడు ఇళ్ళవారు కూడా అచ్చట నివసించక కాకినాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో ఉంటూ భూములను చూసే నిమిత్తం ఈ ప్రాంతానికి వస్తూంటారు.

గంటి సుబ్బావధాన్లు, కాశీ ప్రకాశంగారు కూడా ఉర్లాం పద్దులే. తాతా అక్కాజీ రామయ్య పంతులుగారు జ్యోతిష పండితులు. అతని తండ్రి కామయ్యగారు మహా మంత్రవేత్త. ఇతని వద్ద చాలా తాళపత్ర గ్రంథాలు ఉండేవి. వారి మునిమనుమడైన తాతా రాంబాబు గారు నాగిరెడ్డి గారు కలెక్టరుగా ఉన్నప్పుడు నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్స్ & కల్చరల్ హెరిటేజ్‌కి పత్రాలు ఇచ్చేశారు. ఆ విధంగా పత్రాలు ఇచ్చినట్లు సర్టిఫికేట్ కూడా ఉంది. ఆ సర్టిఫికేట్లు 1974-75 ప్రాంతంలో ఇచ్చారు. రాంబాబు గారి వద్ద ఒక తాళపత్ర గ్రంథం కట్ట ఉంది. అక్షరాలు చక్కగా ఇప్పటికీ కనిపిస్తూ ఉన్నవి. తాతా రాంబాబుగారు గజపతినగరం ఉన్నత పాఠశాలలో తెలుగు పండితునిగా పనిచేసి 1979లో పదవీ విరమణ చేశారు. గీతోపన్యాసాలు ఇవ్వడం వారికి ఆసక్తికరమైన అంశం. వీరి అబ్బాయి అమెరికాలో ఇంజినీర్‌గా, మరొకరు బరోడాలో కెమిస్ట్‌గా ఉన్నారు. తాతా రాంబాబుగారి తమ్ముడి కొడుకు పది సంవత్సరాల వయసులో అంధత్వం సోకడంతో ఎందరో వైద్యులకు చూపించారు. ఫలితం శూన్యం. వాటిని అధిగమించి అద్భుతమైన గణితశాస్త్ర ఉపాధ్యాయునిగా ఖ్యాతిగాంచారు. మహామేధావి కావడంతో కాకినాడలో ఉపన్యాసకులుగా పనిచేయడమే కాకుండా, ఐ.ఎ.ఎస్. ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులై మెయిన్ పరీక్షలు కూడా రాసి ఈ వ్యాసరచన

నాటికి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు.

తాతా కామయ్యగారి తమ్ముడు భగవద్గీత 18 అధ్యాయాలు వలయ ఆకారంలో తాళపత్రాలపై రాసి సూర్యనారాయణమూర్తి వారి కంఠంలో వేశారట. ఇది సుమారు 150 సంవత్సరాల క్రితం మాట. అవి ఎన్నో సంవత్సరాల వరకు ఉండేవట. నేమాని వారి కుటుంబంలో పండితులు కూడా ఉర్లాం పద్దేనట. గంటి అన్నాజీరావు, భాస్కరరావు అమెరికాలో ఉన్నారు. గంటి సుబ్బారావుగారి అబ్బాయి బొంబాయిలో మంచి ఉద్యోగంలో ఉన్నారు.

ప్రస్తుతం 3 ఇళ్ళు మాత్రమే ఉన్నవి. అగ్రహారికులు అప్పుడప్పుడు వచ్చి ఇక్కడ ఉన్న భూములను చూసుకొనే నిమిత్తం ఆ ఇళ్ళు ఉపయోగపడుతున్నవి.

★

# చిట్టాయవలస

**ఈ అగ్రహారం** విజయనగరం జిల్లా గజపతినగరానికి పడమటగా 5 కి.మీ.ల దూరంలో మెంటాడ మండలంలో మెంటాడ రోడ్డున ఉన్నది. విజయనగరం మహారాజా వారు పంతుల బ్రహ్మన్న గారికి వారి కవిత్వానికి మెచ్చి ఈ అగ్రహారాన్ని దానంగా ఇచ్చారు. బ్రహ్మన్నగారు మహాకవి. వీరి ముత్తాతలు విజయనగరం సంస్థానంలో పనిచేశారు. బ్రహ్మన్నగారి ఇల్లు ప్రస్తుతం చిట్టాయవలసలో శిథిలావస్థలో ఉన్నది. ఆనాడు రాజావారు దానంగా ఇచ్చిన భూమి సుమారు 200 ఎకరాల పైనే.

ఒకనాడు 30 ఇళ్ళు ఉన్న ఈ అగ్రహారంలో నేడు 5 మాత్రమే ఉన్నాయి. పూర్వం ఉన్న 30 ఇళ్ళలోను పంతుల వారి కుటుంబాలవే ఎక్కువగా ఉండేవి. పంతుల లక్ష్మీనారాయణ శాస్త్రిగారు విజయనగరం ఎం.ఆర్. కాలేజీ హైస్కూలులోను, సంస్కృత కళాశాలలోను పనిచేశారు. ఆయనకు విద్వాన్, ఉభయ భాషాప్రవీణ వంటి యోగ్యతాపత్రాలు లేకపోయినా తెలుగు, సంస్కృతం విద్యార్థులకు బోధించే పరిణతి ఉందని తెలుసుకున్న (విజయనగరం) ఎం.ఆర్. కాలేజీ యాజమాన్యం సెకండరీ గ్రేడు ఉపాధ్యాయుడుగా ఉద్యోగం ఇచ్చేరు. ఉద్యోగంలో చేరిన ఏడాదిలోపుగా ఉభయ భాషాప్రవీణ పరీక్షలో ఉత్తీర్ణత సాధించేరు. వీరు రచించిన తెలుగు పద్యకావ్యాన్ని ఎనిమిదవ తరగతి (థర్డ్‌ఫాం)కి పాఠ్యపుస్తకంగా నిర్ణయించేరు. ఆయన రచించిన కావ్యంలోని పద్యాల స్వారస్యాలు ఆయన నోటనే విన్న ధన్యవిద్యార్థులు ఇప్పటికీ అక్కడక్కడ ఉన్నారు. ఫిలాసఫీ (పునర్జన్మ జ్ఞానం) గురించి గ్రంథం వ్రాసి, రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ గారికి పంపగా, దానికి రాధాకృష్ణన్ గారే పీఠిక వ్రాశారట. ఇంత చక్కని గ్రంథం ఎవరూ రాయలేదని యోగ్యతాపత్రం ఇచ్చారు. లక్ష్మీనారాయణ శాస్త్రిగారికి సంగీతంలో కూడా ప్రావీణ్యత ఉండేదట. పంతుల బ్రహ్మన్నగారు 'శ్రీ సింహాచల క్షేత్రం', 'ఇందుమతీ పరిణయం' అనే శతకాలు కూడా రాశారు. అవి తంజావూరు గ్రంథాలయంలో వ్రాతప్రతులుగా ఉన్నవి.

ఇక్కడి వారు కొందరు జీవనోపాధికి ఉపాధ్యాయ ఉద్యోగాలు, పౌరోహిత్యం చేస్తూ ఉన్నారు.

★

# దేవాడ

**ఈ అగ్రహారం** విజయనగరం మహారాజావారిచే ద్రావిడ బ్రాహ్మణులకు బహూకరింపబడినది. 18, 19 శతాబ్దాలనాడు ఇక్కడ ఉండినవారు క్రమంగా ఉపాధి కోసం ఉన్న ఊరు విడిచివెళ్ళారు. చాలామంది శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం ప్రాంతాలలో స్థిరపడ్డారు. ఇక్కడ ఉన్న బ్రాహ్మణ కుటుంబాలలో వడ్లమాని వారు, వేదుల వారు, కొడుకుల వారు, పేరి వారు, గన్నవరపు వారు, వేలమూరి వారు, మల్లాజోస్యులవారు ప్రముఖులు. అయితే, ప్రస్తుతం వడ్లమానివారు, గన్నవరపువారు, కొడుకుల వారు, పేరి వారు మాత్రమే ఉన్నారు. పది కుటుంబాలు మాత్రమే ఉన్నాయి.

ఇక్కడ ఈశ్వరాలయం గ్రామ ప్రజలచే నిర్మించబడినది. లింగప్రతిష్ఠ కళ్యాణానంద భారతిగారు చేశారు. శ్రీ రామాలయంలో కూడా పూజలు జరుగుతున్నవి. వడ్లమాని శంకరంగారు, గన్నవరపు శ్రీరామమూర్తిగారు ఇక్కడ పురోహితులుగా ఉన్నారు.

★

# గరికవలస

**ఈ అగ్రహారం** విజయనగరం జిల్లాలో గజపతినగరం మండలంలో గజపతినగరానికి 5 కి.మీ. దూరంలో ఉన్నది. ఈ అగ్రహారం విజయనగరం మహారాజావారు గొర్తివారి కుటుంబానికి 19వ శతాబ్దంలో దానం చేశారు. దీనిని గురించి ఒక చిత్రమైన ఉదంతం ప్రచారంలో ఉంది.

ఆనాటి విజయనగరం మహారాజా వారు వేటకు వెళ్ళి, దారితప్పి ఇప్పుడు గరికవలసగా ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. మధ్యాహ్నం కావడంతో, బాగా ఆలస్యం అయింది. రాజావారికి, వారి పరివారానికి చాలా ఆకలి వేస్తున్న సమయంలో గొర్తివారి ఆడపడుచు వారి భోజనంలోనికి ఏ అధరువు దొరకక పెరటిలోని గరికతో పచ్చడి చేసి వడ్డించిందట. ఆకలితో ఉన్న రాజు దానిని అమృతతుల్యంగా ఆరగించారు. తరువాత తీరికగా ఆ పచ్చడి గురించి తెలుసుకున్నారు. అందువలన ఆ ప్రాంతానికి గరికవలస అని పేరుపెట్టి అగ్రహారంగా దానం ఇచ్చారు. దానంగా ఇచ్చిన భూమి సుమారు 600 ఎకరాలు.

మొదట్లో 70 ఇళ్ళు ఉండిన ఈ అగ్రహారంలో ప్రస్తుతం 3 ఇళ్ళు మాత్రమే బ్రాహ్మణులవి ఉన్నాయి. జీవనోపాధి ప్రధానంగా అర్చకులుగా, ఉపాధ్యాయులుగా గొర్తివారే కాక, బులుసువారు, గొల్లపూడివారి కుటుంబాలు కూడా ఉన్నాయి.

★

# ఇంగిలాపల్లి

**సుమారు** రెండు శతాబ్దాల క్రితం కురుపాం మహారాజావారు సారెపాకవారికి, పొడకట్లపల్లివారికి ఈ అగ్రహారాన్ని దానంగా ఇచ్చారు. ప్రాథమికంగా వీరు పురోహిత వృత్తివారు. ఆ రోజులలో సుమారు 60 బ్రాహ్మణ గృహాలు ఉండేవని చెప్పుకుంటారు. ఇప్పుడు మాత్రం 10 ఇళ్ళు కంటె ఎక్కువలేవు.

ఈ గ్రామం విజయనగరం-రాయపూర్ రోడ్డుకి (రైల్వే లైన్‌కి కూడా) పడమట దిశగా సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. రోడ్డు ద్వారా అయితే మానాపురం సంతబయలు స్థలం నుండి నాటురోడ్డు ఉంది. రైల్వే ద్వారా అయితే కోమటిపల్లి నుండి. విశాఖపట్నం జిల్లా నుండి శ్రీకాకుళం జిల్లా విడిపడక పూర్వం ఈ గ్రామం బొబ్బిలి తాలుకాలోది. శ్రీకాకుళం జిల్లాలో కొంతభాగం, విశాఖజిల్లాలో కొంతభాగం చేర్చి విజయనగరం జిల్లా ఏర్పరచినప్పుడు ఇది విజయనగరం జిల్లాలో చేరింది. జిల్లాలను మండలాలుగా విభజించినప్పుడు ఈ గ్రామం దత్తిరాజేరు మండలంలోకి చేరింది.

ఈ గ్రామం పొలాల విస్తీర్ణం సుమారు రెండువందల ఎకరాలు. మొదటి తరం అగ్రహారీకులు కాక ఇంకా మండవేముల వారు, యామిజాలవారు, రాపాకవారు, చిట్యంవారు, అడ్డగూడువారు, సుసర్లవారు, ఉండవల్లివారు ఈ గ్రామానికి చేరారు. వీరిలో ఎక్కువమంది పురోహిత వృత్తి చేశారు. కొందరు వ్యవసాయం చేశారు.

సారెపాకవారు ఈ గ్రామంలో ప్రముఖులు. సారెపాక చిన్న మహావజ్ఝులు అనే ఆయన తన యవ్వనకాలం నుండి అరవయ్యేవ వయసు వరకు ఈ గ్రామానికి మునసబుగా పనిచేశారు. సాధారణంగా గ్రామకరణాలుగా బ్రాహ్మణులు ఉంటారు గాని, మునసబు పనిమీద బ్రాహ్మణులను నియమించరు. గ్రామ కరణాల పని... పొలాలను తనిఖీ చేసి, ఏ భూఖండికలో ఎంత పరిమాణపు పంట వస్తున్నదో లెక్కవేసి 'అడంగలు' అనే పుస్తకంలో తన పరిశీలనా ఫలితాన్ని నమోదు చేసి, ఆయా వ్యవసాయ దారులకు భూమి పన్ను ఇంత, ఇంత శాతము అని నమోదు చేయడం. అయితే గ్రామ మునసబు పనులు కొంచెం తీవ్ర స్వభావానికి చెందేవి. గ్రామంలో కొట్లాటలు జరిగితే ఎవరి భాషను వారికి ఉపయోగించి తగినన్ని చీవాట్లు వేసి పోలీసుల వరకు వెళ్ళకుండా చూడడం. ఒకవేళ ఏదైనా తీవ్ర నేరం సంభవిస్తే దానిని పోలీసువారి దృష్టికి తేవడం. భూమి పన్ను ఎవరైనా ఎగవేసినా, చెల్లింపులలో జాప్యం చేసినా

కక్రపెత్తనంతో వాళ్ళను అదమాయించి ప్రభుత్వానికి చేరే సొమ్ము చేర్చడం. ఈ పనులలో చాలాభాగం కఠోరమైన భాషద్వారా నిర్వహించవలసి వస్తుంది. అందుచేత బ్రాహ్మణులను మునసబు పనికి నియమించుకునేవారు కాదు. ఆవిధంగా ఆ చిన్న మహావజ్ఝలను తొలి బ్రాహ్మణ గ్రామ మునసబుగా పేర్కొనవచ్చును.

రామాయణంలో పిడకలవేట అని భావించకపోతే ఈ గ్రామంలో ఒక పిట్టకథ ఇప్పటికీ చెప్పుకునేది ఉంది. ఒకానొక సారెపాక వారి కుటుంబం నుండి అమలాపురం ప్రాంతం వారు సంతానం లేక ఒక మగపిల్లాడిని దత్తత తీసుకున్నారు. ఈ పిల్లవాడి పేరు సోమయాజులు. బాల్యం గడిచి యవ్వనం వచ్చేలోపుగా సంపదలోని మంచి అనుభవాలతో బాటు చెడుప్రవృత్తులు కూడా పట్టుబడ్డాయి. ఇతనిని పెంపకం తీసుకున్న పెద్దమనిషి అక్కడి గ్రామంలో "వారి జుట్టు ముడి వీరికి పెట్టి, వీరి జుట్టు ముడి వారికి" పెట్టే స్వభావం కలిగి వారూ వీరూ కోర్టులకెక్కినప్పుడు అబద్ధపు సాక్ష్యాలు చెప్పించి, వాయిదాలు వేయించి తన మనుగడ సాగించేవాడు. సోమయాజులుకి ఈరకం జీవితంలోని తీపి బాగా వంటబట్టి, తండ్రి అనంతరం తాను కూడా ఆ వృత్తి కొనసాగించాడు. కాని, ఆ పెంపకపు తల్లితండ్రులు గతించాక "ఈ కోబ్రా" పని మానేసి ఈ ఊరినుండి పోతావా? లేక నిన్ను అంతమొందించ మంటావా?" అనే ధోరణికి అక్కడి ప్రజలు వచ్చారు. (కోబ్రా అనగా కోనసీమ బ్రాహ్మణుడు. COBRA అనగా విషసర్పము.) సోమయాజులు తప్పనిసరి అయి అక్కడి ఇంటిని, పొలాలను తక్కువ ధరకు విక్రయించుకొని మళ్ళీ ఇంగిలాపల్లి చేరాడు. దత్తత జీవితం చాలించుకొని సోమయాజులు తిరిగి ఇంగిలాపల్లికి వచ్చేకాలానికి అతని జనక కుటుంబం అందరూ గతించి తాను తెచ్చుకున్న డబ్బుతోపాటు ఇక్కడి పిత్రీయ గృహం, సేద్యభూమి అతని వశమయ్యాయి. ఆ ప్రకారం అతడు చేతిలో ధనబలం, తలలో దురాలోచనా బలం సమకూరి గ్రామంలో ఉన్న ప్రతీ ఇంట్లో ఏదో ఒక చిచ్చుపెట్టి తాను ఆనందించేవాడు. మనుషులు పోయినా వారు చేసిన సత్కార్యాలు, దుష్కార్యాలు తరువాతి తరాల వారికి గుర్తుండిపోతాయి. గురజాడ అప్పారావుగారు 'కన్యాశుల్కం' నాటకంలో "బ్రాహ్మణుల్లో ఉన్నంత మాలకూడు మరెక్కడా ఉండదు" అని రాయడానికి ఇలాంటి అగ్రహారపు బ్రాహ్మణులే కారణం అయి ఉండవచ్చునేమో!

★

# జిన్నాం

**ఈ అగ్రహారం** గజపతినగరం మండలంలో గజపతినగరానికి తూర్పుదిక్కున 8 కి.మీ.ల దూరంలో ఉన్నది. భైరిపురానికి వెళ్ళేదారిలో ఉన్నది. ఈ అగ్రహారంను విజయనగరం మహారాజులు శృంగారం వారికి ఇచ్చారు. రాజావారికి అమృతసమానమైన జొన్ను వండిపెట్టుట వలన జొన్నాం అనే పేరు మీద ఇచ్చారట. కాలక్రమేణా అది జిన్నాం అయింది. మొత్తం 1600 ఎకరాలు ఈ అగ్రహారం భూమి. ఒకప్పుడు ఇది 60 ఇళ్ళ అగ్రహారం. ఇప్పుడు 10 ఇళ్ళు ఉన్నవి. దుంబాడ శేషావతారం గారు వ్యాకరణ పండితుడు, వారబ్బాయి శ్రీరామాచారిగారు సంస్కృత పండితుడు. మందస మహారాజా వారి హైస్కూలులో పనిచేశాడు. దుంబాడ వెంకటాచారి గారు (విజయనగరం) మహారాజా కళాశాలలో లైబ్రేరియన్‌గా పనిచేశారు. వారి మనుమడు ఇక్కడ కోవెలలో అర్చకుడు. ఇక్కడి కోవెలను లోగిసకు చెందిన పప్పువారి అమ్మాయి కట్టించారు. వారినికి ఒకసారి భోగం పప్పువారి ఇంటికి వెళ్ళేది. ఇచ్చటి కోవెలలో దైవం శ్రీ రంగనాధస్వామి. పప్పువారి కుటుంబం దేవునికి మాన్యం కూడా ఇచ్చారు. ప్రస్తుతం పూజాపునస్కారాలు బాగా జరుగుతున్నవి. శృంగారం వెంకటాద్రిగారు పండితుడు. మహర్తి నారాయణగారు గ్రామ మునసబు. ఫణిహారం వెంకట నరసింహాచారిగారు రిటైర్డ్ స్టీల్‌ప్లాంట్ ఆఫీసర్. వారి అబ్బాయి, కోడలు సింగపూర్‌లో ఇంజినీర్లుగా ఉన్నారు. నర్సింహాచారిగారు ప్రస్తుతం జిన్నాం కోవెల కమిటీ ఛైర్మన్. శృంగారం తిరుమలాచారిగారు కోవెల కమిటీ మెంబరు. వారు రిటైర్డ్ టీచర్, వారి అబ్బాయి స్టీల్‌ప్లాంట్‌లో ఇంజినీర్. మిగతావారు రిటైర్డ్ టీచర్లు, మిగతా ఉద్యోగులు.

గ్రామం చిన్నదే అయినా ఇక్కడి నుండి ఎందరో పండితులు, అధికారులు, ప్రయోజకులు వెలికి రావడం బ్రాహ్మణ అగ్రహారాలలో ఉన్న ప్రత్యేకతగా చెప్పుకుంటారు.

★

# కలువరాయి

**సుమారు** మూడు శతాబ్దాల నాడు కురుపాం మహారాజావారు మహీధర రుక్మేశ్వర శాస్త్రిగారి పూర్వులకు కవిత్వ పాండిత్య ప్రతిభలకు గుర్తింపుగా ఈ అగ్రహారాన్ని ఇచ్చారు. అనంతరం బొబ్బిలి సంస్థానం వారు ఈ అగ్రహారపు భూములన్నీ తమ జమీందారీకి చెందినవి అని వాటిని అగ్రహారంగా పేర్కొని బ్రాహ్మణులకు ధారాదత్తం చేసే అధికారం కురుపాం వారికి లేదని కోర్టుకెక్కి పరాజయం పొందారు. ఈ గ్రామం అలనాటి శ్రీకాకుళం జిల్లాలోని బొబ్బిలి తాలుకాలోనిది. ప్రస్తుతం విజయనగరం జిల్లా బలిజిపేట మండలంలో చేరి ఉన్నది. బొబ్బిలి బలిజిపేట రోడ్డులో పదకొండవ కిలోమీటరు వద్ద రోడ్డును ఆనుకొని ఈ గ్రామం ఉన్నది.

ఒకనాడు ఈ అగ్రహారంలో 60 వరకు బ్రాహ్మణ గృహాలు ఉండేవి. కాని ప్రస్తుతం నాలుగు కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. ఈ అగ్రహారం ప్రధానంగా వేద సంప్రదాయ విద్యల నిలయంగా ప్రసిద్ధి చెందింది. 19వ శతాబ్దం పూర్వభాగంలో ఇక్కడి సంస్కృత పండితులు ఉత్తర భారతదేశం వెళ్ళి తమ సంస్కృత పాండిత్య ప్రకర్షను చాటి చెప్పుకున్నారని తెలుస్తున్నది.

'కలువరాయి' అనే పేరు ప్రస్తుత కాలంలోని జనానికి అదేదో రాయిలాగా వినిపించవచ్చు. కాని ఇక్కడ ఒక మహా అద్భుత పండితుడు, గ్రంథకర్త, దైవసమానుడు అయిన కావ్యకంఠ గణపతి శాస్త్రిగారు జన్మించారని చెప్పగానే 'ఓహో' అని అబ్బుర పడగలవారు కూడా ఉన్నారు.

కావ్యకంఠ గణపతిశాస్త్రిగారిని గురించి చెప్పుకోకపోతే 'కలువరాయి' అగ్రహారాన్ని గురించేకాక, ఏ ఇతర పాండిత్య ప్రధాన అగ్రహారాన్ని గురించి కూడా చెప్పినట్టు అవదు. "కావ్యకంఠ గణపతి", "ముని", "నాయన" ఇవన్నీ అయ్యల సోమయాజుల నరసింహశాస్త్రిగారికి (భార్య నరసమ్మగారి ద్వారా) 1878 నవంబరు 17న జన్మించిన సూర్యగణపతి శాస్త్రిగారి నామాంతరాలే. వీటిని తన బిరుదులుగా ఆయన ఎన్నడూ పరిగణించుకోలేదు. 10 ఏళ్ళ వయసు రాకముందే మూడు కావ్యాలను రచించారు. "కాశీ", "నవద్వీపం" వంటి పండిత స్థానాలలో ఉత్తరాది సంస్కృత విద్వాంసుల ప్రశంసలు పొందారు. మద్రాసులో నారాయణ సుదర్శనుడనే పండితుని

ఓడించి, ఆరు నిముషాలలో 25 శ్లోకాలు చెప్పారు. రమణమహర్షికి ఆ పేరు పెట్టినది వీరే. రమణ మహర్షి ఈయనను "నాయనా" అని పిలిచారు. "నాయన" అంటే తండ్రి అని అర్థం. ఆమరణాంతం శాస్త్ర వేద చర్చలలోనూ, సంబంధిత రచనలలోనూ గడిపిన గణపతి శాస్త్రిగారు 1936 జులై 25న పరమపదించారు.

'కలువరాయి' అగ్రహారంలో జన్మించి ప్రసిద్ధులైన వారిలో వేదుల శ్రీరామ శాస్త్రిగారు (తర్కం), జగన్నాథ శాస్త్రిగారు (వేదం) పేరొందిన వారు. ప్రస్తుతం కలువరాయి అగ్రహారంలో గణపతి మునివారి సంప్రదాయాల్ని స్ఫురణకు తెచ్చే ఆశ్రమాన్ని అయ్యల సోమయాజుల శివరామ శర్మగారు అభివృద్ధి చేస్తున్నారు.

అయ్యల సోమయాజుల గణపతి శాస్త్రిగారి తమ్ముడు శివరామ శాస్త్రిగారి కుమారుడు నరసింహశర్మ. విజయనగరం మహారాజా వారి ఉన్నత పాఠశాలలో తెలుగు, సంస్కృతం చెప్పిన ప్రసిద్ధ అధ్యాపకుడు. పాలకవర్గం వారు విద్యార్థులకు పాఠ్యాంశాలుగా నిర్ణయించే పంచతంత్రం, నీతిచంద్రిక, కాళిదాసు, భారవి, భవభూతి ఏదైనా సరే అచ్చు పుస్తకం చూడనక్కరలేకుండా పాఠం చెప్పగలిగేవారు.

★

# కిండాం

**ఈ అగ్రహారం** విజయనగరం జిల్లా బొండపల్లి మండలంలో విశాఖపట్నం నుండి రాయపూర్ వెళ్ళే 43 నెం. హైవే పై బొండపల్లికి దక్షిణదిశగా 5 కి.మీ.ల దూరంలో ఉన్నది.

ఈ అగ్రహారాన్ని విజయనగరం మహారాజులు రాజవైద్యులైన ముద్దువారి పూర్వీకులకు బహూకరించారు. మొత్తం 1400 ఎకరాల పల్లం మరియు మెట్టభూమి. ఈ అగ్రహారంలో ముద్దువారి కుటుంబంగాక పంతులవారు, ఆకొండివారు, భైరవభట్ల వారు, వజ్ఝులవారు ఉండేవారు. ఒకనాడు ఇరవై ఇళ్ళు; నేడు రెండు కుటుంబాలు మాత్రమే! స్వర్గీయ ఘంటసాల వెంకటేశ్వరరావుగారు విజయనగరంలో చదివే రోజుల్లో ముద్దు పాపారావుగారితో పరిచయం ఏర్పడి తరచుగా వస్తుండేవారు. పాపారావుగారు ఘంటసాల వారికి ఆర్థిక సహాయం చేస్తుండేవారు. పాపారావుగారు తరువాత గుణుపూర్ సంగీత కళాశాలలో బోధకునిగా ఉండేవారు. పాపారావుగారు మరణించిన తరువాత ఘంటసాలగారు వారి కుటుంబానికి, అతని ముగ్గురు అక్కచెల్లెళ్ళకు కూడా విరివిగా ఆర్థిక సహాయం చేసేరు. పాపారావు గారి కుమారుడైన నరసింగరావుని మద్రాసు నగరానికి తీసుకు వెళ్ళిపోయారు. ఈ అగ్రహారంలోనే పుట్టిన మరొక విశిష్ట వ్యక్తి ముద్దు వెంకట నారాయణరావుగారు. వీరు విజయనగరం మహారాజా కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత విశాఖపట్నంలో లెక్చరర్‌గా పనిచేసి ఐ.పి.ఎస్. అయ్యారు. ఈయన ఆంధ్రప్రదేశ్ హోం కార్యదర్శిగా పనిచేసి, తరువాత పోలీసు డైరెక్టర్ జనరల్‌గా కూడా పనిచేశారు. విజయనగరంలో వారితో చదివిన ముద్దు శ్రీరామమూర్తి ఈ అగ్రహారంలోనే ఉన్నారు.

★



ఎం.వి. నారాయణరావుగారి ఇల్లు

## కుసుమూరు

**ఈ అగ్రహారం** (ఒకనాటి బొబ్బిలి తాలూకాలోనిది; ప్రస్తుతం) తెర్లాం మండలంలో ఉంది. 17వ శతాబ్దం చివరిలో జయపురం సంస్థానాధీశులు మంగిపూడి సూర్యవజ్ఝులు, పేరావజ్ఝులు అనే ఇరువురు వెలనాటి వైదిక బ్రాహ్మణులకు వారి వేద పారంగత్వాన్ని మెచ్చి బహూకరించారు. సుమారు ఆరువందల ఎకరాల భూమిలో మెరక ఎక్కువ. వేగవతి నదికి దక్షిణంగానూ; నందబలగ అగ్రహారానికి తూర్పుగాను ఉంది. ఈ భూమి క్రమంగా మంగిపూడి వారి కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు కూడా పంపకం జరిగింది. కేవలం వేద పండితులైన ఆనాటి బ్రాహ్మణులకు వ్యవసాయం చేసే నైపుణ్యం లేక, సాగుకి రైతుల్ని పెట్టుకొని పంటలో సగం రైతులకిచ్చి, సగం తాము తీసుకునే వారు.

వేగవతి నదికి ఉత్తరంగా ఉన్న కొన్ని గ్రామాలు, దక్షిణంగా ఉన్నవి కొన్ని కలిపి 'నందాపురం పట్టి' అనే పేర వ్యవహరించేవారు.

మంగిపూడి వారి కుటుంబాలలో కొందరు ఆంగ్ల విద్యాపారంగతులై పట్టణాలకు వలస పోయారు. వారిలో బుచ్చిశాస్త్రి అనే ఆయన విజయనగరం సంస్థానంలో రెవెన్యూ ఇనస్పెక్టరుగా పనిచేసి ప్రజాభిమానం చూరగొన్న అధికారిగా పేరు పొందాడు. క్రమంగా ఈ అగ్రహారంలో పిల్లల సంబంధాలు కారణంగానూ, ఆర్థిక వ్యవహారాల కారణంగానూ పెండ్యాలవారు, పుల్లెలవారు, గొల్లపూడివారు, ప్రాతవారు, గన్నవరపు వారు స్థావరాలు సంపాదించుకున్నారు. వీరిలో పెండ్యాల వెంకటరావుగారు, పుల్లెల సీతారామయ్యగారు, గొల్లపూడి రామమూర్తి గారు, బొబ్బిలి పార్వతీపురం కోర్టులలో తమ వాదనలు కొనసాగించిన న్యాయవాదులు. వీరందరు వెలనాటి వైదిక బ్రాహ్మణులు.

గన్నవరపు రామమూర్తిగారు ఉపాధ్యాయ వృత్తిలో పేరు గాంచారు. వీరు భూములు సంపాదించుకొని ఉన్నారు గాని, సేద్యం కోసం రైతుల మీద ఆధారపడక స్వయంగా కాడిపట్టిన వారు. తమ భూమిలో కొంత మెరకను వర్షాధారపు పల్లంగా తీర్చిదిద్దుకొని మెరకలో పడిన వర్షాన్ని పల్లంలోకి కాలువలు తీసి వరి మొదలైన పంటలు తీశారు. ఇది అప్పట్లో చాలా ఆశ్చర్యకరమైన సంగతి. వీరి సోదరుడు కేశవరాముడు వేద పండితుడు. రామమూర్తిగారు బహు కుటుంబీకుడు. ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. కుమారులందరికీ ఇంగ్లీషు చదువులు చెప్పించి

ఉద్యోగాలకు పంపాడు. కాని కుమార్తెలను మాత్రం అగ్రహార బ్రాహ్మణులకు, పురోహితులకు ఇచ్చి వివాహం చేశారు. రామమూర్తిగారి కుమారులలో రామచంద్రయ్య అనే ఆయన ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖలో ఉన్నతాధికారిగా రిటైర్ అయి ప్రస్తుతం విశాఖపట్నంలో ఉన్నారు.

కుసుమూరు అనగా కుసుమ + ఊరు. అనగా పువ్వు వంటి స్థలము అని అర్థం. మొదట్లో ఇక్కడి బ్రాహ్మణులు వేదాలు చదివి పదిమంది మధ్య సున్నితంగా మాట్లాడి ఇతర కులాల వారికి మంచి చెప్పి మేలు చేసి ప్రఖ్యాతి చెందినవారు. అందుచేతనే ఆ మృదుత్వం కారణంగా ఈ అగ్రహారానికి కుసుమూరు అనే పేరు అమరిందని చెప్పుకుంటారు.

ఈ అగ్రహారంలో గన్నవరపు రామచంద్రయ్యగారి నాలుగవ కోడలైన పార్వతి మహాభక్తురాలు. పార్వతీ పరమేశ్వరుల తోడిదే లోకంగా భావించి కాశీ వెళ్ళి స్థిరపడాలని నిర్ణయించుకుంది. కాశీ వెళ్ళుటకు సరిపడ డబ్బులు లేకపోవుట వలన శ్రీకాకుళం రోడ్ స్టేషన్‌మాస్టార్ ద్వారా ఉచిత పాస్ రాయించుకొని కాశీ చేరుకుంధి. ఆ విషయం పార్వతి బంధువులకు తెలిసి ఆమెను కాశీ నుండి స్వగ్రామం చేర్చారు. అయినప్పటికీ ఇహలోక సంబంధాలపై విరక్తిని పెంచుకున్న పార్వతి మళ్ళీ కాశీ ప్రయాణం చేసి అక్కడే స్థిరపడింది.

పార్వతి తాతగారైన గన్నవరపు విశ్వావధానులు గాయత్రి ఉపాసకులుగా కడు ఖ్యాతిగడించారు.

★



కుసుమూరులో ఒక వీధి

# కృష్ణరాయపురం

**ఈ అగ్రహారం** విజయనగరం జిల్లా సీతానగరం మండలంలో ఉన్నది. మండల కేంద్రమైన సీతానగరం నుండి తూర్పుదిశలో 5 కి.మీ. దూరం.

ఈ అగ్రహారాన్ని జయపురం సంస్థానాధీశులు కొందరు ద్రావిడ బ్రాహ్మణ కుటుంబాల వారికి వేద విజ్ఞాన ప్రతిభకు మెప్పుగా నాలుగు శతబ్దాల నాడు ఇచ్చారు. ఇది ఒకప్పుడు 60 ఇళ్ళ అగ్రహారం. 'నందాపురం పట్టీ'గా పిలవబడేది. ఆదిభట్ల అప్పన్న శాస్త్రిగారు ఈ ప్రాంతానికి చెందిన పండితుడే. అప్పట్లో ఇక్కడ ఆర్య సోమయాజుల, అయ్యల సోమయాజుల, గంటి, వేదుల, వడ్లమాని, తాతా, ఆదిభట్ల వాళ్లు ఉండేవారు.

ఈ అగ్రహారం నుండి పేరుగాంచిన విద్యావేత్తలు వచ్చారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేసిన గంటి జోగి సోమయాజులు, తెలుగు పండితులు ఉభయ భాషాప్రవీణులు ఆదిభట్ల గౌరీ శంకర శాస్త్రిగారు, సెంట్రల్ యూనివర్శిటీలో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేసి, రిటైర్ అయిన అయ్యల సోమయాజుల రామమూర్తిగారు.

అయ్యల సోమయాజుల శ్రీకాంత్‌గారు అమెరికాలో విప్రో కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఈ గ్రామంలో 'వెంకట సాగరం' అనే 150 ఎకరాల చెరువును కొమ్మినేని గురవన్న చౌదరిగారు త్రవ్వించారు. ఈ చెరువు వలన 600 ఎకరాల భూమికి సాగునీరు అందుతుందని.

గురజాడ అప్పారావుగారి 'కన్యాశుల్కం' నాటకంలో ఈ అగ్రహారం గురించిన ప్రసక్తి ఉంది. నాటక కథాక్రమంలో ఈ గ్రామానికి చెందినవిగా కొన్ని పాత్రలను సృష్టించారు. వీటిలో అగ్నిహోత్రావధానులు, వెంకటేశం మరియు బుచ్చమ్మ మొదలగు పాత్రలు పేరుగాంచినవి.

★

# లింగాలవలస

**గజపతినగరం** మండల కేంద్రం నుండి 4 కి.మీ.ల దూరంలో తూర్పుదిశన ఉన్న లింగాలవలస గ్రామాన్ని విజయనగరం మహారాజా వారు 16వ శతాబ్దంలో ఉపాధ్యాయుల వారికి వారి పండిత ప్రజ్ఞకు మెచ్చి ఇచ్చారు. ఈ అగ్రహారం భూమి మెరకా, పల్లం కలిపి సుమారు 600 ఎకరాలు.

ఉపాధ్యాయుల వారు అసలు తూర్పుగోదావరి జిల్లా పేరూరుకు చెందినవారు. వారిలో ఒక జట్టు కొట్టాం, కలువరాయి గ్రామాలకు, మరొకటి లింగాలవలసకు చేరాయి. ఉపాధ్యాయుల సోమేశంగారు, వారబ్బాయి అప్పల నరసింహంగారు; ఈఇద్దరూ విజయనగరం పుచ్చల వీధిలో పేరొందిన అడ్వకేట్లు. ఉపాధ్యాయుల సత్యనారాయణ గారు 20వ శతాబ్దం తొలి వత్సరాల్లో విశాఖపట్నం జిల్లా డి.ఇ.ఓ.గా పనిచేశారు. వాళ్ళబ్బాయిలు యు.ఎస్.ఎ.లో ఉన్నారు. ఉపాధ్యాయుల అప్పయ్యశాస్త్రి గారు భిలాయి స్టీల్‌ప్లాంట్‌లో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. 2004లో ఉపాధ్యాయుల గోపాలకృష్ణగారు భువనేశ్వర్‌లో ఇంటలిజెన్స్ డి.ఐ.జి.గా పనిచేసి రిటైర్ అయ్యారు. ప్రస్తుతం అడ్వకేట్‌గా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయుల సోమేశంగారు వారి తమ్ముడు వెంకటరావుగారు ఉపాధ్యాయులుగా పనిచేసి రిటైర్ అయ్యారు. సోమేశంగారు పరమ పదించారు గాని వెంకటరావుగారు జీవించి ఉన్నారు. వీరిద్దరి పిల్లలు మంచి ఉద్యోగాలలో ఉన్నారు. ఉపాధ్యాయుల నారాయణమూర్తిగారు జైపూర్‌లో అడ్వకేట్‌గా పనిచేసి పరమ పదించారు. ఉపాధ్యాయుల శివరామ్‌గారు ఎం.డి., కార్డియాలజిస్ట్. ప్రస్తుతం ఢిల్లీలో పనిచేస్తున్నారు. వాళ్ళబ్బాయిలు, అమ్మాయిలు అమెరికాలో ఉన్నారు. ఉపాధ్యాయుల దుర్గాప్రసాద్ సెంట్రల్ ఎక్సైజ్‌లో సూపరింటెండెంట్‌గా భిలాయిలో పనిచేస్తున్నారు. ఉపాధ్యాయుల సుదర్శనమ్ గారు రాష్ట్రీయ ఫెర్టిలైజర్స్‌లో అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్‌గా ప్రస్తుతం గుంటూరులో పనిచేస్తున్నారు.

★

# లోగీశ

**ఈ అగ్రహారం** విజయనగరం జిల్లాలో దత్తిరాజేరు మండలంలో ఉన్నది. గజపతినగరం టౌనుకి తూర్పుగా లింగాలవలస వరకు వెళ్ళి అక్కడ రోడ్డు చీలిన వద్ద దక్షిణానికి మళ్ళి చంపావతి నది దాటి మూడు కిలోమీటర్లు వెళ్ళాలి. విజయనగరం రాజులు షికార్‌గంజ్ అడవులకు వేటకు వెళ్తూ ఇక్కడ విడిది చేశారట. ఇక్కడ బ్రాహ్మణులు ఉండుట వలన నాలుగు వేదాలు చదివి, వేదాలను, హిందూ ధర్మాన్ని ఉద్ధరించాలని ఈ అగ్రహారాన్ని ఇచ్చారు.

లోగీశ అసలు పేరు చంద్రనగరం. రాజావారు లోకేశ్వరుడైన సర్వేశ్వరుని పేరు 'లోకేశ' అని మార్చి ఈ అగ్రహారాన్ని ఇచ్చారు. అయితే బ్రాహ్మణులకు వ్యవసాయంలో సహకారం అందించే రైతులైన లోగీశ ఇంటి పేరు గలవారు ఎక్కువగా ఉండుటచే లోగీశ అనే పేరు రాగిరేకుపై రాసి ఇచ్చారట. 17వ శతాబ్దంలో అద్వైత మతోద్ధారణ కోసం లోగీశ, ద్వైత మతోద్ధారణ కోసం జిన్నాం, విశిష్టాద్వైత మతోద్ధారణ కోసం సీతారాంపురం ఇచ్చారట. జిన్నాం, సీతారాంపురం, లోగీశకు దగ్గరగా ఉన్నవి. దానం ఇచ్చిన భూములలో 700 ఎకరాలు పల్లం, 170 ఎకరాలు మెట్టు.

నాడు బ్రాహ్మణుల ఇళ్ళు 60. అధిక సంఖ్యాకులు వలస వెళ్ళినందున ఆరు ఇళ్ళు మాత్రమే ఇప్పుడు ఉన్నాయి. అందరూ వలస వెళ్ళి బాగుపడినవారే. పుట్టుగ్రుడ్డి, 1900 నాటి అయ్యవారి రామమూర్తి అవధానుల వారికి 82 పన్నాల వేదం వచ్చునట. అతని ఆరుగురు కొడుకులు ఖ్యాతి చెందినవారే.

పప్పు రామజోగి శాస్త్రిగారు ఒరిస్సాలోని ఒక ద్వీపంలో వేదపఠనానికి వెళ్ళారు. పప్పు అన్నయ్య అవధానులు 18-19 శతాబ్దాల మధ్య వేదార్థాలను చెప్పిన మహా పండితుడు. పప్పు సత్యనారాయణ శాస్త్రిగారు ఉర్లాం సత్రంలో గురుకులాభ్యాసం చేశారు. కరణంగా కూడా పనిచేసి 1970లో పరమపదించారు. ఆయన తమ్ముడు పేరయ్య శాస్త్రిగారు విజయనగరం మహారాజా కళాశాలలో తెలుగు పండితులుగా పనిచేశారు. 'ఆరాధన' పత్రికకు మొదటి ఎడిటర్. ఆయన జీవించినంత కాలం విజయవాడ కనకదుర్గ ఆలయంలో ప్రభుత్వం ఆశ్రయమిచ్చింది. ఆయన చనిపోయినప్పుడు ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించింది. పప్పు నానప్పగారు విజయనగరం మహారాజా పి.వి.జె. రాజుగారికి తెలుగుభాష

నేర్పారట. రాజా వారు గురుదక్షిణ కోరుకోమనగా నానప్పగారు 'మీ అభిమానం చాలు' అని అన్నారట. కలెక్టర్ ఎ.కె. గిల్‌గారికి కూడా నానప్పగారే తెలుగు నేర్పించారట. తరువాతి కాలంలో ఆయన సర్వేపల్లి రాధాకృష్ణన్ గారికి పి.ఏ.గా ఉండి అమెరికా వెళ్ళారట. ప్రజాస్వామ్యం వచ్చి అగ్రహారాలు పోయినా మొదటి సర్పంచ్‌లు బ్రాహ్మణులే. అడ్డుగూడూరు సూర్యనారాయణగారు మొదటి సర్పంచ్. పప్పువారి అబ్బాయి పప్పు వెంకటరత్నం గారు కలెక్టర్‌గిరీ చేసి రిటైరయ్యారట. ఇంకొక అబ్బాయి వాణిజ్య పన్నుల అధికారిగా పనిచేసి రిటైరయ్యారు. 19వ శతాబ్దంలో పాత సాంకేతిక పరిజ్ఞానంతో అయ్యగారి కన్నయ్యగారు సున్నంతో ఏటికి చప్టా కట్టించారట. దానిపై ఆయన పేరు కూడా చెక్కి ఉంది. ఆ చప్టా 1932 వరకు ఉండేదట. పప్పు సుబ్బయ్య శాస్త్రిగారు సాలూరు వేద సమాజానికి ప్రధానోపాధ్యాయులు. ఈ రోజు నిష్ణాతులైన తెలుగు పండితులు చాలామంది వీరి శిష్యులే. ఈ రోజులలో కూడా అడ్డుగూడూరు సూర్యనారాయణగారి తర్వాత మక్కువ సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికై ఆయన ఇంటిపేరు గలవారే 1964 వరకు పనిచేశారు.

ఇక్కడకు ఏటేటా మే నెలలో ఆస్ట్రేలియా నుండి కొంగలు వచ్చి నవంబరు వరకు ఉంటాయి. గ్రామస్తులు ఆ కొంగలకు పూర్తి రక్షణ కలుగజేస్తారు. అయ్యగారి కామేశ్వరరావు గారు సంగీత విద్వాంసుడు. 40 ఏళ్ళ క్రితం బాపట్ల వెళ్ళిపోయారు. వారి పిల్లలు సంగీత కచేరీలు చేస్తున్నారు. పప్పు మృత్యుంజయరావుగారు డిప్యూటీ డి.ఇ.ఓ.గా పదవీ విరమణ చేశారు. వారి పిల్లలు అమెరికాలో ఇంజినీర్లుగా స్థిరపడ్డారు. అడ్డుగూడూరి శ్రీరామమూర్తి (అజ్జాడ, టీచర్) గారి పిల్లలలో ఒకరు హైదరాబాద్‌లో కెమిస్ట్‌గా, ఇంకొకరు బెంగుళూర్‌లో ఇంజినీర్‌గా, మరొకరు బహ్రెయిన్‌లో ఇంజినీర్‌గా ఉన్నారు. అయ్యగారి కామేశ్వరరావు గారు గజపతినగరం హైస్కూల్‌లో టీచర్‌గా పనిచేశారు. వారి పిల్లలు విజయనగరం ఎం.ఆర్. కళాశాలలో కెమిస్ట్రీలో హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్‌గాను, మరొక అబ్బాయి విప్రో గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌లో వైస్ ప్రెసిడెంట్‌గాను పనిచేస్తున్నారు. మరొక అబ్బాయి మార్తాండ్ జూనియర్ కాలేజీలో పనిచేసి, విదేశాలు కూడా దర్శించారు. ఇచ్చట పనిచేసిన వారంతా ఉపాధ్యాయులుగానే ఉండేవారు.

★

## మధుపాడ

**ఈ గ్రామానికి** సుమారు మూడువందల యేండ్ల చరిత్ర ఉంది. అవిభక్త విశాఖపట్నం జిల్లాలోని విజయనగరం తాలూకాకు సబ్ తాలూకాగా గజపతినగరం స్థావరమై ఉండేది. 1978లో విజయనగరం జిల్లా ఏర్పడ్డాక గజపతినగరం తాలూకా కేంద్రమైంది. 1986లో మండలాలు ఏర్పడ్డాక గజపతినగరానికి ఉత్తరంగా ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో 45వ "రాష్ట్ర హైవే"కి 300 మీటర్లు తూర్పుగా ఉన్న ఈ అగ్రహారం గజపతినగరం మండలంలోకే చేరింది. విశేషమేమిటంటే గజపతినగరం పేరిట ఉన్న రైల్వేస్టేషన్ గజపతి నగరానికంటే మధుపాడ అగ్రహారానికే దగ్గరగా ఉంది.

బ్రిటీష్ వారు ఈ ప్రాంతంలో రైలు మార్గాలు ఏర్పరచినప్పుడు కొన్ని రైల్వే స్టేషన్లను ఆ పేర్లు గల గ్రామాలకు కొద్దిపాటి దూరంలో కూడా కట్టించడానికి కారణం ఉత్తరోత్తరా ఆ స్టేషను భవనాలకు భద్రత ఉండాలనే. గజపతినగరం గ్రామానికి పడమటి వైపున ఉన్న రైలుమార్గంలో సరిగ్గా ఊరికి ఎదురుగా రైల్వే స్టేషను నిర్మించి ఉన్నట్లయితే ఆ భవనానికి చంపావతి నది వలన ప్రమాదం అని అప్పటివారు భావించారు.

'మధుపాడ' అగ్రహారం ప్రధానంగా పురోహితులకు, వంటల వారికి స్థావరం. అయినా సరే అక్కడ వేదపండితులు, జ్యోతిష పండితులు కూడా ఎప్పటికప్పుడు తగినంత మంది ఉంటూ బ్రాహ్మణ సంప్రదాయాన్ని పరిరక్షించుకుంటున్నారు. తెన్నేటి వారు, దువ్వూరి వారు, నేరెళ్ళవారు, గన్నవరపు వారు, తనికెళ్ళ వారు, జయంతి వారు, అందరూ వెలనాటి వైదిక బ్రాహ్మణులు. విజయనగరం పట్టణానికి ఉత్తరం వైపుగా ఉన్న గ్రామాలలో నెల్లివాడ నుండి నెల్లిమర్ల దక్షిణపు సరిహద్దు అనుకుంటే అటు కెళ్ళ, గుజ్జంగివలస, ఇటు బొండపల్లి, బుడతనపల్లి, దత్తి, గంట్యాడ, కొండ తామరాపల్లి వరకు; మెంటాడ, ఆంద్ర, మానాపురం, బాడంగి వరకు; ఇలా సుమారు 80 చదరపు మైళ్ళ విస్తీర్ణంలో ఉన్న అన్ని గ్రామాలకు మధుపాడ గ్రామ బ్రాహ్మణులే పురోహితులు. వీరిలో దువ్వూరివారు, తెన్నేటివారు ప్రముఖులు. తెన్నేటివారు కేవలం అనుష్ఠానమే కాక శాస్త్రం కూడా తెలిసినవారు. సుబ్బారావు సిద్ధాంతిగారు జ్యోతిష శాస్త్రంలో సంపాదించుకున్న ప్రతిభను ఆయన కుమారుడు చిన్న సిద్ధాంతి

సూర్యనారాయణ గారు కాపాడుకుంటూ వస్తున్నారు. ఈయన రామాయణాన్ని వచన రూపంలో రచించారు.

దువ్వూరి నారాయణగారు ఈ ఊరినుండి బయలు వెడలిన ఒకానొక ఉన్నతాధికారి. గజపతినగరంలో అప్పటికి ఉన్న చదువు (8వ తరగతి) మాత్రమే పూర్తిచేసి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో సర్వే డిపార్టుమెంటులో అతి చిన్న ఉద్యోగంలో చేరి తన దస్తూరీతో అంకెల సౌందర్యంతో విధి నిర్వహణలో నిజాయితీ, పట్టుదలతో అప్పటి బ్రిటీష్ అధికారులను మెప్పించి పేరు పొందాడు. ఆ దొరలు అతడు బాగా రాణించగలడని తలపోసి అతనికి జీతం నష్టం లేకుండా సెలవు మంజూరు చేసి బెనారస్ మెట్రిక్ పరీక్షకి కూర్చోబెట్టారు. ఆ అర్హతతో అతనిని అసిస్టెంట్ డైరెక్టర్ వరకు ప్రమోషన్‌లు ఇచ్చి ఆదరించారు. వీరి పెద్ద కుమారుడు రామకృష్ణ టెలిఫోన్స్ డిపార్టుమెంట్‌లో ఉన్నతాధికారిగా పనిచేసి, రిటైరై విశాఖపట్నంలో ఉన్నారు. మిగిలిన ఇద్దరు బ్యాంక్ ఆఫ్ ఇండియా సంస్థలో ఉన్నతాధికారులుగా గుజరాత్‌లోను, ముంబైలోను ఉన్నారు.

మధుపాడ గ్రామ పురోహితులలో 20వ శతాబ్దపు ప్రారంభంలో జన్మించి బాల పురోహితుడిగా ప్రఖ్యాతి చెందిన దువ్వూరి జోగన్నగారు సుమారు 60 ఏళ్ళు ఆ వృత్తిలో ఉన్నారు. ఆయన కుమారుడు సుబ్బారావు కూడా బాల్యం నుండి పురోహిత వృత్తి చేస్తూ 80 వయసు వరకు కొనసాగించారు. వారి కుమారులు లింగమూర్తి, జోగన్న గార్లు కూడా ఇదే వృత్తిలో ఉన్నారు. తెన్నేటి కూర్మయ్య గారు నిష్ఠగా పురోహిత వృత్తి చేసేవారు. మిగిలిన వెలనాటి వైదిక కుటుంబాల వారు వంటల నిపుణులుగా ప్రసిద్ధికెక్కి ఈ పురోహితుల జాడలతో కొనసాగుతున్నారు.

ఇలాంటి అనూచాన వృత్తులలో నమ్మకం లేనివారు ఇంగ్లీషు చదువులు చదివి వేరే చోట్ల స్థిరపడ్డారు. వారిలో దువ్వూరి వెంకటరావుగారు బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్యను స్థాపించారు. రాంచీలో చిరకాలం పనిచేసి ప్రస్తుతం విజయనగరంలో స్థిరపడ్డారు. తెన్నేటి విశ్వనాథ శాస్త్రి అనే ఒక ప్రతిభావంతుడైన భూమి సర్వేయరు ఇక్కడ జన్మించిన వారే.

★

## నందబలగ

**విశాఖపట్నం** జిల్లాను 1951లో శ్రీకాకుళం - విశాఖపట్నం అనే రెండు జిల్లాలుగా విడగొట్టారు. అప్పటి శ్రీకాకుళం జిల్లాలో బొబ్బిలి తాలూకాలో చేరిన అగ్రహారాలలో నందబలగ ఒకటి. విజయనగరం-రాయపూర్ రోడ్డులో రామభద్రపురం నుండి ఈ గ్రామానికి సుమారు 25 కి.మీ.ల దూరం. అయితే దగ్గిర దారి మాత్రం బొబ్బిలి నుండి సుమారు 13 కి.మీ.లు. అయినా సరే, ఈ ఊరికి ఉత్తరంగా ఉన్న వేగవతి నది ఎప్పుడూ తొడలోతు మించి ప్రవహిస్తూ ఉండడం వలన గొల్లపల్లి, కారాడ గ్రామాల ద్వారా ప్రయాణం చేయడానికి వెనుకాడేవారు. ఇది ఒక పరిస్థితి కాగా, కారాడ గ్రామపరిధిలో ఉన్న 'తుమ్మ' చెట్లమాటున దొంగలు కాపు వేసి ప్రయాణికులను దోచుకుంటూ ఉండే (పరి)స్థితి ఇంచుమించు 1960 దశకం వరకు ఉండేది. ప్రస్తుతం ఈ గ్రామం విజయనగరం జిల్లాలో తెర్లాం మండలంలో చేరియుంది.

ఈ అగ్రహారాన్ని 17వ శతాబ్దం చివరిలో విజయనగరం మహారాజా వారు గొల్లపూడి ఆర్యభట్టు అనే ప్రముఖ కవి పేర ఇచ్చారు. మెట్టు, పల్లం కలిపి సుమారు 600 ఎకరాల భూమి. సాగు, దిగుబడి, పంపకం మొదలైన పనులలో సాధ్యాసాధ్యాల వలన గొల్లపూడి వారు ఈ గ్రామభూమిలో ఎక్కువెక్కువ భాగాలను తెన్నేటివారికి, బులుసువారికి, 'ప్రాతవారికి' ఇచ్చేశారు. క్రమంగా పెత్తనం తెన్నేటి వారి చేతులలోకి వెళ్ళిపోయింది. వారిలో శ్రీరాములు గారు మిగిలిన వారికంటే ఎక్కువ భాగాన్ని స్వాధీనం చేసుకున్నారు. 1920 ప్రాంతాల నాటికే ఆయన 300 ఎకరాల భూస్వామిగా ఉండేవారు. తెన్నేటి సీతయ్యగారు రెండవ వరుసలోని వారు.


తెన్నేటి శ్రీరాములు గారి సంతతి, పౌత్రులు ఆ ఆస్తిని కాపాడుకుంటూనే వచ్చారు. పాపయభుక్తగారి హయాంలో మేడ, చావడి, వెనుకవైపు డాబా వంటి సౌకర్యాలు వచ్చాయి. పాపయ్య భుక్తగారి జ్ఞాతులుగా ఉండిన సీతయ్యగారి కుటుంబం వితరణాపరులుగా ఖ్యాతి చెందారు. ముఖ్యంగా సీతయ్యగారి కోడలు అన్నపూర్ణమ్మ గారు గోదావరి జిల్లాకు చెందిన డొక్కా సీతమ్మగారంతటి నిత్య అన్నదాత్రి. ఆ కుటుంబానికే చెందిన శ్రీరాములుగారు వైద్యవృత్తి సంప్రదాయాన్ని నెలకొల్పగా, పాపయ్య భుక్తగారు స్వయంగా "మహాలక్ష్మీ విలాసరసము", "మహా అరుణార్కము" వంటి పేర్లు గల సర్వరోగ నివారిణి ఔషధాలు తయారు చేసేవారు. వారి పుత్ర పౌత్ర


గణం మాత్రం ఈ సంప్రదాయాన్ని కొనసాగించలేదు.

పాపయ్య భుక్తగారి జ్ఞాతి వర్గంలో మరొక శ్రీరాములుగారి సంతతిలో పెద్ద సన్యాసయ్యగారు, చిన సన్యాసయ్యగారు ఉండిరి. వీరిలో పెద్ద సన్యాసయ్యగారు ఈ గ్రామ కరణంగా ప్రసిద్ధి కెక్కారు. అంతకుముందు తెన్నేటివారిలో ప్రముఖంగా లేని కావ్యపఠనం, పద్యరచన వీరితో ప్రారంభమైంది. కాలక్రమాన ఈయన కంటిచూపు పోయింది. ఏకైక కుమారుడైన సన్నిబాబుగారికి గ్రామకరణ ఉద్యోగ బాధ్యతలతో బాటు కవిత్వాస్వాదన, రచనాభిరుచులను కూడా అందజేశారు.

నా మిత్రుడు భమిడిపాటి రామగోపాలం ఈ విశేషాలను చెపుతూ తాను మనుచరిత్ర మొదలైన కావ్యాలను 14-16 వయసప్పుడు అవలోకనం చేసినది ఈ ఇంట్లోనే అని చెప్పుకున్నారు. పెద్ద సన్యాసయ్య గారు నా మిత్రునికి మాతామహులు. సుప్రసిద్ధ కవి, నాటక, సినీ రచయిత, నటుడు గొల్లపూడి మారుతిరావుగారు ఈ గ్రామ మూలపురుషుడు అయిన ఆర్యభట్టుగారికి తొమ్మిదవ తరం పుత్రుడేనని తెలుస్తున్నది. 20వ శతాబ్దంలో ఈ గ్రామంలో పుట్టి పెరిగిన గొల్లపూడి నరసింహంగారు మల్లయోధుడిగా ప్రసిద్ధి చెందారు. ఈయన శాకాహారి మాత్రమే కాక బ్రహ్మచారి కూడా.

అలనాడు అరవై రెండు బ్రాహ్మణ గడపలు ఉండిన నందబలగ అగ్రహారంలో నేడు పట్టుమని పది లేవు.





నందబలగ కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణం

నందబలగ గ్రామంలోని దుర్గమ్మ గుడిని గురించి ఒక కథను చెప్పుకుంటారు. 19వ శతాబ్దంలో గ్రామ ప్రముఖులలో ఒకడుగా ఉండిన తెన్నేటి జోగయ్యగారు బెజవాడ వెళ్ళి కనకదుర్గాదేవి పూజలు చేసి తిరిగి వస్తుండగా ఒక రాత్రిపూట "ఆగు" అని ఒక స్త్రీ కంఠం వినిపించిందట. బిత్తరపోయి ఆలకించగా అదే స్త్రీ గొంతు "దర్శనం చేసి పూజ చేయగానే నీ బాధ్యత తీరిపోయిందా? మీ గ్రామస్థులకు కూడా ఈ భాగ్యం కలిగించు" అని ప్రబోధం. అందువలన ఈ కుటుంబం వారు ఇతరులు ఎవరి నుండి కూడా విరాళాలు తీసుకోకుండా ఆ గుడి కట్టించారట.

★


# నిడిఘట్టు

**ఈ గ్రామం** ఒకప్పటి విశాఖపట్నం జిల్లా శృంగవరపు కోట తాలూకాకి చెందినది. ప్రస్తుతం విజయనగరం జిల్లాలోని కొత్తవలస మండలంలో చేరినది.

ఈ గ్రామానికి ఇప్పటికి కూడా పక్కా రోడ్డు లేదు. కొత్తవలస మండలంలోని భీమాళి గ్రామం నుండి నైరుతి దిశగా ఒకటిన్నర కిలోమీటర్ల నడకదారి, కంటకాపల్లి రైల్వేస్టేషన్‌కు వాయవ్యంగా రెండున్నర కిలోమీటర్ల తోవ. చినరావుపల్లి రైల్వేగేటు (సంతబయలు) నుండి పడమటగా రెండు కిలోమీటర్లు.

ఈ అగ్రహారం ప్రాథమికంగా లింగధార నియోగులకు చెందినది. వీరు ఆరువేల నియోగులే గాని, శైవమతానికి ప్రాముఖ్యం ఇచ్చుకున్న శాఖవారు. వీరిని ఆరాధ్యులు అని కూడా అంటారు. ఇప్పుడైతే ఇటు లింగధారులతోను, నియోగులతోను సంబంధ బాంధవ్యాలు పెట్టుకుంటున్నారు గాని, ఒకప్పుడు ఈ గీత చాలా నిర్దుష్టంగా ఉండేది. ఆ రోజులలో ఈ శాఖవారిని మరణానంతరం పూడ్చిపెట్టేవారు తప్ప, దహనం చేసేవారు కాదు. వీరి ఇండ్లలో విష్ణు సిద్ధాంతానికి సంబంధించిన విగ్రహాలు గాని, చిత్రపటాలు కాని చివరికి మనుష్యుల పేర్లు గాని ఉండేవి కావు. బ్రాహ్మణులు గనుక ఉపనయనం తప్పదు. ఒంటిపోచ జంధ్యంతో పాటు "లింగకాయ" అనే పేరు గలది, సాలగ్రామం లేదా రుద్రాక్షతో తయారు చేసినది, ఒక బరువైన పూస కూడా తగిలించేవారు. లింగధారకులు అనే ఈ శాఖ ఆంధ్రదేశం అంతటా అక్కడక్కడా నేటికీ ఉంది. సాధారణంగా కాశీనాథుని వారు, చాగంటివారు, ఇవటూరి వారు, మల్లంపల్లివారు, రెంటాల వారు, బెండపూడి వారు, ముదిగొండవారు ఈ శాఖకు చెందిన వారుగా ఉండిరి.


ఈ అగ్రహారాన్ని విజయనగర సంస్థానాధీశులైన పూసపాటి గజపతిరాజులు ఇవటూరి వారికి, చాగంటివారికి వారి వారి వేదవేత్తృత్వ, జ్యోతిష్క, దైవ పూజాది ప్రతిభలకు గుర్తింపుగా ఇచ్చారు. రాజకుటుంబం వారు ఈ గ్రామాన్ని ధారాదత్తం చేసినప్పుడు ఒక చెరువుగాని, ఒక కోవెల గాని లేకుండెను. ఆ సంగతి బ్రాహ్మణులు వారి దృష్టికి తెచ్చారు. అప్పుడు ఆ ప్రాంతంలో మినుకు మినుకుగా ఉండిన రామలింగేశ్వర ఆలయ సముద్ధరణతో బాటు, మల్లికార్జునస్వామి ఆలయం నిర్మాణం కూడా జరిగింది. స్నానానికి, పానానికి ఒక మంచినీటి చెరువు త్రవ్వించారు.



శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం, నిడిఘట్టు

అప్పటి కాలంలో చాగంటివారితో, ఇవటూరి వారితో బాటు ఆరికరేవుల వారు, కోరుమిల్లి వారు కూడా ఉండేవారు. క్రమంగా కొందరు ఉర్లాం గ్రామానికి తరలిపోయారని చెప్పుకుంటారు.

నిడిఘట్టు గ్రామం నుండి ఉద్భవించిన వారు మేధావులు, అధికారులు, కవి పండితులు అనేకులు ఉన్నారు. చాగంటి వీరేశలింగం అయ్యగారు పొరుగు గ్రామం అయిన గనివాడ కరణంగా పనిచేశారు. ఆ ఉద్యోగం వారసత్వంగా పెద్దకొడుకు



శరభలింగం గారికి వచ్చింది. వారి రెండవ కుమారుడైన సన్యాసిరాజు కొవ్వూరులో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. వారి మూడవ కుమారుడైన చాగంటి సుందరరావుగారు, ఐ.ఇ.ఎస్. (ఇండియన్ ఎకనామిక్స్ సర్వీస్)లో ఉత్తీర్ణులై ఢిల్లీలో ప్లానింగ్ కమీషన్‌లోను, పారిశ్రామిక మంత్రిత్వ శాఖలోను, గోవా హార్బర్‌లోను ఉన్నత పదవులలో పనిచేయడమే గాక ఐక్యరాజ్య సమితి నుండి ఒక అవార్డును కూడా పొందారు. ప్రస్తుతం విశాఖపట్నంలో స్థిరపడి ప్రభుత్వేతర జనసేవా కార్యక్రమాలలో (ఎన్.జి.ఓ.) నిమగ్నులై ఉన్నారు.

ఇవటూరి నందికేశ్వరరావుగారు అనకాపల్లి ఎ.ఎమ్.ఎ.ఎల్. కాలేజీలో మొదటి చీఫ్ లైబ్రేరియన్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం అగస్త్య థియోసోఫికల్

సొసైటీ (అనకాపల్లి)లో జరుగుచున్న ఆధ్యాత్మిక చింతనా కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. నందికేశ్వరరావుగారి దత్తతండ్రి ఇవటూరి కూర్మయ్య గారు సబ్ ఇనస్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా పనిచేశారు. ఆ ఉద్యోగ బాధ్యతలే గాక, ఆ వృత్తితో సంబంధంలేని ఆంగ్ల, సంస్కృత భాషా పాండిత్యంలో అనితర సాధ్యమనిపించిన నైపుణ్యాన్ని పొందారు. వారి ఈ ప్రతిభ అప్పటి ఆంగ్లేయ అధికారులను ఆకర్షించింది. వారందరూ ఆయన ద్వారా కాళిదాసు, భవభూతి, భారవి మొదలైన వారి కావ్యాలను సంస్కృతంలో చదివించుకొని, వాటికి ఇంగ్లీష్ తాత్పర్యాలను చెప్పించుకునే వారు. వారి ద్వారా ఆయన సుప్రసిద్ధ ఆంగ్లకవులైన షేక్స్‌పియర్, మిల్టన్, టెన్నిసన్ మొదలైన వారి కవితల సౌరభాలను గ్రహించి, తన గ్రామస్థులకు, బంధు, మిత్రు వర్గ జనానికి వివరించేవారు.

ఇవటూరి నందికేశ్వర శాస్త్రిగారు వేద పరీక్షాధికారిగా ఉండేవారు. ఆయన కూర్మయ్యగారికి తండ్రి. కంచి సుబ్బరాయుడు శాస్త్రిగారు డిప్యూటీ ఇనస్పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా పనిచేశారు. ఈయన నందికేశ్వరరావు గారి జనక తండ్రియైన జోగారావుగారికి తండ్రి. కంచి సుబ్బరాయుడు శాస్త్రిగారు ఉద్యోగ ధర్మానికి ధీటుగా శివభక్తి, కాలజ్ఞత ఉండేవి. తాను శైవమతానికి సంబంధించిన ఏదో ఒక పవిత్ర దినం నాడు కైవల్యం చెందుతానని ఆయన చనిపోవడానికి పన్నెండు ఏళ్ళ ముందుగానే ప్రకటించుకొని, ఒకానొక కార్తీక పౌర్ణమి నాడు కాలం చేశారు. అందులో కూడా ఆయన 'కపాల మోక్షం' అనే పదానికి ఉదాహరణగా చనిపోయినప్పుడు మెదడు చిట్లిందని ఇప్పటికీ చెప్పుకుంటారు.

ఇక్కడి వారిలో మల్లంపల్లి సన్యాసిరాజుగారు 1940 ప్రాంతం నాడే బెనారస్ హిందూ యూనివర్శిటీలో ఎమ్.ఎస్.సి.లో ప్రథముడుగా నిలిచారు. విజయనగరంలో కొంతకాలం లెక్చరర్‌గా పనిచేసి, అనంతరం టాటా కంపెనీలో కెమిస్ట్‌గా పనిచేశారు. ఇక్కడి వారిలో చాగంటి బసవరాజుగారు విద్యార్థి దశలోనే పద్య కవితలు చెప్పారు. ఇవటూరి విశ్వనాథంగారు ఆగ్నేయ రైల్వేలో సీనియర్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఇవటూరి నందికేశ్వరరావుగారి కుమారుడైన గిరీశం గారు ఎమ్.ఎ. (తెలుగు) చదివారు. ఎ.ఎమ్.ఎ.ఎల్. హైస్కూల్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఈయన మంచి కవి. రామాయణంలోని కొన్ని ఘట్టాలను స్వంతంగా గేయాలుగా మలిచారు. పద్యం



శ్రీ రామమందిరం, నిడిఘట్టు

చదవడంలో ఈయనది ఒక ప్రత్యేక బాణీ. వివిధ తెలుగు కావ్యాల నుండి పురాణాల నుండి ఎంచిన పద్యాలను తన గొంతుతో ఒక ఆడియో సి.డి. చేశారు.

కాని ఈనాడు ఈ గ్రామంలో ఇంగువ కట్టిన గుడ్డ వాసన తప్ప, వేరే ప్రతిభలు, ఆర్థిక స్థోమతలు లేవు. భూములన్నీ సేద్యం చేసేవారి హక్కు భుక్తాలైనవి. చెరువులో గేదెలు స్నానాలాడుతున్నవి. అయితే రెండు శివాలయాలలో యధాసిధిగా దీపారాధన జరుగుతున్నది. బ్రాంచి పోస్ట్‌మాస్టర్‌గా రిటైరైన చాగంటి వీర జోగారావు గారు గ్రామాన్ని సందర్శిస్తుంటారు. చాగంటి సాంబయ్య పంతులుగారి మనవడు సన్యాసిరాజుగారు ఆర్కెలాజికల్ డిపార్టుమెంట్‌లో పనిచేసి రిటైరై ప్రస్తుతం నిడిఘట్టులోనే నివసిస్తున్నారు.

★

# పేరాపురం

**ఈ అగ్రహారం** పూసపాటిరేగ మండలంలో ఉన్నది. ఐదవ నెంబరు జాతీయ రహదారికి తూర్పుదిశగా ఒక కిలోమీటరు దూరం. పూసపాటి రేగ మండల కేంద్రానికి దక్షిణ దిశగా సుమారు 3 కి.మీ.ల దూరం. ఇది విజయనగరం మహారాజులు కూరెళ్ళ వెంకటాద్రిభట్లు గారికి ఈ అగ్రహారం దానం ఇచ్చారు. దానము ఇచ్చిన భూమి విస్తీర్ణము 620 ఎకరాలు. దరిమిలా వెంకటాద్రి భట్లు గారు కొంత భాగం బ్రాహ్మణులకు దానం చేసి, మిగిలిన దానిని కొంతమందికి విక్రయించారు. సుమారు 18 మందికి ఈ భూములు వచ్చాయి. పేరాపురం అను నామకరణం చేసినది వెంకటాద్రి భట్లు గారే. ఇప్పుడు 16 ఇళ్ళు బ్రాహ్మణ కుటుంబాలతో ఉన్నవి. ఈ గ్రామం నుండి ఎవరూ కూడా వలస వెళ్ళకపోవడం విశేషం. ఇక్కడ ఉన్న వాళ్ళందరూ వైదిక తెలగాణ్యులే. ఈ గ్రామంలో ప్రసిద్ధులు గురుదంతి సూర్యనారాయణ శాస్త్రి గారు. వీరు వివాహ ఉపనయనాలు చేయడంలో ప్రసిద్ధులు. ఇక్కడ ఇంకా పూరిగంటి రామమూర్తిగారు, కొలచాన ప్రకాశరావుగారు, పూరిగంటి అప్పల నరసింహం గారు ఉన్నారు. ఇక్కడ బ్రాహ్మణులకు పేదరికం లేదు. ఇచ్చట పేద పండితులు ఎవరూ లేరు. అందరూ భూస్వాములే.


★

# పురిటిపెంట

**గజపతినగరం** మండలంలో గజపతినగరానికి మూడు కి.మీ.ల దూరంలో ఉన్న ఈ గ్రామాన్ని విజయనగరం మహారాజులు గుమ్మావారికి వారి వైద్య నిపుణతను మెచ్చి ఇచ్చారు. గుమ్మావారు "ఆరామ ద్రావిడులు". 14 కుటుంబాలున్నాయి. వారిలో 12 గుమ్మావారే. 1. కొల్లూరు, 2. ఓదేటివారు, పెద్ద ద్రావిడులు రెండు కుటుంబాలు. ఇప్పుడు 16 బ్రాహ్మణ కుటుంబాలు ఉన్నవి.

గుమ్మా నారాయణగారు జమీందారీ పద్ధతిలో ఉండేవారు. వారికి రెండువందల ఎకరాలకు పైబడి భూమి ఉండేది. గుమ్మా సూర్యనారాయణగారు ఆ రోజుల్లోనే విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లో ప్రసిద్ధ న్యాయవాది. విశాఖపట్నం జిల్లా కోర్టులో న్యాయవాదిగా చేశారు. వీరు మహా మేధావి. గుమ్మా సీతారామ్మూర్తి గారు ఆ రోజుల్లో ఎమ్మెస్సీ మేథమేటిక్స్ గోల్డ్ మెడలిస్ట్. సి.ఎఫ్.ఆర్.ఐ.లో డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం విశాఖపట్నంలో ఉన్నారు. వారి తమ్ముడు శ్రీనివాసరావుగారు మాజీ సర్పంచ్, పురిటిపెంటలోనే ఉన్నారు. ఇంకో తమ్ముడు నారాయణరావుగారు విజయనగరం ఎమ్.ఆర్. కాలేజీలో లెక్చరర్‌గా ఉన్నారు. ఓలేటి వారు సహజ కవులు. పురోహితులు. ఆరోజుల్లో ఓలేటి లింగమూర్తిగారు ఎమ్.ఎస్.సి. చేశారు. సహజకవి. ఈ ఊరిలో "తూర్పురాపులు" సుంకరివారు పాము మంత్రం వేయుటలో ప్రసిద్ధులు. నేటికీ చుట్టుపక్కల ఎవ్వరూ అలా మంత్రము వెయ్యలేరు. ఓలేటివారి అబ్బాయి వి.ఆర్.సి.మూర్తి టెలిఫోన్స్‌లో పనిచేస్తున్నారు. అతను ముహూర్తాలు పెట్టడం, పుస్తకాలు వ్రాయటం చేస్తారు. గుమ్మా శ్రీనివాసరావుగారికి ఇప్పటికీ చాలా భూములు ఉన్నాయి.

★



# పుష్పగిరి

ఇది ప్రాధమికంగా వైష్ణవ క్షేత్రం. గోస్తనీ నదికి ఉత్తరంగా ఉన్న పద్మనాభం క్షేత్రానికి దీటుగా ఈ గ్రామాన్ని వేణుగోపాలస్వామి క్షేత్రంగా 17వ శతాబ్దం నాటి విజయనగరం మహారాజులు ఈ గ్రామాన్ని ఏర్పరచారు. భూమి విస్తీర్ణం కేవలం 120 ఎకరాల వరకు మాత్రమే. కాని ఎక్కువభాగం అన్నమరాజుపేట చెరువు నుండి లభించే నీటితో సాగుకు వచ్చేది. ముఖ్యంగా ఇక్కడ నరెడ్లవారనే వెలనాటి బ్రాహ్మణులు ఈ పొలాలను చూసుకుంటూ వేణుగోపాలస్వామి ఆలయానికి పూజాది అనుష్టానాల కోసం దేవదాయాన్ని సమర్పించేవారు.

ఈ గ్రామం కొత్తవలస, భీమసింగి రోడ్డులో పాత భీమసింగి వద్ద తూర్పు వైపుగా ఉన్న రోడ్డులో సుమారు నాలుగు కిలోమీటర్ల వద్ద ఉంది. ఈ బ్రాంచి రోడ్డులో అన్నమరాజుపేట, పొట్నూరు, బోని మొదలైన గ్రామాలున్నాయి.


పుష్పగిరి చిన్నపాటి వైష్ణవక్షేత్రం. జనాభా ఏనాడూ 1000 దాటలేదు. ఇళ్ళు నూరు. వీటిలో నరెడ్లవారి కుటుంబాలు నాలుగు పోను, అర్చకులైన శ్రీరంగంవారు (వైష్ణవులు) రెండు కుటుంబాల వారుండేవారు. ప్రధానార్చకుడు "పొట్టి ఆచార్యులు గారు". ఈయన పూజారి వాటాగా వచ్చే ధనరూప కానుకలను ఇంటిఖర్చులకై వినియోగించక వేణుగోపాలస్వామివారికి హంసవాహనం చేయించి పెట్టారు. ఇదంతా 1930-40 నాటి మాట. ఆకాలంలో భూముల మీద ఆజమాయిషీ ఉండిన నరెడ్లవారు ఆలయానికి తూర్పున పదివేల చదరపు అడుగుల విస్తీర్ణంతో పుష్కరిణిని త్రవ్వించారు. దేవాలయానికి వార్షిక ఆదాయం ఖర్చులకు పోను, మిగులే ఉండేది. ఆ సొమ్ముతో దేవాలయంలో రాతిమండపం, ధ్వజస్తంభం కట్టించారు. (పుష్కరిణి ఎండిపోయింది) అవన్నీ ఇప్పటికే చెక్కుచెదరక ఉన్నాయి. శ్రీరంగంవారి వంశాల నుండి అర్చక వృత్తి చెయ్యగలవారు ఏర్పడనందున ప్రస్తుతం నరెడ్లవారి వారసులే పూజాదికాలను నిర్వహిస్తున్నారు. అన్నమరాజుపేట గ్రామంలోని క్షత్రియులు (కాకర్లపూడి వారు) ధర్మకర్తలుగా బాగోగులు చూస్తున్నారు.

"పొట్టి ఆచార్యులు"గారి కుమారులు గోవిందాచార్యులు, కుమార్తె గోపాల రత్నం కర్నాటక సంగీతంలో కృషి చేయడానికి గాను విజయనగరం వెళ్ళారు. వీరిలో గోవిందాచార్యుల కంటే గోపాలరత్నంగారు ఎక్కువ ప్రామాణికత కలిగిన విద్వత్తును

సాధించారు. విజయవాడ, హైదరాబాదు, సికింద్రాబాదులలోని ప్రభుత్వ సంగీత కళాశాలలకు ప్రిన్సిపాల్‌గా పనిచేయకముందు ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో గాత్ర సంగీత నిలయ విద్వాంసురాలిగా పనిచేసి మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారితో లెక్కకు మించిన లలితగీతాలలోను, సంగీత రూపకాలలోను తన బాణీని అజరామరం చేశారు.

"పొట్టి ఆచార్యులు"గారి ఇంట్లో ఒక గదిలో అద్దెకు చేరి, అన్నమరాజుపేట ఎలిమెంటరీ స్కూలులో ఉపాధ్యాయుడుగా (1931-34) పనిచేసిన భమిడిపాటి సూర్యనారాయణగారి ప్రథమ పుత్రుడుగా 1932లో జన్మించిన నా మిత్రుడు రామగోపాలం పేరులో "గోపాల" శబ్దం స్థిరపడడానికి కారణం వేణుగోపాలస్వామిపై ఆయనకు ఏర్పడిన భక్తి ఒక కారణం. సూర్యనారాయణగారు "పుష్పగిరి వేణుగోపాల పూజ్యశీల" అనేది చివరి చరణంగా పెట్టుకున్న "వేణుగోపాల శతకం" వ్రాసి స్వామికి అంకితం చేశారు. ప్రఖ్యాత రచయితగా, సాహిత్యసేవకుడిగా రామగోపాలం తెలుగు వారికి సుపరిచితుడే.

★



పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయం

# రాముడు వలస

**సుమారు** రెండు శతాబ్దాల క్రిందట బొబ్బిలి సంస్థానాధీశులు కొటికలపూడి అనే ఇంటిపేరు గల వెలనాటి వైదిక బ్రాహ్మణులకు ఈ అగ్రహారాన్ని ఇచ్చారు. ఈ అగ్రహారం ఒకనాటి శ్రీకాకుళం జిల్లా బొబ్బిలి తాలూకాలోనిది. ఇప్పుడు అనగా విజయనగరం జిల్లా ఏర్పడి పరిపాలనా వికేంద్రీకరణ వలన ఏర్పడిన బొబ్బిలి మండలంలో చేరి ఉంది. ఈ గ్రామం బొబ్బిలికి సుమారు 18 కి.మీ.ల దూరంలో ఆగ్నేయపు దిశగా ఉంది.

రాముడువలస అగ్రహారం ఆ కాలంలో ఖగోళ జ్యోతిష శాస్త్ర ప్రవీణుల వలన ఖ్యాతికి వచ్చిన గ్రామం. కొటికలపూడి కోదండరామయ్యగారు 19వ శతాబ్దపు మేధావి. ఆయనకు జ్యోతిష ఖగోళ శాస్త్రాలలో ఉన్న ప్రావీణ్యాన్ని గుర్తించి కొందరు జర్మన్ శాస్త్రవేత్తలు ఆయనను వారి దేశానికి తీసుకు వెళ్ళారు. కోదండరామయ్యగారు ఆ శాస్త్రాల సారాలను, ఫారాలను సంస్కృత భాషలో వివరించగా అక్కడి వారిలో సంస్కృతం తెలిసిన వారు ఆయన చెప్పిన విషయాలను జర్మన్ భాషలోకి తర్జుమా చేసుకొని ఆ దేశంలో వారికి కాంతి ఒనగూర్చారు. బొబ్బిలి సంస్థానాధీశులు తమకు ఈ అగ్రహారాన్ని ఇచ్చినందుకు కృతజ్ఞతగా ఈ గ్రామపు పండితులు నిరంతరం బొబ్బిలిలో శాస్త్ర, విద్యాబోధలు చేస్తూ కవిత్వాలు చెప్పేవారు.

రాముడువలసలో జన్మించి ఇప్పటికీ అక్కడే ఉంటున్న మహోన్నత వ్యక్తి పీసపాటి నరసింహమూర్తిగారు. (జననం 1920) 1940 దశకం నుండి ఇంచుమించు 1990 దశకం వరకూ - అనగా 5 దశాబ్దాల పాటు అనేక పౌరాణిక నాటకాలలో శ్రీకృష్ణ వేషధారణకు సాటిలేని మేటి నటుడిగా భారతదేశంలోనే కాక, పలు పాశ్చాత్య దేశాలలో పదిమందికి పరిచయమైనవారు. ఆంధ్రదేశంలో శ్రీకృష్ణరాయబారం, పాండవోద్యోగ విజయాలు, గయోపాఖ్యానం, చింతామణి, సత్యహరిశ్చంద్ర, కనకతార, మాలతీమాధవం, చంద్రహాస, పాదుకా పట్టాభిషేకం మొదలైన పౌరాణిక ఐతిహాసిక నాటకాలు ముమ్మరంగా ప్రదర్శించిన కాలంలో ఎవరెవరు ఎంతెంత ప్రతిభలు, ఆహ్లాదాలు ప్రదర్శించినా అబ్బూరి వరప్రసాదరావు, పీసపాటి నరసింహమూర్తి గార్ల జోడీ (అబ్బూరి, పీసపాటి కాంబినేషన్)కి ఒకటవ కృష్ణుడు, రెండవ కృష్ణుడుగా

వాలుపోస్టర్లలో కనిపించడానికి సాటిలేదు. ఆరేసి వందలమంది ప్రేక్షకులు ఆశీనులై కూర్చునే ఆరుబయలు రంగస్థలాలలో మైకులు లేని రోజులలో గంభీరమైన కంఠస్వరాలతో పద్యాలు చదువుతూ ఎన్ని "వన్స్‌మోర్"లు వస్తే అన్నిసార్లు విసుగు లేకుండా చదివిన వారు. అద్దంకి శ్రీరామమూర్తి, మాధవపెద్ది వెంకట రామయ్య, వేమూరి గగ్గయ్య వంటి ఉద్దండుల మధ్య తన ప్రత్యేకతను నిలుపుకున్న పీసపాటి నరసింహమూర్తిగారు లెక్కకు మించిన సన్మానాలు, బహుమానాలు పొందారు. అమెరికాకు చెందిన అప్పాజోస్యుల-విష్ణుభొట్ల ఫౌండేషన్ వారు 1995లో లైఫ్ టైమ్ ఎఛీవ్‌మెంట్ అవార్డు ఇచ్చి వీరిని సన్మానించారు.


పీసపాటి నరసింహమూర్తి

రాముడువలసకు చెందిన మరొక మహనీయుడు జొన్నలగడ్డ శివరామమూర్తి గారు. వీరి కుమారుడు జె.ఎస్.వి. ప్రసాద్‌గారు, ఐ.ఎ.ఎస్.కు ఎన్నికై పశ్చిమబెంగాల్‌లో ఉన్నతాధికారిగా నియామకం పొందారు. తల్లిగడ్డ అయిన విశాఖ ప్రాంతం మీద ప్రేమ చేత కొన్నాళ్ళు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి డెప్యూటేషన్ మీద వచ్చి విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌గా కొంతకాలం పనిచేశారు. డెప్యూటేషన్ ఫలించడానికి నేపధ్యం ఆయనపై భారతదేశ ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు గారికి ఆయనపై కలిగిన వాత్సల్యమే. జె.ఎస్.వి. ప్రసాద్ గారు, పి.వి.ఆర్.కె. ప్రసాద్‌గారితో కలిసి పి.వి. నరసింహారావు గారి పేషీలో ఆంతరంగిక కార్యదర్శిగా పనిచేశారు.

★

# రంగరాయపురం

**లక్కవరపుకోట** జమీందార్లు తమ ఇండ్లలో పురోహిత సేవలు చేస్తూ ఉండిన ద్వాదశివారికి, బులుసువారికి ఈ అగ్రహారాన్ని 18వ శతాబ్దంలో ప్రదానం చేశారు. ఈ ఊరు ఇప్పటికీ బ్రాహ్మణ కుటుంబాలతో, పరువు ప్రతిష్ఠలు తక్కువ కాని జీవన విధానాలతో ఉంది. 18వ శతాబ్దం అనంతరం ఈ ఊరు చేరిన బ్రాహ్మణ కుటుంబాలు ఎక్కువగానే ఉన్నాయి. కొత్తగా చేరిన వారు వడలివారు, కూనపులివారు, ఈశ్వరవారు, తమ్మావారు, గరిమెళ్ళవారు. ఉద్యోగరీత్యా చేరినవారు పాకల వెంకటాచలం గారు.

కొత్తవలస నుండి అరకు ద్వారా జయపురం - జగదల్‌పూర్ వెళ్ళే రోడ్డు మీద కొత్తవలస నుండి 13 కి.మీ.లో ఉన్న ఈ ఊరు రోడ్డుకు ఆనుకొని లేదు. ఉత్తర దిశగా రెండు ఫర్లాంగుల దూరంలో ఉంది. ఒక రైసు మిల్లు మాత్రం రోడ్డు మీద ఉంది.

ఈ ఊరికి చేరిన కూనపులి వెంకటేశ్వర్లు విజయనగరం సంస్థానానికి చేరి, ఎస్టేట్ డిపార్ట్‌మెంట్‌లో రెవెన్యూ ఇనస్పెక్టర్‌గా పనిచేశారు. ఇదంతా 1930-40 నాటి



బులుసువారి ఇంటి వద్ద ఇప్పటికీ ఉన్న నూరేళ్ల చింతచెట్టు, మొండిగోడలు.
ఈ పిల్లలు బులుసు కనకాద్రి సోమయాజులుగారి మునిమనవళ్ళు.

మాట. కనుక ఇప్పుడు చెప్పుకుంటే తప్పులేదు. కూనపులి వెంకటేశ్వర్లు గారిది చాలా నిశితమైన తర్కబుద్ధి. "వాడి జుట్టు ముడి వీడికి పెట్టి, వీడి జుట్టు ముడి వాడికి పెట్టి" అని పాడిన పాటలో పాత్రవంటివాడు. ఈయన రిటైర్ అయ్యాక ఆ ఉద్యోగం పాకల వారి కుటుంబానికి చెందిన పెద్ద వెంకటరావుగారు నిర్వహించారు. ఏ విధమైన పంటభూమి వసతి లేకపోయినా కేవలం పురోహిత వృత్తి నైపుణ్యం చేత ఇక్కడికి పది మైళ్ళ వలయానికి ఏకైక శుభంకరులుగా, నిజాయితీపరులుగా ప్రసిద్ధి చెందిన బులుసు సేతుమాధవస్వామి, కనకాద్రి సోమయాజులు సోదరులు చాలా గౌరవప్రదమైన జీవితాలు గడిపారు. వీరిలో కనకాద్రిగారికి అభ్యాగతి నియమం, వారి ఇల్లాలు సుబ్బలక్ష్మిగారికి పొద్దు నియమం ఉండేవి. సహపంక్తికి అభ్యాగతి రాకపోతే ఆయన, ఎండ రాకపోతే ఆవిడ ఆయా రోజులలో మధ్యాహ్న భోజనాలు చేసేవారు కాదు. ఈశ్వరవారు, తమ్మావారు, గరిమెళ్ళవారు తమ భూములను స్వయం పర్యవేక్షణలో వ్యవసాయం చేయించుకునే వారు. వడలివారిలో మూడవ తరానికి చెందిన సూర్యనారాయణ గారు ఎలిమెంటరీ స్కూలు టీచరుగా జిల్లా బోర్డు సంస్థలో పనిచేశారు. ఈయన కుమారుడు వాసుదేవమూర్తి ఎంతో మేధాసంపత్తి గలిగి ఉండి 1955 నాటికే విదేశ ఉద్యోగ యోగ్యత సంపాదించుకొని అమెరికా వెళ్ళి అక్కడ చాలా సంపద, ఖ్యాతి పొందారు. పురోహిత వృత్తినే అంటిపెట్టుకొని ఉన్న ద్వాదశివారు, బులుసు వారు ఎదుగూ బొదుగూ లేకుండా 1960 వరకు అక్కడే ఉండిపోయారు. కాని ద్వాదశి సూర్యనారాయణగారు, నరసింగరావుగారు వృత్తిని కొనసాగించారు. బులుసు సేతుమాధవస్వామిగారి పురోహిత వృత్తిలోని నిజాయితీ, శాస్త్ర సమంజసత ఇటు కళ్ళేపల్లి, కుమ్మపల్లి నుండి అటు శృంగవరపుకోట వరకూ అన్ని గ్రామాలలోనూ ఆదరణకు పాత్రమైంది. ఉత్తరోత్తరా ఈ కుటుంబాల మగసంతానాలు చదువులు నేర్చి ప్రభుత్వ ఉద్యోగాలలో చేరిపోయారు.

ఒకటి రెండు విశేషాలు చెప్పవలసి ఉంది. బులుసువారి ఇంటి స్థలం సుమారు 1200 చదరపు గజాలు ఉంది. అప్పటి పూరిల్లు నేలమట్టమైంది. చింతచెట్టు, కొబ్బరి చెట్లు అప్పటివి ఇప్పటికీ అలాగే ఉండి కోసుకున్న వాళ్ళకి అందుబాటులోకి వచ్చాయి కాని, నివేశన స్థలం మాత్రం ఎవరూ ఆక్రమించలేదు. నా పోలీసుబుద్ధితో చుట్టూ చేరిన వారిని ఒక ప్రశ్న అడిగాను. "ఏమయ్యా! ఇంతమంది ఉన్నారే.. తలో పంద

చదరపు గజాలు ఆక్రమించుకొని ఇళ్ళు కట్టుకోవచ్చు కదా? ఈ పంతుళ్ళు ఎక్కడెక్కడో ఉన్నారు గనుక మిమ్మల్ని కోర్టులకి లాగరు కదా!" అని. దానికి అక్కడున్న వారిలో ఒకాయన సమాధానం చెప్పాడు. మామూలుగా చెప్పలేదు. పదే పదే నోటి మీద, గుండె మీద కొట్టుకుంటూ "అయ్యబాబోయ్! ఆ స్థలం ఆక్రమిస్తే నాశనమైపోతామండి.. అది యజ్ఞాలు చేసిన స్థలం. పెళ్ళిళ్ళు, నోములు, వ్రతాలు చేయించిన స్థలం" అంటూ అతను చెప్పిన సమాధానంలో భయం స్పష్టమైంది.

"నీవెవరు నాయనా?" అని అడిగాను. వెంటనే అక్కడ నుండి జారుకున్నాడు. చుట్టూ చేరిన వారిలో ఒకాయన "ఆడా.. ఆడూ దేగల సిన్నిబాబు మేనల్లుడండి" అంటూ సమాధానం ఇచ్చాడు.

1950-60 కాలంలో ఈ అగ్రహారంలోని బ్రాహ్మణులు తమ పిల్లల చదువుల నిమిత్తం భూములు తాకట్టుపెట్టి, డబ్బు అప్పు తీసుకున్నది ఈ దేగల చిన్నిబాబు నుండే! క్రమంగా ఆ భూములు అతనికి చెందిపోయాయి.

రంగరాయపురం అగ్రహారానికి "పిళ్ళా అగ్రహారం" అనే పేరు కూడా ఉండేది. బ్రాహ్మణుల సంఖ్య కంటే పిళ్ళా అనే ఇంటిపేరు గల "పాత్రుళ్ళు" (అయ్యోరకల) కులానికి చెందిన వారు ఎక్కువమంది ఉన్నారు.

పాకలవారు ముఖ్యంగా పెద్ద వెంకటరావుగారు ఉద్యోగరీత్యా సంపాదనాపరులై చుట్టుపట్ల ఉన్న జిరాయితీ గ్రామాల నుండి కొన్ని భూములు కొనుక్కున్నారు. ఆయనకు పుట్టిన అయిదుగురూ ఆడపిల్లలే. పాకల వెంకటరావుగారి అమ్మాయిలలో మూడవ కుమార్తె వెంకటలక్ష్మి భారతప్రభుత్వ సంస్థ డి.ఆర్.డి.ఓ.లో సైంటిస్టుగా హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నారు.

★

# సీతారామపురం

**గజపతినగరం** మండలంలో గజపతినగరానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామం, చంపావతి నదికి దగ్గరలో ఉంది. ఈ అగ్రహారం విజయనగరం మహారాజులు జమ్మివారి కుటుంబానికి (మాధ్వులు) వారి వైద్యప్రతిభకు మెచ్చి ఇచ్చారు. ప్రస్తుతం జమ్మివారు విజయనగరంలో ఆయుర్వేద వైద్యం చేస్తున్నారు. (చిన్ని పంతులు గారు) ఇక్కడ అగ్రహారం భూమి చాలా విలువైనది, 300 ఎకరాలు. ఇక్కడి పద్మశాలీలు మగ్గం నేతకు ప్రసిద్ధి చెందారు. ఈ ఊరు కళలకు ప్రసిద్ధి చెందింది. 60 ఏళ్ళ క్రితం భట్రాజుగారు హాస్యమునకు ప్రసిద్ధి. వారు వైజాగ్ వెళ్ళిపోయారు. వారబ్బాయి భామవేషం బాగా కట్టేవారు. కాకరపర్తి నరసింహంగారు ఆ రోజుల్లో భాగవతం నేర్పేవారు. వారి శిష్యులే భట్రాజుగారు. గజపతినగరంలో మెయిన్‌రోడ్డులో గల రామమందిరం ఎదురుగా ఉన్న ఇల్లు ఆ రోజులలో నరసింహంగారిదే. పొట్టావారు ప్రస్తుతం ఉన్న మాజీ ఎం.ఎల్.సి. నార్కెడుపల్లి వెంకట గంగరాజుగారి తాతగారు నరసింహంగారిని పోషించి "సారంగధర" వగైరా నాటకాలు వేయించారు. గజపతి నగరంలో కూడా లేనిరోజులలో ఇక్కడ బ్యాండు మేళం ఉండేది. ఇప్పుడిక్కడ బ్రాహ్మణులు లేరు. పద్మశాలీలు, కాపులు ఉన్నారు.

★

# శివరామపురం

**ఈ గ్రామం** బొబ్బిలి-సాలూరు రైల్వేలైనుకు దక్షిణంగా సాలూరు నగరానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది చాలా పురాతనమైన గ్రామం. సాలూరు జమీందార్లు కట్టమూరివారు అనే వెలనాటి వైదిక శాఖ బ్రాహ్మణులకు వారి వేద పాండిత్య, పురోహిత ప్రతిభలకు మెచ్చి సుమారు 1800 సంవత్సరం ప్రాంతంలో బహూకరించారు. గ్రామ పొలాల విస్తీర్ణం మెరక, పల్లం, చెరువూ, దారీ అన్నీ కలిపి సుమారు 200 ఎకరాలు.

కట్టమూరి వారికి ఈ గ్రామాన్ని బహూకరించిన సాలూరు లక్ష్మీనృసింహ విక్రమదేవ సన్యాసిరాజుగారున్నూ, వారి కుమారుడైన లక్ష్మీనృసింహ సన్యాసిరాజు గారున్ను బ్రాహ్మణుల యెడల గౌరవం కలిగి ఉండిరి. కట్టమూరి వారిలో మూల పురుషుడైన కామేశ్వర శాస్త్రి, వారి తరువాతి తరాల వారైన లక్ష్మణశాస్త్రి, రామమూర్తి శాస్త్రి, కొండలరాయ శర్మ వీరందరూ ఇటు వేదంలో నైపుణ్యంతోనూ, అటు కవిత్వ పాండిత్య కాంతులతోనూ రాజవంశీయులనే కాక, సామాన్యులను కూడా అలరించారు. కొండలరాయ శర్మగారి క్రిందితరం వారు లక్ష్మీనృసింహ శర్మ, రామమూర్తి శాస్త్రి, వేంకటేశ్వర శాస్త్రి మరియు వీరి క్రింది తరం వారు పాండిత్య వేద విజ్ఞాన ప్రతిభలతో చాలించుకోక, వ్యవహార దక్షత కూడా సాధించుకున్నారు.

ముందు తరం వారిలో కామేశ్వరశాస్త్రి గారు చెప్పిన "రామప్రభో" శతకం ఆధ్యాత్మిక, జ్ఞాన అన్వేషకులకు ఇష్ట పదార్థంగా ఉండేది. వీరి కుమారుడు లక్ష్మణ శాస్త్రి ఆనాటి జమీందారుగారి బిడ్డ సన్యాసిరాజుని ఊయలలో వేసినప్పుడు రాసిన ఒక లాలిపాట ఆధారంగా అప్పటి రాజావారు వారికి ప్రత్యేకంగా గుమడాం గ్రామం వద్ద 75 ఎకరాల భూమిని అదనంగా ఇచ్చారు. క్రమంగా ఆ భూమి టైటిల్ డీడ్ ఇనాముగా ప్రకటింపబడి 1956 చట్టం ప్రకారం రైతులకు దఖలు పడింది.

లక్ష్మీనృసింహ శర్మగారికి నలుగురు కుమారులు. వీరిలో కామేశ్వర శర్మ, వామన శర్మ ఆంగ్ల విద్యను అభ్యసించి బ్రిటీషువారి హయాం నాడే ఉద్యోగాలు సంపాదించుకున్నారు. కామేశ్వర శర్మ వ్యవసాయ శాఖలో అధికారిగా పదవీ ఉన్నతి పొంది శృంగవరపుకోట తాలూకాలో రిటైరయ్యారు.

రామమూర్తి శాస్త్రిగారు సాలూరులో వేదపాఠశాలలో పనిచేసి, అప్పటి

జయపురం సంస్థానాధీశులైన విక్రమదేవ వర్మగారిని మెప్పించి సువర్ణ కంకణాలను, కుండలాలను పురస్కారాలుగా పొందారు. తరువాత కాలంలో ఈయన శ్రీ శంకర భగవత్పాదుల వారి "బ్రహ్మసూత్ర భాష్యము"నకు తెలుగు అనువాదాన్ని రచించారు.

తెలుగు సినిమా రంగంలో గాయకుడిగా, సంగీత దర్శకుడిగా చిరస్థాయి కీర్తిని సంపాదించుకున్న సాలూరు రాజేశ్వరరావు గారు జన్మించినది ఈ గ్రామంలోనే. రాజకీయ తదితర కారణాల వలన రాజేశ్వరరావుగారి విగ్రహం సాలూరులో ప్రతిష్ఠించిన అనంతరం ఈ గ్రామం వారు చేపట్టిన ఆందోళన ఫలితంగా ఈ గ్రామంలో కూడా వారి విగ్రహం ఒకటి పెట్టగలమని నాయకులు వాగ్దానం చేశారు. అయితే అది నేటికీ పునాది రాయి దశలోనే మిగిలి ఉంది.




శివరామపురం గ్రామంలో ప్రస్తుతం కట్టమూరి సూర్యనారాయణ మూర్తి, తదితరుల కుటుంబాలు ఐదారు కుటుంబాల కంటె మించి లేవు. ఆనాటి అఖండ భూవసతి నేడు నామమాత్రమై ఉంది.

★

# సోంపురం

**లక్కవరపుకోట** జమీందారు 18వ శతాబ్దంలో వాడపల్లి సోమయ్య శాస్త్రి గారికి, ఆయనను అనుసరించి జీవించిన బ్రాహ్మణ కుటుంబాల వారికి ఈ గ్రామాన్ని ఇచ్చారు. ఈ గ్రామం భూమి విస్తీర్ణం సుమారు 90 ఎకరాలు. ఈ ఊరిలో ఆనాడు జయంతివారు, కొడవంటివారు, వాడపల్లివారు ఐదారేసి కుటుంబాల చొప్పున ఉండేవారు. శ్రీపాద వారి కుటుంబం ఒకటి ఉండేది కాని శ్రీపాద సుబ్బావధానిగారు అప్పటికే ఇంగ్లీషు చదువుకొని విశాఖపట్నంలో ఉద్యోగానికి వెళ్ళినందువలన ఆ కుటుంబానికి ఈ గ్రామపు భూములలో ఏమీ ఇవ్వలేదు. నివేశన స్థలం మాత్రం ఉండెను. 1940-50 మధ్య మిగిలిన బ్రాహ్మణ కుటుంబాలన్నిటి నుండి మగపిల్లలు విజయనగరం, విశాఖపట్నం పట్టణాలలో చదివి, ఎవరికి సాధ్యమైన ఉద్యోగంలో వారు స్థిరపడి అగ్రహారం నుండి వలసపోయారు. ఈ ఊరు నుండి ఉద్యోగరీత్యా వలస పోయిన వారిలో వాడపల్లి మృత్యుంజయరావుగారు, కొడవంటి నరసింహ బ్రహ్మంగారు ప్రస్తుతం సజీవులై ఉన్నారు. మృత్యుంజయరావుగారు విద్యాబోధనా నిపుణుడు. చదివించినది చిన్న క్లాసుల వారినే అయినా జిల్లా పరిషత్ హైస్కూళ్ళలో, ట్యుటోరియల్ కాలేజీలలో ఆయన వద్ద విద్య అభ్యసించిన వారు వేల సంఖ్యలో ఉన్నారు. 85 వయసు దాటినా ఆరోగ్యంగా, హుందాగా ఉన్నారు. కొడవంటి వారిది న్యాయవాద కుటుంబం. కొడవంటి బ్రహ్మజీ అనే పేరు విశాఖ జిల్లా న్యాయవాది కేడర్‌లో ఉన్నత స్థాయికి చెందినది.

సోంపురం గ్రామం కొత్తవలస నుండి శృంగవరపుకోట వెళ్ళే రోడ్డు మీద 17 కి.మీ.ల దూరంలో ఉంది. గ్రామం రోడ్డుకు రెండు ఫర్లాంగులు పడమటగా ఉంది. బ్రాహ్మణ కుటుంబాలు ఒకటి ఒకటీ వలస వెళ్ళిపోకముందు నుండి కూడా ఇక్కడ వైశ్యులది పై చేయి. 1930 ప్రాంతంలోనే "తీగెల" వారు ఈ ఊరికి వచ్చే రోడ్డు జంక్షన్ వద్ద ఒక ధాన్యపు మిల్లును పెట్టారు. క్రమంగా ఈ ఊరిలో (వేరుశెనగ) నూనె మిల్లులు కూడా వచ్చాయి.

కొత్తవలస-శృంగవరపు కోట రోడ్డు మీద ఉన్న సోంపురం జంక్షన్ నుండి అక్కడికి పడమట దిశగా ఉన్న కొండలలోనికి సుమారైన రోడ్డు ఉంది. కొండను ఆనుకొని ఉన్న గ్రామాలలో వేపాడ, వల్లంపూడి ముఖ్యమైనవి. వేపాడ ఆయుర్వేద

వైద్యులకు స్థావరంగా ఉండేది. *1950-60* వరకూ "వేపాడ డాక్టరుగారు" అని ఒకాయన మంచి ప్రాక్టీసుతో ఉండేవారు. స్వయంగా నడిచివెళ్ళి రోగులను పరీక్షించేవారు. మూలికలతోనూ, ఆకులతోనూ, గింజలతోనూ తనకు తానే స్వయంగా తయారు చేసిన మందులను ఉచితంగా రోగులకు ఇచ్చేవారు. వీరి వైద్యసేవలు అందిన గ్రామాలలో తలారి, కొట్యాడ, రెండు సీతారామపురములు, బొద్దాం, పాటూరు, లక్ష్మీపురం ఇంకా కొన్ని కొండప్రాంతపు గ్రామాలు పేర్కొనతగినవి.

★

# శ్రీరాంపురం

**ఈ అగ్రహారం** కొత్తవలస-శృంగవరపుకోట రోడ్డులో గంగుపూడి వద్ద రోడ్డు వదిలేసి పడమటవైపుగా ఉన్న రోడ్డులో మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ 25 ఇళ్ళ అగ్రహారం ముఖీవారి సంస్థానంచే బహూకరింపబడినది. ఈ అగ్రహారం వెలనాట్లకు ఇచ్చారు. అయితే తదుపరి కాలంలో ద్రావిడ్లు ఆక్రమించారు. వీరు తంజావూరు నుండి వచ్చారు. దరిమిలా ముఖీవారి సంస్థానాన్ని విజయనగరం రాజుల వారు ఆక్రమించారు.

ముఖీ వంశ రాజులలో ముఖ్యుడు సింగవరపు భూపాలుడు. అందుచే ఈయన పేర శృంగవరపుకోట అనే పేరు వచ్చినది. ఇచ్చట శాస్త్ర పండితులు ఉండేవారు. వారు శ్రీ వడ్లమాని గౌరీపతిశాస్త్రిగారి పూర్వీకులైన కీ.శే. అన్నయ్య శాస్త్రి, వేంకట శాస్త్రి ప్రముఖులు. అన్నయ్య శాస్త్రిగారు బాలాత్రిపుర సుందరి ఉపాసకులుగా పేరుగాంచారు. వారి కుటుంబీకులైన వడ్లమాని వారు విశాఖ ప్రాంతాలలో స్థిరపడ్డారు.

వేంకటశాస్త్రిగారి కుటుంబీకులు విశాఖపట్నం, విజయనగరం జిల్లాలలో స్థిరపడ్డారు. ప్రస్తుతం డజను బ్రాహ్మణ కుటుంబాలు ఉంటున్నాయి. ఈ ప్రాంతీయులు ఎక్కువగా కోల్‌కటాలో స్థిరపడ్డారు.

"పాదాలమ్మ" అనే గ్రామదేవతకు సుమారు 50-60 ఏళ్ళ క్రిందట వడ్లమాని వారు నిర్మించిన ఆలయాన్ని ఇటీవల వేదుల సూర్యసుబ్రహ్మణ్యం గారు లోటుపాటులు సరిదిద్ది కంటికి ఇంపుగా చేయించారు.

ఇప్పటికీ ఈ ఊరిలో వేదులవారు, వడ్లమానివారు, కొన్ని కుటుంబాల వారు కాపురాలు ఉండి తమ భూములను తామే సేద్యం చేసుకుంటున్నారు. ఒకప్పుడు "శ్రీరామపురమే కూతురా, కూతురా! ఎద్దడి నీళ్ళే కూతురా, కూతురా!" అనే ఒక పాట ఉండేది. ఆ ఊళ్ళో అప్పట్లో గ్రామకంఠంలో ఒక్కటైనా మంచినీళ్ళ బావి లేకుండెను. పొలాల వరకు వెళ్ళి గృహిణులు బిందెలతో నీళ్ళు మోసుకొచ్చేవారు. ఈ పద్ధతిని "ఎద్దడి నీళ్ళు" అంటారు. ఒకానొక తల్లి తన కూతురును శ్రీరాంపురం గ్రామానికి ఇచ్చి వివాహం చేసిన సందర్భంలో కూతురు అక్కడ కాపురం చేసేటప్పుడు ఆమెకు తగిలే నీటిమోత కష్టాన్ని మదిలోకి తెచ్చుకొని వేదనతో పాడిన పాట అది.

★

# వెంగాపురం

**ఈ అగ్రహారం** విజయనగరం జిల్లా బలిజిపేట మండలంలో ఉంది. బొబ్బిలికి 20 కి.మీ.ల దూరంలో ఉన్నది. కొడుకుల నారాయణశాస్త్రిగారికి బొబ్బిలి రాజైన వెంగళరాయుడు గారు ఈ అగ్రహారాన్ని దానంగా ఇచ్చారు. నారాయణ శాస్త్రిగారి కొడుకు వెంకన్న శాస్త్రి, వెంగళరాయుడు పేర్ల మీద వెంగాపురం అనే గ్రామం వెలిసింది. అంతకుముందు ఆ ఊరిపేరు పెంటపాడు (పెంటపోలమ్మ అమ్మవారి పేరున ఆ గ్రామం ఉండేది). పాలకొండ జమీందారు గారికి మూల నక్షత్రంలో కొడుకు జన్మించగా, శాంతి చేయు నిమిత్తం నారాయణ శాస్త్రి గారికి ఎనుబోతును దానం ఇవ్వబూనగా, దానికి శాస్త్రిగారు తిరస్కరించి ప్రస్తుతం బొబ్బిలిలో కళ్యాణ మండపం ఉన్నచోట కూర్చున్నారట. అప్పుడు వెంగళరాయుడు చూసి, "బ్రాహ్మణులు కలత చెందుటయా!" అని వెంగాపురం దానంగా ఇచ్చారట. (దాన విక్రయ అధికారాలతో) ఆరవ జార్జి చక్రవర్తితో సంతకం చేయించి రాగిరేకుపై రాయించి మరీ ఇచ్చారట. ఇది ఏకపట్టా అగ్రహారంగా కోర్టులో వెంగళరాయలు దాఖలు చేశారు. అందుచే ఎవరూ స్వాధీనపరచుకొని వీలు కలగలేదు. దానంగా 198 ఎకరాల భూమి ఇచ్చారు.

ఒకనాడు ఇది 60 ఇళ్ళ అగ్రహారం. ప్రస్తుతం 30 ఇళ్ళు మాత్రమే ఉన్నవి. వలస వెళ్ళినవారిలో చెడినవారు లేరు. ఖాళీ అయిన ఇళ్ళు కొనుటకు ఎవరూ సాహసించడం లేదు. ఈ అగ్రహారంలో పుట్టిన ప్రముఖులు : మిలిటరీ సుబేదారుగా పనిచేసి పదవీ విరమణ చేసిన క్రాలేటి శ్రీరామమూర్తి, గుమ్మలూరి రామమూర్తి (ఎల్.ఎమ్.పి. డాక్టరుగారు), వీరికి కె.జి. హాస్పిటల్‌లో బంగారు పతకం ఇచ్చారు. వారి కుమారులు సత్యనారాయణ కెనడాలో జియాలజిస్టుగా, అప్పలనరసింహం అమెరికాలో డాక్టరుగా ఉన్నారు.

ఇచ్చట బ్రాహ్మణులు ఉపాధ్యాయ వృత్తి, పౌరోహిత్యం, వ్యవసాయం వంటి వృత్తులు చేసుకొని జీవిస్తున్నారు. మరికొందరు ఉద్యోగాలు చేస్తూ.

ఈ గ్రామానికి చెందిన ముక్కవిల్లి రమణమూర్తిగారు సుదీర్ఘకాలం పాటు మధ్యప్రదేశ్ ప్రభుత్వంలో పబ్లిక్ వర్క్సు డిపార్టుమెంటులో పనిచేసి రిటైరై ప్రస్తుతం గజపతినగరంలో స్థిరపడి ఉన్నారు.

★

# విశాఖపట్నం జిల్లా

## చిన్న భైరవి భూపతి అగ్రహారం

**ఈ అగ్రహారం** విశాఖపట్నం జిల్లా మండల కేంద్రమైన నాతవరానికి దక్షిణ దిశలో సుమారు 6 కి.మీ.ల దూరంలో ఉన్నది. దీని వైశాల్యం రెవెన్యూ రికార్డుల ప్రకారం సుమారు 1700 ఎకరాలు.

ఈ అగ్రహారాన్ని బ్రాహ్మణ పండితులకు దానం చేసినది గొలుగొండ రాజా వారైన వెంకట చిన భైరవి భూపతిరాజు గారు. అప్పట్లో ఇది 50 ఇళ్ళ అగ్రహారం. ప్రస్తుతం మూడు కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. మిగతా వారు విశాఖ వంటి పట్టణాలకు బ్రతుకు తెరువు కోసం వలస వెళ్ళారు.

ఈ అగ్రహారంలో కురిచేటివారు, సుంకరణంవారు, వడలి వారు ఉండేవారు. కురిచేటి వెంకటరాజుగారు ప్రస్తుతం విశాఖపట్నంలో ఎలక్ట్రిసిటీ బోర్డులో పనిచేస్తున్నారు. వడలి కొండబాబుగారు విశాఖపట్నం షిప్‌యార్డులో పనిచేస్తున్నారు. కురిచేటి వెంకట రమణమూర్తిగారు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్నారు.

ఈ అగ్రహారంలో పురాతనమైన శ్రీ రామాలయం ఉన్నది. శ్రీ నూకాలమ్మ తల్లి ఆలయం కూడా ఉన్నది.

★

## చిన నందిపల్లె అగ్రహారం

**ఈ అగ్రహారం** విశాఖ జిల్లా దేవరాపల్లి మండల కేంద్రానికి తూర్పుదిశగా సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ అగ్రహారం జయపురం మహారాజా వారైన విక్రమదేవ వర్మ గారిచే బహూకరింపబడినది. మిగతా అగ్రహారాల బ్రాహ్మణుల వలెనే ఈ అగ్రహారీకులలో కొందరు కూడా ఉపాధి కోసం పొట్టలు చేత పట్టుకొని పట్టణాలకు పయనమయ్యారు. ప్రస్తుతం అతి తక్కువగా ఉన్న బ్రాహ్మణ కుటుంబాలలో అప్పల్ల కామేశ్వరరావు, కాశీవజ్ఝల కృష్ణశర్మ, నేమాని కామేశ్వరరావు, అమ్ముు వాసుదేవ దీక్షితులు వంటి వారు చెప్పుకోదగిన వారు.

ఈ అగ్రహారానికి చెందిన అమ్ము సర్వేశ్వరరావుగారు రాజమండ్రి ఫారెస్ట్ రేంజ్‌లో అకౌంట్స్ ఆఫీసరుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. వీరి కుమారులు అనంత పద్మనాభ శర్మ, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాదు శాఖలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. మరొక కుమారుడు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడ్డారు. ఇదే అగ్రహారానికి చెందిన బాలుడు కాశీవజ్ఝల రవికుమార్ కోయంబత్తూర్ ఆర్.ఎస్. పురంలో ఉన్న కామాక్షీ దేవి దేవాలయం వద్ద వేదపాఠశాలలో విద్యనభ్యసిస్తున్నాడు.

★

## చుక్కపల్లి

**ఈ అగ్రహారం** విశాఖ జిల్లా చీడికాడ మండలంలో ఉన్నది. చోడవరం నుండి ఖండేపల్లి మీదుగా తారువోలు వెళ్ళే మార్గంలో చోడవరానికి 5 కి.మీ.ల దూరంలో ఉన్నది. ఈ అగ్రహారాన్ని జయపురం సంస్థానాధీశుల సామంతులైన మాడుగుల పాలకులు బ్రాహ్మణ పండితులకు వారి పాండిత్య ప్రతిభను ప్రశంసించి దానంగా ఇచ్చారు.

ఒక కథనం ప్రకారం విశ్వభూపతిదేవ్ మహారాజుగారు వాసా తిరుపతి జోస్యుల వారికి, శుక్రుడు అనే కొండవాడు నివసించిన శుక్రపల్లి అనే ప్రాంతాన్ని దానంగా ఇచ్చారని తరువాత కాలంలో అదే చుక్కపల్లిగా మారినదని చెప్పుకుంటారు.

పాత లెక్కల ప్రకారం 600 సంవత్సరాల క్రితం వాసా తిరుపతి జోస్యుల వారికి 1431 ఎకరాల 24 సెంట్ల భూమిని గ్రహణ కాలమందు దానంగా ఇచ్చారు. గ్రహణ సమయమందు చేసే దానాలు రెట్టింపు ఫలితాలు ఇస్తాయని వీరు భావించారేమో! లేదా మోక్షప్రాప్తి కోసం అయినా గ్రహణ సమయమందు దానం ఇచ్చి యుండవచ్చు.

ఈ అగ్రహారానికి చెందిన మహా నిష్ఠ గల పండితులు అయిన వాసా పేరి శాస్త్రిగారిని ప్రముఖంగా చెప్పుకోవచ్చు. వారికి ఎంత శక్తి ఉండేదంటే "వర్షం పడుతుంది" అంటే వర్షం పడాల్సిందే! సూర్యోదయం కాకపోతే సంధ్యావందనం చేయలేని పరిస్థితి ఈయనకి ఏర్పడితే ఉపవాసం ఉండేవారు.

దూర్వాసుల మీనయ్య శాస్త్రిగారిది కూడా ఈ అగ్రహారమే. ఈయన ప్రకృతి వైద్యంలో దిట్ట. ఈ అగ్రహారంలో రేగులగెడ్డవారు, యల్లాజోస్యుల వారు, పారుపూడివారు, వాసావారు, సూరికూచివారు మరియు జల్లేపల్లి వారు ప్రముఖ కుటుంబాలుగా ఉన్నాయి. వాసావారు, జల్లేపల్లి వారు ఉపాధ్యాయ వృత్తులలో రాణించారు. దూర్వాసుల వారు లాయర్లుగా ఉన్నారు. యల్లాజోస్యుల వారు వ్యవసాయంలో రాణించారు.

★

# దిబ్బిడి

**మొన్నమొన్నటి** వరకు చోడవరం తాలూకాలో ఒక గ్రామం. ఇప్పుడు బుచ్చెయ్యపేట మండలంలో ఉంది. చోడవరం -మాడుగుల మధ్య ఉండే రోడ్డుకు దక్షిణంగా వడ్డాది గ్రామం ఉంది. ఆ ఊరికి, ఈ రోడ్డుకి మధ్య శారదానది రెండవ పాయ. నది నుండి అనకాపల్లి తాలూకా కశింకోట వరకు ఉన్న రోడ్డులో వడ్డాది, దిబ్బిడి, కుంద్రం మొదలైన గ్రామాలు ఉన్నాయి. ఇందులో దిబ్బిడి ఆ జంక్షను నుండి సుమారు నాలుగు కిలోమీటర్లు. అప్పుడు, ఇప్పుడూ కూడా ఈ ప్రాంతంలో బుచ్చెయ్యపేటే పెద్ద గ్రామము. చోడవరం తాలూకా ఏర్పడక పూర్వం ఇది వీరవిల్లి తాలూకాలో ఉండేది. కాని అధికారులు క్యాంపులు వచ్చినప్పుడు సభలు చేసినా, బసలు చేసినా బుచ్చెయ్యపేటలోనే.

సుమారు 1790 ప్రాంతంలో ప్రఖ్యాత ఇంజినీర్ సర్ ఆర్థర్ కాటన్ బుచ్చెయ్యపేటకు మకాం వచ్చి దిబ్బిడి ద్వారా కొంతదూరం దక్షిణం వైపు ప్రయాణం చేస్తూ ఉండగా ఆయనకు ఒక సంగీతం వినిపించింది. బండి ఆపి పరిశీలించగా ఒక చెట్టు మీద ఇద్దరన్నదమ్ములు విస్తరాకులు కోసం ఆకులు కోసుకుంటూ కనిపించారు. వారే ఆ సంగీతం పాడారు. వాళ్ళను గుర్తుంచుకోమని తన బలగానికి చెప్పి దొరగారు బుచ్చెయ్యపేటకు తిరిగి వచ్చేశారు. తరువాత ఖాళీ చేసుకొని వారిని రప్పించుకున్నాడు. సంగీతం మళ్ళీ విన్నాడు. దానిని మెచ్చి ఆయన వారి పేర ఈ అగ్రహారం వచ్చేటట్లుగా అప్పటి జయపురం మహారాజా వారికి సలహా ఇచ్చారు. ఆవిధంగా ఏర్పడిన "దిబ్బిడి" అగ్రహారంలో ఆనాడు సుమారు అరవై బ్రాహ్మణ కుటుంబాలు ఉండేవి. ఆమంచి వారు, ఈమని వారు, అందరూ వెలనాటి వైదిక బ్రాహ్మణులు. వీరిలో ఆమంచి వారు అప్పటి పూర్వకాలంలో పంచాంగ కర్తలు. వారి శాస్త్రజ్ఞానానికి మెచ్చి అప్పటి పండితులు వారి ఇంటిపేరును శ్రీపాదవారుగా మార్చారు. క్రమంగా ఈ ఊరికి దొంతికుర్తివారు, నేరెళ్ళవారు చేరారు. వీరందరూ పాండిత్యం, వ్యవసాయం ఆధారంగా జీవనం సాగించిన వారు. నియమనిష్ఠలతో ఉండేవారు.

ఈ అగ్రహారంలో ప్రస్తుతం దొంతికుర్తి సన్యాసిరావుగారు, నేరెళ్ళ నాగ నరసింహ శర్మగారు మాత్రం ఉన్నారు.

సుమారు 120 ఏళ్ల క్రిందట ఈ ఊరిలో శ్రీపాదవారిది పెద్ద చెయ్యి. వెంకన్న

గారిది భారీ కుటుంబం. ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. వెంకన్నగారు జీవించి ఉండగానే తనతోబాటు పెద్ద కుమారుడైన సత్యనారాయణ (బాబులయ్య) గారిని ఉండమని, మిగిలిన నలుగురు కుమారులకు అనగా రామచంద్రయ్య, సుబ్బయ్య, కృష్ణమూర్తి, గంగాధరంగార్లకు వేరేవేరే ఇళ్లు కట్టించి భూములు పంచిపెట్టి ఎవరి సంసారాలు వారివిగా ఏర్పరిచారు. వీరిలో రెండవ ఆయన (రామచంద్రయ్య) తారువ అగ్రహారానికి, మిగిలిన ముగ్గురు కడపకు వలస పోయారు. వారి పేర ఉండిన భూములపైన, ఇళ్ళపైన అజమాయిషీ బాబులయ్యగారే నిర్వహించారు.

బాబులయ్యగారి కుమారుడు సత్యనారాయణ (1908) కడపలో పెరిగి, అక్కడే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించుకొని ఉన్నారు. ఇటు మంచి బోధనా శక్తిగల లెక్కల మాస్టరుగా, అటు కర్ర విరగక, పాము చావకా జాతకాలు చెప్పే జ్యోతిష పండితునిగానూ, అన్నిటికీ మించి మృదుభాషిగానూ ప్రఖ్యాతి చెందారు. ఈయన కుమారుడు సత్యనారాయణ ప్రస్తుతం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాలయంలో సేల్స్ మేనేజర్‌గా ఉన్నత పదవిలో ఉన్నారు. పెద్ద అల్లుడు భమిడిపాటి వేంకట రామమూర్తి కూడా అధ్యాపక వృత్తిలోనే లెక్కలు మాస్టరుగానే కొనసాగి రాష్ట్ర, జాతీయ స్థాయిలలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు పొందారు.

కడపకు వలస పోయినవారిలో సుబ్బయ్య గారికి వెంకన్న అనే కుమారుడు జన్మించారు. ఈయన వృత్తి చేత రైల్వేలో గుమస్తాగా చేసినా, ప్రవృత్తి చేత మంచి ఫోటోగ్రాఫర్‌గా ఖ్యాతి చెందాడు. అంతేకాక శాస్త్రీయం నుండి సినిమా పాట వరకు ఎంత లోతైన సంగీతాన్ని అయినా అంతటి ఆస్వాదనా శక్తితో ఆదరించగలిగిన వాడు. ప్రస్తుతం విశాఖపట్నంలో రెండు, మూడు సంగీత సంస్థలకు కార్యవర్గాలతో సేవ చేస్తున్నారు.

కడపకు వలసపోయిన వారిలో కృష్ణమూర్తిగారు ఇంజినీరు. వీరికి సంతతి లేదు. వెంకన్నగారినే మానస పుత్రుడుగా చూసుకున్నారు.

ప్రస్తుతం దిబ్బిడిలో శ్రీపాదవారి అనంతరం చేరిన దొంతికుర్తి వారు, నేరెళ్ల వారు మాత్రమే ఉన్నారు. వీరు ప్రధానంగా పురోహిత వృత్తిలో కొనసాగుతున్నారు.

★

## జగన్నాథ భూపాలపురం అగ్రహారం

**ఈ గ్రామం** చోడవరానికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది చీడికాడ మండలంలో చేరి ఉన్నది. ఈ గ్రామాన్ని మాడుగుల సంస్థానం వారు పండితులకు బహూకరించారు. ఒకనాడు ఈ గ్రామంలో 50 బ్రాహ్మణ కుటుంబాలు ఉండేవి. పట్టిశపు శ్రీరాములు గారు అనే ప్రసిద్ధ కవి ఉండేవారు. ఆయన చాలా పద్యకావ్యాలు వ్రాశారు. ఇక్కడ కనుకూరు వారు, దూర్వాసుల వారు, పట్టిశపు వారు, జోస్యుల వారు ప్రసిద్ధులు. రైతులకు భూమి సాగు హక్కు రావడంతో జరుగుబాటుకి లోటుకలిగి చాలా కుటుంబాల వారు వలస వెళ్ళిపోయారు. నిత్యం అన్నదానం చేసిన బ్రాహ్మణ కుటుంబాలు చివరకు దారిద్ర్యంతో ఊరు విడిచి వెళ్ళారు. ఎక్కువమంది విశాఖ వంటి పట్టణాలకి చేరుకున్నారు. అయితే ఆశ్చర్యపడవలసిన విషయం ఒకటి ఉంది. యాభై ఎకరాలలో ఒక సెంటు భూమి కూడా పోకుండా ఉన్న కుటుంబం కనుకూరు వారిది. ఆ కుటుంబంలో డా. శర్మగారు బి.హెచ్.ఎమ్.ఎస్. డాక్టరుగా వైద్యవృత్తి చేస్తున్నారు. దూర్వాసుల సుబ్బారావుగారు, వారి అపారమైన ఆస్తిలో చాలాభాగం పేదవారికి, కులవృత్తుల వారికి ఇళ్ళు కట్టుకోవడానికి ఉచితంగా ఇచ్చారు. దూర్వాసుల వారి పేరుని ఇప్పటికీ ఆ పేద ప్రజలు జ్ఞాపకం చేసుకుంటారు.

★

## కృష్ణరాయపురం అగ్రహారం (మేడపాటి అగ్రహారం)

**ఈ అగ్రహారం** విశాఖ జిల్లా పెందుర్తి మండల కేంద్రానికి దక్షిణదిశలో నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఈ అగ్రహారం "మేడపాటి" అనే ఇంటిపేరు గలవారికి విజయనగరం రాజులు బహూకరించినందున దీనికి మేడపాటి అగ్రహారం అని కూడా చెప్పుకుంటారు. గ్రామ రికార్డుల్లో మాత్రం కృష్ణరాయపురం అగ్రహారం అనే నమోదు అయి ఉన్నది.

మేడపాటి సన్యాసయ్యగారు, మేడపాటి బుచ్చయ్యగారు భూఖామందులుగా పేరుపడ్డారు. ఈ అగ్రహారంలో చాలాకాలం వరకు భూమి ఎవరి పేరున ఉన్నది వారికే ఉండేది. కాకపోతే దశాబ్దకాలం క్రిందట డిఫెన్స్ శాఖవారు భూమిని 'ఎక్విజిషన్' చేసుకొని, నష్టపరిహారం చెల్లించారు. అలా జరుగుట వలన బ్రాహ్మణ కుటుంబాలు చెల్లాచెదురైనాయి. ఒకనాడు ఈ అగ్రహారంలో పౌరోహిత్యం చేసి ప్రసిద్ధి చెందిన అందుకూరి వెంకటరావుగారు ఉండేవారు. వారి కుమారులు అందుకూరి సూర్యనారాయణ గారు కూడా పౌరోహిత్యం చేస్తున్నప్పటికీ పురోషోత్తమపురంలో నివసిస్తున్నారు. ఇచ్చట ఒకనాడు ఉన్నత కుటుంబాలుగా ఉండిన కుంచం వారు, అందుకూరి వారు, మేడపాటివారు పురుషోత్తమపురానికి సమీపంలో ఉన్న సేనాతివాని పాలెంలో వ్యవసాయం, పౌరోహిత్యం వంటి వృత్తులను చేస్తున్నారు.

నిర్ధారణగా చెప్పలేకపోయినప్పటికీ మేడపాటి వారు జ్యోతిషంలో ప్రతిభ గలవారుగా గుర్తించి విజయనగరం రాజులు ఈ అగ్రహారాన్ని బహూకరించి ఉండవచ్చు. అంతేగాక వేదపండితులు కూడా ఈ అగ్రహారంలో ఉండేవారు.

★

## మామిడిపల్లి అగ్రహారం

**ఈ అగ్రహారం** దేవరాపల్లి-చోడవరంకు గల బస్‌రూట్‌లో తారువకు దక్షిణ దిశగా 2 కి.మీ.ల దూరంలో ఉంది. మాడుగుల ఎస్టేట్ వారు గరిమెళ్ళ చక్రవర్తిగారికి పంచాంగకర్తలుగా గుర్తింపుకోసం ఇచ్చారు. వీరికి 'షడాగమ చక్రవర్తి' అనే బిరుదు ఇచ్చారు. వీరు ఆస్థాన జ్యోతిషులుగా ఉండేవారు.

వీరికి దానంగా 525 ఎకరాలు ఇచ్చారు. పల్లం 300 ఎకరాలు, మెరక 225 ఎకరాలు. ఆ రోజులలో 25 బ్రాహ్మణ కుటుంబాలు ఉండేవి. ప్రస్తుతం ముత్యం వారు పాకలవారి కుటుంబాలు రెండు మాత్రమే ఉన్నవి. ఒకరు పురోహితులు కాగా, మరొకరు బ్రాంచి పోస్టుమాస్టరుగా ఉన్నారు.

ఈ అగ్రహారానికి చెందిన రెండు కుటుంబాలు లండన్‌లో ఉన్నవి. వీరిలో ఒకరు వైద్యునిగా ఉన్నారు.

★

# పెదనందిపల్లె అగ్రహారం

**ఈ అగ్రహారం** విశాఖ జిల్లా దేవరాపల్లి మండల కేంద్రానికి తూర్పుదిశగా ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఈ అగ్రహారం మాడుగుల సంస్థానాధీశులు కృష్ణభూపతి వర్మగారిచే బహూకరింపబడినది. ఇది 60 ఇళ్ల అగ్రహారం. కాలక్రమేణా వలసల కారణంగా బ్రాహ్మణ కుటుంబాలు తగ్గిన మాట వాస్తవం. కొందరు బ్రాహ్మణ ప్రముఖులు ఈ అగ్రహారంలో ఉండేవారు.


బోడెన్నదొర అనే పాలెగాడికి పెదనంది, చిన నంది అనే కుమారులుండేవారు. వీరి పేర్లతో ఈ రెండు అగ్రహారాలు ఉండడం గమనించదగ్గ విషయం. చిననందిపల్లెలో బోడెన్నదొర పేరున ఒక చెరువు త్రవ్వించారు. కాలక్రమేణ అది "బోడి చెరువు"గా మారింది.

బోడెన్న దొర భార్య భామ పేరున ఒక చెరువు త్రవ్వించారు. అదే భామసాగర్. తదుపరి కాలంలో మాడుగుల సంస్థానంలో కలిసిపోయింది. ఇచ్చట శ్రీ సత్యనారాయణ మూర్తి దేవాలయం ఉన్నది. ఓరుగంటి సోమన్నగారు ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈ గ్రామంలో ప్రతి సంవత్సరం జనవరి 23, 24 తేదీల్లో తీర్థం జరుగుతుంది. ఈ అగ్రహారంలో శివాలయం కూడా ఉంది. నారాయణం భజే అను స్వాముల వారు వంద సంవత్సరాల క్రితం శివలింగాన్ని ప్రతిష్ఠించారు. అయితే అది జీర్ణస్థితికి చేరుకోవడంతో భక్తుల సహకారంతో ధవళ చిరంజీవిగారు 30-4-2004న పునః ప్రతిష్ఠ గావించారు. శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామివార్ల కళ్యాణం ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ ఏకాదశి రాత్రి జరుగుతుంది. శివకేశవులు ఒకరేనన్న భావన ఈ అగ్రహారస్థుల్లో స్పష్టమవుతుంది.

ఈ అగ్రహారంలో రాష్ట్రపతి అవార్డులను అందుకున్న ప్రముఖులు పేరి వెంకటశాస్త్రిగారు, పేరి సూర్యనారాయణ శాస్త్రిగారు. సూర్యనారాయణ శాస్త్రిగారు సంస్కృత మహాపండితులు, వేదవేదాంగ పారంగతులు, మంత్రశాస్త్ర కోవిదులు. ఈ అగ్రహారానికి చెందిన పేరివారు, ఓరుగంటి వారు ఉద్యోగాల రీత్యా విదేశాల్లో స్థిరపడ్డారు. జర్మనీలో ప్రొఫెసర్‌గా పనిచేసిన పేరి సర్వేశ్వర శర్మగారు ఈ అగ్రహారానికి చెందినవారే. ప్రముఖ పండితుడు కీ.శే. టి.వి. నరసింహం గారి కుమారులు తాతా జగన్నాథరావు గారు ఈ ప్రాంతం వారే. ఈయన లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో డెవలప్‌మెంట్

ఆఫీసర్‌గా, ప్రేమ సమాజం సభ్యులుగా ఉన్నారు. పేరి మల్లికార్జున స్వామి (ఉరఫ్ భీముడు పంతులు) గారు పురోహితులుగా ఉన్నారు.

పై విషయాన్ని ఓపిగ్గా చెప్పిన వ్యక్తి ధవళ చిరంజీవి గారు. ఈయన పోస్ట్ మాస్టర్‌గా ఉపాధ్యాయులుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. వివరాల కోసం వెళ్ళిన నన్ను సాదరంగా ఆహ్వానించి, ఆతిథ్యమిచ్చి సమాచారాన్నిచ్చిన ఉపకారి.



శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయం

★

# పోచినపెద్ది అగ్రహారం

**ఈ అగ్రహారం** విశాఖ జిల్లా మాకవరపాలెం మండలంలో ఉన్నది. మండల కేంద్రానికి దక్షిణదిశగా రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఈ అగ్రహారం మాకవరపాలెం నుండి సర్పానది దాటిన తరువాత ఉన్నది. ఈ అగ్రహారం భూమి విస్తీర్ణం సుమారు 200 ఎకరాలు. ఈ అగ్రహారాన్ని పెద్దాపురం వత్సవాయి రాజవంశస్తులు వేద పండితులైన తూములూరి గురవప్పగారికి బహూకరించారు. అప్పట్లో ఇది 30 ఇళ్ళ అగ్రహారం. ఈ అగ్రహారంలో జన్మించిన కొౖట సూరావధానులు తిరుమల తిరుపతి దేవస్థానంలో వేద పండితులుగా పనిచేశారు. దీనివలన అవధాన్లు గారికి తిరుమల తిరుపతి దేవస్థానం వారు జీవితకాల పెన్షన్ ఇచ్చారు. అంతేగాక ఘనసన్మానం కూడా చేశారు.

ఈ అగ్రహారంలో కొౖట పార్వతీశం గారు కొౖట సూరావధానులు గారు ఇద్దరూ ఘనాపాఠీలే. అప్పట్లో ఈ అగ్రహారంలో పోచినపెద్ద రామశాస్త్రిగారు గొప్ప వేదపండితులు. ఈయన సంస్కృతంలో అందెవేసిన చేయి. పెద్దాపురం ఆస్థానంలో తూములూరి గురవప్పగారు వేదపండితులుగా పనిచేశారు.

ఈ అగ్రహారంలో ఉన్న శివాలయం చుట్టుపట్ల ఉన్న దేవాలయాల కన్నా పెద్దది. ఇచ్చట శివలింగం కూడా పెద్దదే. ఈ శివలింగం సుమారు 200 సంవత్సరాల నుండి ఉందని స్థానికులు చెబుతారు.

స్థానికుల కథనం ప్రకారం ఈ అగ్రహారంలో ప్రతి సంవత్సరం అగ్ని ప్రమాదాలు సంభవిస్తూ ఉండేదని అందుచేత నివారించడం కోసం ధ్వజస్తంభం నిర్మించారని చెబుతారు.

ఇచ్చట పోచినపెద్ది వారేగాక, వీటూరి వారు, కేతవరపు వారు, కోటమర్తి వారు, కొౖటవారి కుటుంబాలు ప్రస్తుతం ఉన్నవి. ప్రస్తుతం ఈ అగ్రహారంలో పదకొండు బ్రాహ్మణ కుటుంబాలు ఉన్నవి. వీరిలో ఆర్థికంగా స్థిరపడినవారు శ్రీ పోచినపెద్ది సత్యసాయి కుమారుగారు. ఈయన సౌదామిని ఎర్త్‌మేకర్స్ సంస్థలో అధిపతిగా నర్సీపట్నంలో స్థిరపడ్డారు.

★

# పైడివాడ అగ్రహారం

**ఈ అగ్రహారం** విశాఖపట్నం జిల్లా సబ్బవరం మండల కేంద్రానికి దక్షిణదిశగా ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. స్థానికంగా కథనం ప్రకారం ఈ అగ్రహారంలో పాడి సంపద అధికంగా ఉండడం వలన పాడివాడ అనేవారు. ఉచ్చారణా విపరిణామం వలన ఇది పైడివాడగా మారింది. ఇది ఒకనాడు 40 ఇళ్ల అగ్రహారం. ఈ అగ్రహారాన్ని వేదపండితులైన రాయప్రోలు జగ్గన్నగారికి విజయనగరం మహారాజులు దానంగా ఇచ్చారు. భూమి విస్తీర్ణం 100 ఎకరాలు.

అప్పట్లో భమిడిపాటివారు, కొట్రవారు, కందర్పవారు, దంతుర్తివారు, పసరకొండవారు ప్రముఖ కుటుంబాలుగా ఉండేవారు. కొట్ర సూర్యావధాన్లు గారు కొట్ర బుల్లిబాబుగారు వేదపండితులుగా ప్రసిద్ధి గాంచారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు వీరికి వార్షిక పారితోషికాలు ఇచ్చేవారట. దంతుర్తి కాశీ విశ్వనాథం గారు పౌరాణిక నాకట కళాకారుడు. వీరికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి "కళాకారుల భృతి" వచ్చేది.

ప్రస్తుతం పౌరోహిత్యం చేస్తున్న దంతుర్తి వరాహ వెంకట సుబ్రహ్మణ్య శర్మగారి ముత్తాత అయిన దంతుర్తి వెంకయ్యగారు ఎంతటి విషసర్పాన్ని అయినా సరే తన మంత్రబలంతో కట్టేసేవారట. పాముకాటుకి గురి అయిన ఎందరో వ్యక్తులను ఈయన ఒక విలక్షణమైన రీతిలో మంత్రించి ప్రాణాలను కాపాడేవారట. పాము కరిచిందని ఎవరైనా సమాచారం తెస్తే వారిని ఒక దెబ్బ కొట్టేవారట. దానితో పాముకాటుకి గురైన వ్యక్తి ఎచ్చట ఉన్నా, అక్కడ లేచి కూర్చొనేవాడట. ఈ పద్ధతిని ఆనాటి వారు "లెంపకాయ మంత్రం" అని పేర్కొనేవారు.

ప్రస్తుతం బ్రాహ్మణ కుటుంబాలు మూడు మాత్రమే ఉన్నాయి. దంతుర్తి వారు, పసరకొండవారు, కొట్రవారు "తెలగాణ్యులు" అనే శాఖవారు.

ఇచ్చట శ్రీ రామాలయం, శ్రీ కనకదుర్గ ఆలయం ప్రాచీన ఆలయాలు. రామాలయాన్ని ఒకనాటి బ్రాహ్మణులు కట్టించగా, పునరుద్ధరణ బాధ్యతలు మాత్రం గ్రామస్థులు చేపట్టారు. కనకదుర్గ ఆలయం గురించి ఒక గాథ ఉంది.

1965-66 ప్రాంతంలో ఈ ప్రాంతానికి ఒక సాధువు వచ్చాడట. ఇచ్చట నెలరోజుల పాటు బసచేసి, భక్తులకు అనారోగ్యంగా ఉంటే స్వస్థత చేకూర్చాడట. ఇతను కొబ్బరికాయలను తలపై కొట్టేవాడట. అదీ బట్టతలపైన కావడం విశేషం.

ఒకరోజు ఆయన వద్దనున్న ఒక మహిమగల రాయిని ఇస్తూ "మీకు శక్తిని ఇస్తున్నాను. దీనిని కాపాడుకోండి! మీకు మేలు జరుగగలదు" అని చెప్పాడట. ఆ శక్తి ప్రస్తుతం కనకదుర్గ ఆలయంగా ఇప్పటికీ పూజలు అందుకుంటూ ఉంది. నాటినుండి శివరాత్రి (అమావాస్య) ముందు వచ్చే గురువారం ఈ అమ్మవారికి విశేష పూజలు, పండుగ వైభవంగా జరుపుతున్నారు.

పై ఆలయాలే గాక ఈ అగ్రహారానికి దక్షిణ దిశలో శ్రీ ముత్యాలమ్మ గుడి ఉంది. ఇది చాలాకాలం నాటిది. పశ్చిమదిశలో నూకాలమ్మ, దుర్గాలమ్మ అనే గ్రామ దేవతలు కొలువై ఉన్నారు.

ప్రముఖ మంత్రద్రష్టలుగా పేరుపడిన దంతుర్తి వెంకయ్యగారి ముని మనుమడు, ప్రస్తుతం పురోహితులుగా ఉన్న దంతుర్తి వరాహ వెంకట సుబ్రహ్మణ్య శర్మగారు పై వివరాలను తెలిపారు.

★



పైడివాడ అగ్రహారం కోవిలలోని ముత్యాలమ్మ

# రామయోగి అగ్రహారం

**ఈ అగ్రహారం** విశాఖ జిల్లా కె. కోటపాడు మండలంలో ఉన్నది. మండల కేంద్రానికి ఉత్తర దిశగా పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఈ అగ్రహారాన్ని విజయనగరం రాజులు బ్రాహ్మణ పండితులకు దానంగా ఇచ్చారు. ఒకనాడు ఇది 40 ఇళ్ల అగ్రహారం. ప్రస్తుతం 10 ఇళ్ళు (బ్రాహ్మణ కుటుంబాలు) మాత్రమే ఉన్నవి. అగ్రహార భూమి విస్తీర్ణం 350 ఎకరాలు. ఈ అగ్రహారం పురోహితులకు, పంచాంగకర్తలకు ప్రసిద్ధి. ఇచ్చట మండావారు, రాణీవారు, భాగవతులవారు ఉన్నారు.

ఇచ్చట రామాలయం, సూర్యనారాయణ మూర్తి ఆలయం, సంపత్ వినాయక ఆలయం మరియు శ్రీ ఆంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి. ఇచ్చట మండా లక్ష్మీనరసింహం గారు సుదీర్ఘకాలం సర్పంచ్‌గా పనిచేశారు. మండా రమణయ్యగారు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మేనేజర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. మండా గౌరీశంకర్ గారు కూడా స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. వీరి ఇద్దరి అబ్బాయిలలో ఒకరు అమెరికాలో, వేరొకరు లండన్‌లో ఇంజినీర్లుగా ఉన్నారు. మండా బాబ్జీగారు రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి. వీరి కుమారుడు విశాఖపట్నంలో టెలిఫోన్ శాఖలో పనిచేస్తున్నారు.

చల్లా సత్యనారాయణ మూర్తిగారు ప్రస్తుతం సర్పంచ్‌గా పనిచేస్తున్నారు.

★

# సంగివలస

**ఒకనాడు** ఇది అరవై బ్రాహ్మణ కుటుంబాలతో, రెండువందలకు పైగా ఇతర కులాల కుటుంబాలతో విలసిల్లిన గ్రామం.

ఈ అగ్రహారపు ముఖ్య ఇనాందార్లు గరిమెళ్ళవారు, తాడేపర్తివారు, విశ్వనాథ వారు, చిందూరివారు. పాండిత్యం చేత, వ్యవహార దక్షత చేత రాణించిన ఈ బ్రాహ్మణ కుటుంబాలకు 1790 ప్రాంతంలో ఈ అగ్రహారాన్ని విజయనగరం మహారాజులు ఇచ్చారు.

ఈ ఊరు (మద్రాసు-కలకత్తా) గ్రాండ్ నార్దర్న్ ట్రంక్ రోడ్డు (ఇప్పుడు ఐదవ నెంబరు జాతీయ రహదారి)లో తగరపువలసకు దక్షిణంగా సుమారు ఒక కిలోమీటరు దూరాన ఉంది. గ్రామకంఠం రోడ్డుకి ఒక ఫర్లాంగు పడమటగా ఉంది. సాగుకీ, దాహానికీ ఆధారంగా ఊరికి ఉత్తరాన ఒక చెరువు ఉంది. చెరువుకి మరింత ఉత్తరంగా 'గోస్తని' నది ఉంది. ఒకప్పుడు ఇది జీవనదే.

జాతీయ రహదారి నుండి ఈ ఊరిలోకి తోవ చేసిన జంక్షన్ దగ్గిర ఒక ప్రమాదకరమైన మలుపు ఉంది. దుర్గాలమ్మ గుడి, ఉమా రామలింగేశ్వర ఆలయం ఉన్నాయి. ఈ ఆలయాలకు ప్రస్తుతం డాక్టరు తాడేపర్తి సుబ్రహ్మణ్య దయాళ్ గారు ముఖ్య ధర్మకర్తగా ఉన్నారు. వీరు ఈ ఆలయం వ్యవస్థాపకులైన వెంకట లక్ష్మీనరసింహం గారి మూడవ కుమారుడు. దయాళ్‌గారు విశాఖపట్నం కింగ్‌జార్జి ఆస్పత్రిలో ప్రధాన ఎనస్తిటిస్ట్‌గా పనిచేసి ఇటీవలే రిటైర్ అయ్యారు. ఈ జనార్దన స్వామి గారికి ఐదుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు కలిగారు. వీరిలో జ్యేష్ఠురాలు యేచూరి సీతమ్మ(80) నుండి కనిష్ఠుడు సత్యమూర్తి (55) వరకు అందరూ నేటికీ సజీవులై స్థితిమంతులై ఉన్నారు. ఈ ఇంటి ఆడపడుచు శ్రీమతి తనికెళ్ళ రాజరాజేశ్వరి సంగీత సాహిత్య అభిమాని, గాయని.

ఈ ఊరిని గ్రాండ్ ట్రంక్ రోడ్డుకి కలిపే జంక్షన్ మలుపు దగ్గిర ఒకప్పుడు మూడేసి రోజులకొక లారీ ఏక్సిడెంట్ జరిగేది; ఒకరో ఇద్దరో మృతి చెందేవారు కూడా. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అయిన లక్ష్మీనరసింహంగారి సోదరుడు తాడేపర్తి జనార్దన స్వామి (1902-69). సంగివలస కాపురస్తుడు. విజయనగరం సంస్థాన సంబంధమైన వ్యాజ్యాలలో వ్యవహర్తగా కూడా రాణించిన ఈయన 1969లో ఈ జంక్షన్ దగ్గిరే లారీ ఏక్సిడెంట్ వలననే చనిపోయాడు.

లారీల వేగాన్ని అదుపు చేయించడం అనే అసలు ఉద్దేశానికి అమ్మవారి



సంగివలప వద్దమన్న పోలమాంబ గుడి

ఆరాధన అనే బహిస్సంకల్పాన్ని జోడించి ఈ జంక్షన్ దగ్గిరలో గ్రామస్థులలో ఉండిన మేధావులూ ప్రయోజకులూ సమాజ శ్రేయోభిలాషులూ "దుర్గాలమ్మ గుడి"ని నిర్మింప జేసేరు. లారీలను, ఇతర వాహనాలను అక్కడ ఆపుకొని అమ్మవారికి పత్రం, పుష్పం ఫలం, తోయం సమర్పించకపోయినా అమ్మవారి పాదస్థ కుంకుమను స్వీకరించడం ఒక అలవాటుగా సంప్రదాయంగా స్థిరపడడం వల్ల ఏక్సిడెంట్లు తగ్గిపోయాయి. రోడ్డు మలుపు వద్ద ఆలయం అనే ఆలోచన 20వ శతాబ్దం మొదట్లో తాడేపర్తి వీరావధానులుగారికి కలిగి, ప్రతిష్టాపన కూడా జరిగింది.

పాతకాలంలో గరిమెళ్ళ జగన్నాథ సోమయాజులు గారు, ద్వాదశి ఉమా మహేశ్వరం గారు, ద్వాదశి అప్పల నరసింహంగారు పౌరోహిత్యం చేసేవారు. వారి మనుమలు విశ్వనాథం, ఉమా మహేశ్వరం, రామంగార్లు ప్రముఖ వేద పండితులుగా పురుషోత్తమపురంలో ఉంటున్నారు. విశ్వనాథ నరసింహమూర్తి గారు షిర్డీ సాయిబాబా ఆలయంలో పౌరోహిత్యం చేస్తున్నారు. ఇక్కడ ముగ్గురు అమ్మవార్లున్న దుర్గాలమ్మ పోలమాంబ దేవాలయంలో కూడా ఏడిద రామకృష్ణగారు అర్చకులుగా ఉన్నారు. ఈ ఊళ్ళో ప్రస్తుతం పది బ్రాహ్మణ కుటుంబాలున్నాయి. భుక్తికి లోపం లేదు. ఈ ఆలయం వార్షిక ఆదాయం రూ. 25,000 దాటి ఉంది. భూవసతి సుమారు ఏడు ఎకరాలు.

ఇక్కడ ఉన్న శివాలయం చాలా పురాతనమైనది. దీనిని 18వ శతాబ్దంలో నిర్మించారని చెప్పుకుంటారు. (ఈ దేవాలయానికి ఉత్తర దిశగా కొంతదూరంలో గోస్తనీ నది ఉంది.)

★

# సౌభాగ్యరాయపుర అగ్రహారం

**ఈ అగ్రహారం** పెందుర్తికి తూర్పుదిశలో ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్నది. బ్రాహ్మణ పండితుల పాండిత్య ప్రతిభలకు మెచ్చి విజయనగరం మహారాజులు దానంగా ఇచ్చారు. మొత్తం వెయ్యి ఎకరాలకు పై మాటేనని చెప్పుకుంటారు. ఒకనాడు ఇది 60 ఇళ్ళ అగ్రహారం. నేడు 15 బ్రాహ్మణ కుటుంబాలు మాత్రమే ఉన్నవి. వీరంతా పౌరోహిత్యంలో, ఉద్యోగాలలో ఉన్నారు.

ఇక్కడి పెద్దలు చెప్పిన కథనం ప్రకారం సౌభాగ్యుడు అనే వ్యక్తి పేరున ఈ అగ్రహారానికి సౌభాగ్యపురం అనే పేరు వచ్చిందని. ఈ ప్రాంతంలో పేరివారు, వడ్లమాని వారు, అయ్యల సోమయాజుల వారు, నూకలవారు, వేదుల వారు, కేశానపల్లి వారు ఉండేవారు.

కేశానపల్లి కాళిదాసు పంతులుగారు బ్రిటీష్ వారి హయాంలో కలెక్టరుగా పనిచేశారు. కాళిదాసుగారి కుమారుడు నరసింహరావు గారు కొంతభూమిని దానం చేశారు. దానిలో కొంతభాగం రైతులకు చెందినది. మరికొంత భాగంలో మాత్రం ఒక నివాస గృహాల కాలనీ నిర్మించారు. దానికి కాళిదాస్‌నగర్ అని పేరు పెట్టారు.

ఇచ్చట ప్రస్తుతం వేదపండితులు ఎవరూ ప్రముఖంగా లేనప్పటికి, ఒకనాడు మాత్రం గొప్ప వేదపండితులు ఉండేవారని తెలుస్తూంది. ప్రస్తుతం ఇక్కడ ఉన్నవారిలో వడ్లమాని శ్రీరామమూర్తిగారు కురువృద్ధులు. వివిధ వృత్తుల మీద, వ్యావృత్తుల మీద ఈ గ్రామం నుండి వలసపోయిన వారందరు ఆయన బంధువులేనని తెలిసింది. వీరిలో కొందరు పురాణాలు, హరికథలు చెప్పేవారు.

ఈ అగ్రహారంలో నివాసుల దాహార్తి నివృత్తికి గాను ఇద్దరు వ్యక్తులు రెండు మంచినీటి చెరువులను త్రవ్వించారు. అవి "విస్సన్నబంద", "సాహెబ్‌రాయుడి చెరువు". ఇవి ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నవి. ఈ అగ్రహారానికి తూర్పుదిశలో బ్రాహ్మణ కోనేరు ఉంది. ఇది కూడా ఇప్పుడు ప్రజలకు ఉపయోగపడడం లేదు.

ఇచ్చట శ్రీ రామాలయం ఉంది. శ్రీ బంగారమ్మతల్లి, శ్రీ మర్లమాంబ, శ్రీ పైడితల్లమ్మ, శ్రీ పోలమాంబ, శ్రీ భూలోకమ్మ అను గ్రామదేవతల ఆలయాలు ఈ అగ్రహారంలో ఉన్నాయి

ఈ అగ్రహారానికి చెందిన చాలామంది ఉద్యోగరీత్యా వలస వెళ్ళారు. ప్రస్తుతం వడ్లమానివారు, ఆర్యసోమయాజులవారు, అయ్యగారి వారు, అయ్యల సోమయాజుల వారు, వేదుల వారు ఈ అగ్రహారంలో ఉన్న ముఖ్య కుటుంబాలు.

★

## తారువ అగ్రహారం

**ఈ అగ్రహారం** దేవరాపల్లి మండలంలో ఉన్నది. దేవరాపల్లి నుండి చోడవరం వెళ్ళేదారిలో ఉన్నది. దేవరాపల్లి నుండి ఎనిమిది కిలోమీటర్లు. చోడవరం నుండి 16 కిలోమీటర్లు. ఈ అగ్రహారం మాడుగుల సంస్థానాధీశులచే జ్యోతిషంలో అందెవేసిన చెయ్యి అయిన జక్కనపల్లి సీతారామయ్యగారికి బహూకరించారు. ఒకసారి యుద్ధానికి జయప్రదమైన ముహూర్తం పెట్టినందుకు ఈ అగ్రహారం ఇవ్వబడినది. ఈ అగ్రహారానికి దానంగా ఇచ్చిన భూమి 1444 ఎకరాలు.

ఆ రోజులలో 28 కుటుంబాలు ఉండేవి. వారిలో జక్కనపల్లివారు, భమిడిపాటి వారు ముఖ్యులు. ప్రస్తుతం మూడు కుటుంబాలు ఉన్నవి. భమిడిపాటివారు, వడ్లమాని వారు, కాశీవజ్ఝలవారు ఉన్నారు. భమిడిపాటి వారి కుటుంబాలలో కొందరు ఆస్ట్రేలియా, వడ్లమాని వారి కుటుంబాలలో కొందరు అమెరికా వెళ్ళారు. ఇప్పుడు జీవిస్తున్న వారి వృత్తులలో భమిడిపాటి వారు వ్యవసాయం, కాశీవఝుల వారు పౌరోహిత్యం, వడ్లమాని వారు....

ఈ అగ్రహారానికి నీటి వనరులు శారదానది సమకూరుస్తున్నది. మొత్తం భూమిలో 700 ఎకరాలు పల్లం, 500 ఎకరాలు మెరక, పోరంబోకు 244 ఎకరాలు ఈ అగ్రహారానికి ఇచ్చిన భూమిలో ఉన్నవి.

ఈ అగ్రహారంలో ప్రసిద్ధమైన కుటుంబం భమిడిపాటివారిది. వారికి మూల పురుషుడు భమిడిపాటి కామయ్య భుక్తగారు. ఈయన కరణీకం చేసేవారు. ఆయన కుమారుడు భమిడిపాటి సత్యనారాయణ. ఆయన కొడుకు విశ్వేశ్వరరావు. వీళ్ళంతా కరణీకం చేసేవారు. విశ్వేశ్వరరావు తమ్ముళ్ళు నారాయణ మూర్తి, కామేశ్వరరావు గార్లు. నారాయణరావుగారు దక్షిణ మధ్య రైల్వేలో అసిస్టెంట్ ఇంజినీరుగాను, కామేశ్వరరావుగారు మెడికల్ రిప్రజెంటేటివ్‌గాను పనిచేశారు. విశ్వేశ్వరరావుగారికి ఏడుగురు కుమారులు. అందులో పెద్దవాడు భమిడిపాటి సత్యనారాయణ వుడా వైస్ ఛైర్మన్‌కు పర్సనల్ అసిస్టెంట్‌గా ఉన్నారు.

★

# తునివలస అగ్రహారం

**ఈ అగ్రహారం** పద్మనాభం మండలంలో ఉంది. పద్మనాభానికి అయిదు కిలో మీటర్ల దూరంలో ఉన్నది. దానికి దగ్గరగా రెడ్డిపల్లి అగ్రహారం కూడా ఉన్నది. తునివలసలో ఒకనాడు సుమారు 40 బ్రాహ్మణ కుటుంబాలుండేవి. ప్రస్తుతం 12 మాత్రమే ఉన్నవి.

ఇచ్చట ప్రముఖులు రాచకొండ అప్పల నరసింహమూర్తిగారు. ఆయన ఎం.పి.టి.సి. సభ్యులు. బ్రాహ్మణేతరులు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో అప్పల నరసింహమూర్తిగారు ఎం.పి.టి.సి. సభ్యులుగా ఎన్నిక కావడం విశేషం. రాచకొండ శివరామశాస్త్రిగారు ఈ అగ్రహారానికే చెందిన మరో ప్రముఖ వ్యక్తి. ఈయన వేద పండితులుగా ప్రసిద్ధికెక్కారు. మిగతా అగ్రహారాల కుటుంబాల వలెనే ఈ ప్రాంతం వారు కూడా పట్టణాలకు వలస వెళ్ళారు. పట్టణాలకు వెళ్ళి బాగా స్థిరపడిన వారిలో దేవరకొండవారు చెప్పుకోదగినవారు. వీరంతా విశాఖపట్టణంలో స్థిరపడ్డారు.

రాచకొండవారు, భమిడిపాటివారు, మనుసూరివారు, గంగవరపువారు, జయంతివారు ఈ ప్రాంతంలో ఇప్పటికీ ఉన్నారు. ఈ అగ్రహారం శ్రీ అనంత పద్మనాభ స్వామి క్షేత్రమైన "పద్మనాభం" గ్రామానికి దగ్గరగా ఉంది.

రెడ్డిపల్లి అగ్రహారంలో బ్రాహ్మణ కుటుంబాలు దాదాపు లేనట్లే. ఈ గ్రామంలో ఎక్కువగా ఉన్నవారు తెలగజాతి వారు. ఈ రెడ్డిపల్లికి అగ్రహారం అనే పేరు రావడానికి కారణం ఒక కథ ఉంది.

1759లో ఈస్ట్ ఇండియా కంపెనీకి, విజయనగరం మహారాజైన రెండో విజయరామరాజుకి జరిగిన చారిత్రాత్మక పద్మనాభ యుద్ధంలో ఈ తెలగజాతి వారు విజయరామరాజు సైన్యంలో ఉండి పోరాడి, త్యాగాలు చేసిన కారణంగా విజయరామ రాజు వారసులు ఈ గ్రామాన్ని తెలగజాతి వారికి బహూకరించారని అప్పట్లో ఈ తెలగ కులస్థులను రెడ్లు అనేవారని స్థానికులు చెప్పే కథనం.

★

# వీరవిల్లి

**19వ శతాబ్దం** నాటి విశాఖపట్నం జిల్లాలో గొలుగొండ, రాయవరం, మాడుగుల, ఎలమంచిలి, చోడవరం, కోటపాడు అన్నీ విడివిడి తాలూకాలు. కాలక్రమంగా ఇవి చోడవరం, ఎలమంచిలి తాలూకాలుగా ఏకీకృతం చేశారు. (ఈ మధ్య మండలాలుగా మళ్ళీ విడగొట్టారు. అది వేరే సంగతి).

అలనాటి వీరవిల్లి ప్రాథమికంగా బ్రాహ్మణ అగ్రహారం. మాడుగులకు పడమటగా ఉన్న తూర్పు కనుమల శ్రేణి నుండి వాగుగా ప్రవహించి వచ్చిన శారదా నది రెండవ పాయకు ఉత్తర భూఖండికలో ఉన్న వీరవిల్లి వడ్డాది-మాడుగుల రోడ్డుకు ఇంచుమించు ఆనుకొని ఉంది. వీరవిల్లి అగ్రహారంతో పాటు దీనికి కొద్ది కొద్ది దూరాలలో ఉన్న భాగవతుల అగ్రహారం, గొటివాడ అగ్రహారం, లక్ష్మీపురం అగ్రహారం, కొండపాలెం అగ్రహారం ఇవన్నీ 18వ శతాబ్దంలో జయపురం మహారాజావారు ఈ బ్రాహ్మణులకు ఇచ్చిన ఇనాములు. అయితే వీరవిల్లి, కొండపాలెం గ్రామాలలోని వారు తప్పా మిగిలిన అగ్రహారాలలో బ్రాహ్మణులు ఎక్కడెక్కడికో వలసలు పోయారు.

పైన చెప్పిన చిన్న చిన్న తాలూకాలు రద్దుకాక పూర్వం వీరవిల్లిలో తాలుకా ఆఫీసుతో బాటు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు కూడా ఉండేది. ఆనాడు 60 బ్రాహ్మణ కుటుంబాలతో కళకళలాడిన వీరవిల్లి అగ్రహారంలో ప్రస్తుతం నాలుగు బ్రాహ్మణ కుటుంబాలు మాత్రమే ఉన్నాయి.

కొండపాలెం అగ్రహారలో ఉన్న నూకాలమ్మ దేవాలయానికి ఇప్పటికీ బ్రాహ్మణులే ట్రస్టీలుగా ఉన్నారు.

వీరవిల్లి అగ్రహారంలో ప్రస్తుతం ఈశ్వర వారు, గుంటూరు వారు మాత్రమే ఉన్నా, అలనాడు వంక వారు కూడా ఉండేవారు. వీరిలో ఎక్కువమంది ఆయుర్వేద, వైద్య అనుష్ఠానం సాగించారు. వంక దక్షిణామూర్తి అనే పేరు 1955 వరకు ఈ ప్రాంతమంతటా ప్రసిద్ధి. ఈ అగ్రహారం నుండి పట్టణాలకు విద్యాభ్యాసం కోసం చేరిన వారిలో ప్రొఫెసర్ దశిక వెంకట రమణారావు గారు, డా॥ దశిక శ్రీకాంత్ గారు ఎన్నికైనారు. వెంకటేశ్వర్లు, తమ్ముడు, మరికొందరు విదేశాంధ్రులుగా స్థిరపడి ఉన్నారు.

★

## వెదురుపర్తి అగ్రహారం

**ఈ అగ్రహారం** విజయనగరం మహారాజావారిచే బహూకరించ బడినది. ఇది కశింకోట మండలంలో ఉంది. కశింకోట మండలానికి ఆగ్నేయదిశలో మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నది. అప్పట్లో 50 బ్రాహ్మణ కుటుంబాలు ఈ అగ్రహారంలో ఉండేవి. ప్రస్తుతం 13 బ్రాహ్మణ కుటుంబాలున్నవి. ఈ అగ్రహారంలో ప్రముఖ పండితులుగా కొడుకుల సుబ్బారావుగారు కొడుకుల విశ్వేశ్వరరావుగారు ఉండేవారు. అగ్రహార భూముల విస్తీర్ణం 1000 ఎకరాలు. మెట్టు 500 ఎకరాలు. ఇచ్చట ప్రజలు ఎక్కువగా పౌరోహిత్యం చేసేవారు. ఇక్కడి శ్రీ రామలింగేశ్వర ఆలయం ప్రసిద్ధి గాంచినది. చాలామంది అగ్రహారీకులు అనకాపల్లి, విశాఖపట్నం వంటి పట్టణాలకు వలస వెళ్ళారు.

రైల్వేశాఖలో ఉద్యోగం చేసిన కొడుకుల రామనాథశాస్త్రిగారు అనకాపల్లిలో స్థిరపడ్డారు. అయ్యలవారు, కన్నేపల్లివారు ఇక్కడ ఉన్నప్పటికి కొడుకుల వారు ఎక్కువగా ఉన్నారు. ఇచ్చటి నుండి వలస వెళ్ళిన వారిలో కొడుకుల వారు ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు.

★

# ఇంకా ఉంది...

"Every Temptation will have its own price and labour" అని ఆంగ్లోక్తి. ఏ వ్యామోహానికైనా దానిని చేతికి తీసుకునే విషయంలో శ్రమా, ఖర్చూ తప్పవు - అని అర్థం చేసుకోవచ్చును. నా చిన్ననాటి రోజులు బ్రాహ్మణుల సాహచర్యంలో గడిచాయి. ఆ సాహచర్యపులోతు తరువాతి కాలపు నా దినచర్యను మాత్రమే కాక నా ఆలోచనా విధానాన్ని కూడా ప్రభావితం చేసిందని నాకు అనిపిస్తుంది. ఉద్యోగ ధర్మంచేత ఏదో ఒక కులంవారికి కాని బంధువులలో ఒకరికి గాని ఉపకారాలు చేయాలన్న చాపల్యం నాకెప్పుడూ కలగలేదు. కాని బ్రాహ్మణుల పట్ల నా హృదయంలో స్వల్పమైనదైనా ఒక సాఫ్ట్‌కార్నర్ ఏర్పడి ఉండడం అది నా ప్రమేయం లేకుండానే అమలు అయింది. చివరకు ఉద్యోగ విరమణ అనంతరం బ్రాహ్మణ కులానికి లేదా జాతికి లేదా సంప్రదాయానికి సంబంధించిన గౌరవాన్ని పేర్కొనే పని ఏదో ఒకటి చేయాలని మనసులో నాటుకున్న కోరిక. అదే ఈ గ్రంథ రచనకు ప్రేరణ. ఒక మహా సంప్రదాయం అందులో ఉన్న తప్పొప్పులతో సంబంధం లేకుండా చేయి జారిపోయింది. ఇది ఎవరికి ఎలా ఉన్నా నాకు మాత్రం బాధాకరమైన సంగతిగా తోచింది.

శ్రీశ్రీ గారు "బాధ, కవిత్వానికి పర్యాయపదం" అన్నారు. అది ఇదేనేమో!

నా సర్వీసులో నేను ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతంలో చాలా చోట్ల పనిచేసి చాలా స్థలాలలో ప్రజల స్థితిగతులు, మనోభావాలు, ప్రవర్తనలు - ఎలా ఎలా ఉన్నాయో చూడగలిగాను. ఎక్కువ కాలం ఉత్తరాంధ్రలో పనిచెయ్యడం వలననో; చిన్ననాటి నుండి బ్రాహ్మణుల పట్ల సహానుభూతి ఉండడం వలననో ఈ ప్రాంతంలో బ్రాహ్మణాగ్రహారాలు ఏర్పడిన కారణాలు, పరిస్థితులు నా మనసుకు నచ్చినవి కావడం వల్లనో - ఈ పుస్తక రచన చేపట్టాను. కాలగమనంలో గ్రామాల పరిస్థితులు అనూహ్యంగా మారిపోయాయి. చాలా అగ్రహారాలు వాటి మౌలిక విలువలకు దూరమయ్యాయి. "బ్రాహ్మణుల్లో ఉన్నంత మాలకూడు మరెక్కడా లేదు" అని గురజాడ అప్పారావు గారు వచించినప్పటికీ అది పరిణామ కారణంగా ఏర్పడిన విపరిమాణపు రూపమే గాని మూలాలకు సంబంధించినది కాదని నా వ్యక్తిగతమైన నమ్మకము.

ఆ మూలాలు చెడి ఆ పరిణామాలు దెబ్బలై చివరికి సమాచార సేకరణ చాలా కష్టమైంది. ఇందులో పేర్కొన్న సుమారు 60 అగ్రహారాలలో ఎక్కడికి వెళ్ళినా ఆయా చోట్ల "ఇంగువ కట్టిన గుడ్డలు కూడా దొరకలేదు." ఎవరి మూలాలను వారే

విస్మృతిలోనికి నెట్టుకున్న ఉదంతాలు నా దృష్టికి వచ్చాయి. రాకపోకలకు సరైన సౌకర్యాలు ఏర్పడ్డాయి గాని మనిషి లోపలి మనిషి తానెవరో తానే ఎరుగని స్థితి ఏర్పడినట్లు తోస్తుంది.

అయినా సరే నేను తలపెట్టిన పుస్తకాన్ని అగ్రహారికులే కాక అగ్రహారాలకు చెందని ఇతర బ్రాహ్మణులే కాక మరికొంతమంది కూడా "For what it is worth" ధోరణిలోనైనా చదువుకొని నన్ను దీవించగలుగుతారనే విశ్వాసంతో ఈ పుస్తకాన్ని సమర్పిస్తున్నాను.

సమాచార సేకరణలో, ఫోటోల విషయంలో మంచి మంచి సంగతుల వివరణలలో నాకు తోడ్పడినవారు ఎందరో ఉన్నారు. కొందరు ఎవరి ఇంటి వద్ద వారు కూర్చొని సహాయపడ్డారు. కొందరు వారికి వారుగా ప్రయాణాలు చేసేరు. కొందరు నాతోపాటు ఈ విషయాలు చర్చించడానికి గంటలు గంటలు సమయం వెచ్చించారు. వారందరినీ పేరుపేరునా, వరుస వరుసనా ఉదహరించడం సాధ్యమూ కాదు. కొన్ని సందర్భాలలో సమంజసమూ కాదు. అయినా సరే, నా రెండవ కుమారుడు ముస్తాక్ మహమ్మద్, నా వ్రాయసకాడు దధిరావు శ్రీనివాస్, నా చిరకాల మిత్రుడు రామగోపాలం, అతని వ్రాయసకత్తె పద్మగౌరి, అతని మేనకోడలు అన్నపూర్ణ, ఆమె భర్త ముక్కవిల్లి రమణమూర్తిగారు, భమిడిపాటి రామకోటిగారు, తారువ కరణం విశ్వేశ్వరరావుగారు, సాలూరు డాక్టర్ బి.ఎస్.ఎన్. మూర్తిగారు, డాక్టర్ టి.ఎస్. దయాళ్ గారు, ప్రముఖ సమాజ సేవాపరాయణుడు సి.ఎస్. రావు (ఐ.ఈ.ఎస్.) గారు, నా మూడవ కుమారుడు ఇలియాస్ మహమ్మద్ మరియు అతని అనుయాయులు, రిటైర్డ్ సర్వే ఆఫీసర్ గదాధర పట్నాయక్ గారు, ఇవటూరి నందికేశ్వరరావుగార్లకు నా మనోగత ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

ముఖ్యంగా ఈ పుస్తకం నేను రచిస్తానని చెప్పగానే "అందుకు అయ్యే ఖర్చులో కొంతభాగం" అంటూ ధనరూపంలో సహాయం చేసిన డా॥ డి. అప్పారావుగారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

ఉత్తరాంధ్ర అంటే ఒకనాటి విశాఖపట్నం జిల్లా. ఇది ఇప్పుడు మూడు జిల్లాలుగా ఉంది. ఈ మూడు జిల్లాలలో సర్వీసు ఇనాములను మినహాయించి మిగిలిన హోల్ ఇనాము విలేజస్ జాబితాలను సేకరించాలని మూడు జిల్లాల కలెక్టరాఫీసులకు వెళ్ళాను. ఇనాముల రద్దు చట్టం 50యేళ్ళ నాటిదే అయినట్లు ఇనాముల సమాచారం కూడా పాతబడిపోయి ఇప్పుడు ఉన్న ఉద్యోగులకు ఎరుకలో లేదు. "ఇనామ్ ఫేర్

రిజిష్టర్" వంటి అపురూపమైన వెలకట్టలేని రికార్డులు దాచుకోలేదో లేక ఎక్కడ దాచారో తెలియదో తెలియదు. కాని, నా విషయసూచికలో పేర్కొన్న సుమారు 60 బ్రాహ్మణాగ్రహారాలు కాక, మూడు జిల్లాలలోనూ కలిపి సుమారుగా 30 వరకు ఇంకా ఉంటాయని నాకు తోస్తుంది. వీటిలో ప్రఖ్యాత రచయిత చాగంటి సోమయాజులు గారి 'లచ్చుమ్మపేట' అనే విపుల విస్తీర్ణ గ్రామం, రెండు శతాబ్దాల చరిత్రగల పిడపర్తి వారి బూరాడపేట నుండి అలనాటి గొలుగొండ తాలుకాకి చెందిన "ఏడుగు రన్నదమ్ముల అగ్రహారాలు" వరకు వ్యూహలోకి వచ్చినవి ఉన్నాయి. ఎవరిని అడిగినా "ఏమో, తెలియదు" రకానివి ఉన్నాయి. వయోభారాన్ని, శరీర భారాన్ని లక్ష్యపెట్టక వీటి సమాచారం కూడా సంపాదించి త్వరలోనే ఈ పుస్తకం రెండవ ముద్రణ తీసుకురాగలనని నమ్ముకుంటున్నాను. ఈ పుస్తకం చూచి ఎవరైనా Good Samaritans నాకు సహాయం చేయదలిస్తే వారు ఈ దిగువ ఉదహరించిన ప్రశ్నలకు జవాబుల రూపంలో అట్టి సమాచారాన్ని నాకు చేరవేయగలరని ప్రార్థిస్తున్నాను.

1. ఆ గ్రామానికి వెళ్ళే దారి ఏమిటి? (Location) 2. ఏ మహారాజుగారు, ఏ కాలంలో ఇచ్చారు? 3. ఏ ఇంటి పేరుగల వారికి ఇచ్చారు? 4. ఏ ప్రతిభ కోసం ఇచ్చారు? 5. పొలాల మొత్తం విస్తీర్ణం ఎంత? 6. మొదట్లో బ్రాహ్మణుల ఇళ్ళు ఎన్ని ఉండేవి, ఇప్పుడు ఎన్ని ఉన్నాయి? 7. ఇప్పుడు అక్కడ ఉన్నవారి జీవన వృత్తి ఏమిటి? 8. ఈ అగ్రహారంలో పుట్టినవారు, (లేక తమ మూలాలు ఇక్కడ ఉండిన వారు) ఎవరైనా (ఎవరెవరు) ప్రఖ్యాతులుగా, మార్గదర్శకులుగా, అధికారులుగా, విదేశవాసులుగా రూపొందారు? 9. ఆ ఊరి పురాతన గృహాల (శిథిలాల) ఫోటోలు గాని, ఆనాటి (ఈనాటి) మహానుభావుల ఫోటోలు గాని లభ్యమవుతాయా?

ఈ రచనను పాఠకులందరూ ఒక విన్నపంగా పరిగణించుకొని ఎవరికి వారు ఇవ్వగల మౌలిక సమాచారాన్ని చేరవేస్తే దానిని అనుసరించి ఈ పుస్తకాన్ని రెండవ ముద్రణకి తెచ్చుకొని నా ఆశయాన్ని పరిపుష్టం, పరిసమాప్తం చేసుకోగలుగుతాను.

అందరికీ కృతజ్ఞతలతో, సంప్రదాయాభిమాని

బొందిలీపురం
శ్రీకాకుళం - 532 001
ఫోన్ : 08942 278933

సంధ్యా వీరభద్ర స్వామి
15-3-2006

## నా దృష్టికి వచ్చీ కూడా పూర్తి సమాచారం లభ్యంకాని కొన్ని అగ్రహారాల పేర్లు

### ❖ విశాఖపట్నం జిల్లా

1. "ఏడుగురన్నదమ్ముల అగ్రహారాలు" అని చెప్పుకునే ఏడు అగ్రహారాలలో ఈ దిగువ పేర్లు మా దృష్టికి వచ్చాయి.

★ అనంత పద్మనాభ భూపతి అగ్రహారం

★ ఎర్రభూపతి అగ్రహారం

★ మల్లిభూపతి అగ్రహారం

★ ఎస్.బి. అగ్రహారం

★ వీరభూపతి అగ్రహారం

★ యరక భూపతి అగ్రహారం

★ ఏడవదాని పేరు కూడా నా దృష్టికి రాలేదు.

\- ఇవన్నీ ఒకనాటి గొలుగొండ తాలూకాలోనివి అని తెలుస్తున్నది.

2. దీక్షితుల అగ్రహారం (ఇది పెందుర్తి - కొత్తవలస హైరోడ్డుకు పడమటగా, పెందుర్తి - సబ్బవరం రోడ్డుకు ఉత్తరంగా ఎల్లుప్పి అనే గ్రామానికి సమీపంలో ఉందని తెలిసింది.)

### ❖ విజయనగరం జిల్లా

1. పంచాంగకర్తలైన పిడపర్తివారి బూరాడపేట అగ్రహారము. (నెలివాడ కొండకు ఉత్తరంగా ఉన్నదట)
2. లచ్చమ్మపేట (చాగంటి వారిది) అలనాటి శృంగవరపు కోట తాలూకాలోని కుమ్మపల్లికి తూర్పున ఉన్నదట.

### ❖ శ్రీకాకుళం జిల్లా

1. జాడుపూడి అగ్రహారం (శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలంలో ఉన్నదట)
2. కొండశేఖరాపల్లి (శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలంలో ఉన్నదట)

★

Blank page

# జ్యేష్ఠ లిటరరీ ట్రస్ట్

★ సుప్రసిద్ధ కథా రచయిత, కథా సాహిత్య అభిమాని "జ్యేష్ఠ" (కీ.శే. ఐ.సి.హెచ్.వి. బసవరాజు: 1939-99) స్మృత్యర్థం వ్యవస్థాపించిన కథా వేదిక.

★ 1992లో ప్రారంభించి, ప్రతి ఏటా, జ్యేష్ఠ జన్మదినం (జూన్ 24)నాడు గాని, కొంచెం అటూ ఇటూగా గాని, తెలుగు కథానికా ప్రక్రియలో సాధనచేసేవారిని ప్రోత్సహించే విధంగా "జ్యేష్ఠ లిటరరీ ఎవార్డులు" ఇవ్వాలని నిర్ణయం.

★ కథాసంపుటాలకు, తెలుగు కథను జాతీయ స్థాయిలో గల పత్రికలో హిందీలోకి గాని, ఇంగ్లీషులోకి గాని అనువదించి ప్రచురింప జేసిన వారికి మొత్తం మూడు నాలుగు అవార్డులు ఏటేటా.

★ లాభాపేక్ష లేకుండా కథాసంపుటాల ప్రచురణ.

☼ ☼ ☼

★ ఇప్పటి వరకూ 37మంది రచయితలూ, రచయిత్రులూ జ్యేష్ఠ లిటరరీ అవార్డులను స్వీకరించారు.

★ ఇప్పటి వరకు ఈ ట్రస్టు ముద్రతో 15 మంది రచయితలు వ్రాసిన 16 పుస్తకాల ప్రచురణ జరిగింది. ఈ 16 మాత్రమే కాక మరికొన్ని సంస్థల ప్రచురణల, మరికొందరు రచయితల కథా సంపుటాల; పంపిణీ, అమ్మకం చేపట్టాము. సరాసరి పాఠకులకు చేరుతాయి కనుక భారీ డిస్కౌంటు ఇస్తున్నాము.

| ఐ. జానకీదేవి | పెమ్మరాజు వెంకటరత్నం | భరాగో |
|---|---|---|
| చేర్ పర్సన్ | ఆర్గనైజింగ్ ట్రస్టీ | కరెస్పాండెంట్ |

1. అర్జున్ అపార్ట్‌మెంట్స్, ఇసుకతోట, విశాఖపట్నం - 530 022
ఫోన్ : 0891 - 2535550

# ప్రస్తుతం మావద్ద లభ్యమయ్యే పుస్తకాలు

(ఈ పుస్తకాలన్నీ ఆఫ్‌సెట్ ప్రింటింగులో, నాణ్యమైన కాగితం మీద ప్రింటు చేసినవి)

| వరుస నెంబరు | పుస్తకం పేరు | సైజు | పేజీలు | ప్రచురణ | అసలు ధర రూ. | నికరం (పోస్టేజి కాక) |
|---|---|---|---|---|---|---|
| 1. | జ్యేష్ఠ కథలు | 1/8 డెమీ | 266 | 1992 | 75 | 45 |
| 2. | జ్యేష్ఠ వ్యాసాలు | 1/8 డెమీ | 226 | 2000 | 80 | 45 |
| 3. | అపురూప కథాప్రభ | 1/8 డెమీ | 108 | 1996 | 25 | 15 |
| 4. | (రావిశాస్త్రికి) నివాళి | 1/4 క్రౌన్ | 128 | 1994 | 40 | 25 |
| 5. | ఛాయాచిత్రాలు (ఆర్.ఎస్. కృష్ణమూర్తి) | 1/8 డెమీ | 128 | 1996 | 32 | 25 |
| 6. | కథావశిష్టులు (ఏయస్వీ రమణారావు) | 1/8 డెమీ | 160 | 1997 | 50 | 30 |
| 7. | సంపెంగలూ సన్నజాజులూ (అవసరాల రామకృష్ణారావు) | 1/8 డెమీ | 188 | 2000 | 100 | 70 |
| 8. | పేకముక్కలు (అవసరాల రామకృష్ణారావు) | 1/8 డెమీ | 250 | 2001 | 100 | 60 |
| 9. | తెల్లటి చీకటి (వి. రాజారామమోహనరావు) | 1/8 డెమీ | 180 | 1999 | 75 | 45 |
| 10. | సరదా కథలు (భరాగో) | 1/8 డెమీ | 320 | 2000 | 116 | 70 |
| 11. | గాంధీ మేకు (డా. బి.ఎస్.ఎన్.మూర్తి) | 1/8 డెమీ | 145 | 2000 | 60 | 35 |
| 12. | గడ్డిపిల్లలు (రంధి సోమరాజు) | 1/8 డెమీ | 144 | 1994 | 35 | 25 |
| 13. | నూటపదహార్లు (సినిమా పాటల విశ్లేషణ భరాగో) | 1/4 డెమీ | 176 | 2005 | 180 | 180 |
| 14. | మరోనూటపదహార్లు (సినిమా పాటల విశ్లేషణ భరాగో) | 1/4 డెమీ | 250 | 2005 | 650 | 350 |
| 15. | కథన కుతూహలం (భరాగో) | 1/8 డెమీ | 160 | 2006 | 80 | 48 |

Blank page

Blank page



## సయ్యద్ మీర్ మహమ్మద్

జననం : 7-5-1937, కాకినాడ.

విజయనగరం మహారాజా కాలేజీ ద్వారా బి.ఎ. 1961లో సరాసరి నియామకం ద్వారా పోలీస్ సబ్ ఇనస్పెక్టర్‌గా ఉద్యోగంలో ప్రవేశం.

రాష్ట్రస్థాయిలో, జాతీయ స్థాయిలో "ఉత్తమ సేవా పతకం", "మహోన్నత సేవా పతకం", ధైర్యసాహసాల ప్రదర్శనకు గాను "రాష్ట్రపతి పతకం" పొందారు. ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కృష్ణా గుంటూరు, కర్నూలు, నెల్లూరు, వరంగల్ జిల్లాలో సబ్ ఇనస్పెక్టర్‌గా, సర్కిల్ ఇనస్పెక్టర్‌గా, డిప్యూటీ సూపరింటెండెంట్‌గా అధికారులు, ప్రజలు, రాజకీయ ప్రముఖులు మెచ్చిన బాణీలో విధి నిర్వహణ చేసి, శ్రీకాకుళం జిల్లా (అదనపు) పోలీసు సూపరింటెండెంట్‌గా 1995లో పదవీ విరమణ చేసేరు.

భార్య ఆస్మా బేగం, కుమారులు ఇషాక్, ముస్తాక్, ఇలియాస్; కుమార్తెలు జరీనా, సుల్తానా, షీరీ సుల్తానా (మూడవ సంతానం షిరీ సుల్తానా మాత్రమే అమెరికాలో ఉన్నారు)

లోతైన సంగీతం, నాణ్యమైన సాహిత్యం ఇష్టపదార్థాలుగా రాష్ట్రమంతటా అసంఖ్యాకులైన మిత్రులు, క్రీడా కార్యక్రమాల నిర్వహణ మరొక అభిరుచి.

పోలీసు శాఖలో తనకు కలిగిన తీపి, చేదు అనుభవాలతో కథలు కథలుగా 1999లో "నా జ్ఞాపకాలు" పేరిట ఒక పుస్తకం ప్రచురించారు.

**Rs. 60**







